


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




ఖమ్మం | 29-05-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 315 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal
Follow us on

## తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇస్తాం

### రైతులకు అభయం



రానున్న నాలుగు రోజులూ యంత్రాంగమంతా

అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోలు చేసిన

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి : మంత్రి ఉత్తమ్

భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష

మా ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి దిగుబడులు వచ్చాయి

బిజెపి నాయకులు బస్సు యాత్రలు చేయడం కాదు

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన

నిధులు ఇప్పించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**భువనగిరి, మే 28 (వుదయం ప్రతినిధి) :** తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మరోసారి విస్పష్టం చేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని కలెక్టర్ అనురాగ్ జయంతి వివరించారు. ధాన్యం కొనుగోళ్లపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో

మిగతా 2లో



## కాషాయ దళపతులు

4 రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను ప్రకటించిన బీజేపీ

ఢిల్లీ, హర్యానా, పంజాబ్, త్రిపుర రాష్ట్రాలకు కొత్త

రాష్ట్ర అధ్యక్షులు : ఢిల్లీకి హర్ష్ మల్హోత్రా ఎంపిక

**న్యూఢిల్లీ, మే 28 (వుదయం బ్యూరో) :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గురువారం నాడు ఢిల్లీ, హర్యానా, పంజాబ్, త్రిపుర రాష్ట్రాలకు కొత్త రాష్ట్ర అధ్యక్షులను నియమిస్తూ, సంస్థాగత నియామకాల తాజా జాబితాను ప్రకటించింది. ఈ పునర్వ్యవస్థీకరణలో భాగంగా, కేంద్ర సహాయ మంత్రి, ఎంపీ హర్ష్ మల్హోత్రా పార్టీ ఢిల్లీ విభాగానికి అధ్యక్షుడిగా నియమితులవ్వగా, హర్యానాలో బీజేపీకి నాయకత్వం వహించడానికి అర్చన గుప్తాను ఎంపిక చేశారు. త్రిపురలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, పార్టీ అభిషేక్ద బ్రాయ్‌ను కొత్త రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించగా, పంజాబ్ విభాగానికి కేవల్ సింగ్ దిల్లాన్‌ను అధిపతిగా నియమించింది. బీజేపీ నాయకత్వంలో జరగబోయే విస్తృత సంస్థాగత పునర్వ్యవస్థీకరణకు ఈ నియామకాలు నాందిగా భావిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలలో కొత్త కార్యవర్గ సభ్యుల ఎంపికకు సన్నాహాలు జరుగుతున్నాయి.

మిగతా 2లో

## ఆత్మహత్య కాదు, విచ్ఛిన్నమైన, అవినీతిమయమైన వ్యవస్థ

### నీట్ అభ్యర్థి మృతిపై రాహుల్ గాంధీ ఆగ్రహం



విఫలమైన వ్యవస్థ ఫలితమే ప్రదీప్ మృతి

కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర

మోడీ, కేంద్ర ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలి

పోటీ, భవిష్యత్తుపై అనిశ్చితితో సతమతం

వారి కుటుంబాల కలలను నాశనం చేస్తున్నాయి

**వుదయం డెస్క్, మే 28 :** నీట్ పేపర్ లీక్ విషయంపై తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారంలో ఉన్న నీట్ అభ్యర్థి ప్రదీప్ మేఘ్వాల్కు టుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధ వారం కలిశారు. విఫలమైన, అవినీతిమయమైన వ్యవస్థ నుండి విద్యార్థులను కాపాడటంలో కేంద్రం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఆ కుటుంబం పడుతున్న బాధను మాటల్లో వర్ణించలేమని రాహుల్ గాంధీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మరణం వ్యక్తిగత చర్య కాదని, వ్యవస్థాగత వైఫల్యం ఫలితమేనని ఆయన అభివర్ణించారు. ప్రదీప్ మరణం ఆత్మహత్య కాదు, అది విఫలమైన, అవినీతిమయమైన వ్యవస్థ ఫలితం, అని గాంధీ అన్నారు. పరీక్షల వ్యవస్థను మాఫియాలకు అప్పగించేశారని ఆయన ఆరోపించారు. పరీక్షల అవకతవకలు, పేపర్ లీక్ వివాదాల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఇప్పటికే విద్యా ఒత్తిడి, పోటీ, భవిష్యత్తుపై

మిగతా 2లో



## సిఎం పదవికి సిద్ధ రామయ్య రాంరాం

కర్ణాటక ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్‌కు లైన్ క్లియర్

ఒక ఎమ్మెల్యేగా, మంత్రి, ముఖ్యమంత్రిగా

అవుతానని కలలో కూడా ఊహించలేదు

కేబినెట్ సహచరుల కోసం అల్పాహార సమావేశం

రాజీనామా అనంతరం సిద్ధ రామయ్య భావోద్వేగం

**బెంగళూరు, మే 28 (వుదయం) :** ముఖ్యమంత్రి సిద్దరామయ్య లోక్ భవన్‌లో తన రాజీనామాను సమర్పించడంతో ఎన్నో ఊహాగానాలకు ముగింపు పలుకుతూ కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు గురువారం కంచికి చేరింది. గవర్నర్ సాయంత్రం 7.30 గంటలకు చేరుకుని రాజీనామాను ఆమోదించనున్నారు. రాజీనామా సమర్పించిన అనంతరం, సిద్దరామయ్య గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, తాను రాజీనామా సమర్పించిన విషయాన్ని ధృవీకరించారు. మొన్న కాంగ్రెస్ హైకమాండ్ ఈ నిర్ణయాన్ని తెలియజేసిందని కూడా ఆయన తెలిపారు. నేను గవర్నర్ కార్యాలయానికి నా రాజీనామాను సమర్పించాను. గవర్నర్ ఇక్కడ లేరు. ఆయన ఈ రాత్రికి తిరిగి వస్తున్నారు. అందుకే, నేను ఆయన కార్యాలయంలో రాజీనామాను సమర్పించాను, అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. రాజీనామా చేయమని హైకమాండ్ ముందే చెప్పడంతో నేను ఈరోజు నా రాజీనామాను సమర్పించాను. గవర్నర్ వచ్చినప్పుడు దానిని ఆమోదిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది, ఎందుకంటే ఇది రాజ్యాంగం ప్రకారం జరగాలి. మేము సంపూర్ణ మెజారిటీలో ఉన్నాం. అందువల్ల, ముఖ్యమంత్రిని (ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి) అనుమతించడం రాజ్యాంగబద్ధమే, అని ఆయన అన్నారు. తన పదవీ కాలం గురించి మాట్లాడుతూ కర్ణాటక ముఖ్యమంత్రి భావోద్వేగానికి లోనయ్యారు. తాను ఒక ఎమ్మెల్యేగా, మంత్రిగా లేదా ముఖ్యమంత్రిగా అవుతానని కలలో కూడా ఊహించలేదని ఆయన అన్నారు. ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని, కాంగ్రెస్ హామీలు రాష్ట్ర ఖజానాను దివాలా తీయిస్తాయని ప్రధాని మోడీతో సహా పలువురు తప్పుడు ప్రచారం చేశారని ఆయన అన్నారు. అల్పాహార సమావేశం నిర్వహించిన సిద్ధరామయ్య గురువారం ఉదయం సిద్ధరామయ్య బెంగళూరులోని తన అధికారిక నివాసంలో తన కేబినెట్ సహచరుల కోసం ఒక కీలకమైన అల్పాహార సమావేశాన్ని నిర్వహించారు.

మిగతా 2లో

### యూనిఫైడ్ కార్డ్

## సమగ్ర సంక్షేమం



*సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుంది. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుంది. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుంది. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలి. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలి. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలి. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలి.*

*– సిఎం రేవంత్ రెడ్డి*

ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల

వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా చర్యలు

అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

ఇటీవల నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలి

వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్

ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలి

కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు

అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి

ఈ విధానంతో నిజమైన అర్హులకు పథకాలు చేరుతాయి

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 28 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్) రూపొందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారుల సమీక్షలో సిఎం ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డ్‌లో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు.

మిగతా 2లో



## అస్సాం ముఖ్యమంత్రికి ఢిల్లీ కోర్టు నోటీసులు

శర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ

దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు నోటీసు జారీ

**న్యూఢిల్లీ, మే 28 (వుదయం) :** మియా ముస్లింలపై చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల విషయంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు ఆయనకు నోటీసు జారీ చేసింది. బీజేపీ నాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడానికి నిరాకరించిన మునుపటి మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ కార్యకర్త హర్ష్ మందర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న అదనపు సెషన్స్ జడ్జి సోను అగ్నిహోత్రి ఈ నోటీసును జారీ చేశారు.

మిగతా 2లో




2

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

ఎయిర్ ఇండియా టెల్ అవీవ్ విమాన

సర్వీసులు జూలై 31 వరకు నిలిపివేత

## జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు

ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చింది : మంత్రి వివేక్

హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం

ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర: మంత్రి అడ్లూరి





**మంచిర్యాల, మే 28 (వుదయం ప్రతినిధి) :** తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హమాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40

మిగతా 2లో



## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం

మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మే 28 (ఎఎంస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో

## ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా

### భారత రత్న ఇవ్వాలి : ఎపి సిఎం చంద్రబాబు

మహానాడులో ఏకగ్రీవ తీర్మానం చేసిన సిబిఎన్

తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి

గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారు

దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు లేరు

1983లో రాజకీయాల్లో యువతకు అవకాశాలు కల్పించారు

మహిళలకు భరోసా, కార్మికులకు అభయం



**అమరావతి, మే 28 (ఎఎంస్) :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు తెలుగుజాతి సెంటిమెంట్ అని ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని అడుగుతానని తెలిపారు. గురువారం మంగళగిరిలో జరుగుతున్న మహానాడు వేడుకలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, టీడీపీ సీనియర్ నేతలు, మంత్రులు నివాళులు అర్పించారు. 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా.. రైతుకు నేస్తమని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా మొదలై,

మిగతా 2లో

## ఫ్యూచర్ సిటీ దేశానికే తలమానికం

మొదటి పేజీ తరువాయి

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు

## సమగ్ర సంక్షేమం

మొదటి పేజీ తరువాయి

అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ఓఎస్ ఎం వివాదం నేపథ్యంలో సీబీఎస్ఈ లోపాలకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది

**విద్యాశాఖ మంత్రి**



**న్యూఢిల్లీ, మే 28 (వుదయం) :** పన్నెండవ తరగతి బోర్డు పరీక్షల పునర్మూల్యాంకన ప్రక్రియను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ప్రారంభించిందని, మార్కులు, జవాబు పత్రాలలో వ్యత్యాసాలకు సంబంధించిన ప్రతి ఆందోళనను పూర్తి జవాబుదారీతనంతో పరిష్కరిస్తామని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈరోజు విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఢిల్లీలో సీబీఎస్ఈ అధికారులతో సమావేశం అనంతరం మాట్లాడిన మంత్రి, ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలకు దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారని, దీని ఫలితంగా సుమారు 98 లక్షల జవాబు పత్రాలు, దాదాపు 40 కోట్ల స్కాన్ చేసిన పేజీలు వెలువడ్డాయని తెలిపారు. ఈ మూల్యాంకన ప్రక్రియ దేశంలోనే అతిపెద్ద విద్యా మూల్యాంకన కార్యక్రమాలలో ఒకటని ఆయన అభివర్ణించారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షల పునర్మూల్యాంకన ప్రక్రియను ప్రారంభించింది. సుమారు 17 లక్షల మంది విద్యార్థులు ఇందులో పాల్గొనగా, దాదాపు 98 లక్షల జవాబు పత్రాలు, అంటే మొత్తం దాదాపు 40 కోట్ల స్కాన్ చేసిన పేజీలు సమర్పించారు. పారదర్శకత, విద్యార్థి కేంద్రీకృత సంస్కరణలను లక్ష్యంగా పెట్టుకుని, సీబీఎస్ఈ తొలిసారిగా డిజిటల్ మూల్యాంకన వ్యవస్థను ప్రవేశపెట్టింది. విద్యార్థులు ఇప్పుడు తమ స్కాన్ చేసిన జవాబు పత్రాలను చూసి మార్కులను సరిచూసుకోవచ్చు, అలాగే తమ సందేహాలను కూడా నివృత్తి చేసుకోవచ్చు. ఇప్పటివరకు, సుమారు 4 లక్షల మంది విద్యార్థులు తమ జవాబు పత్రాలను తిరిగి పొందారు, ఇందులో భాగంగా దాదాపు 11 లక్షల ప్రతులు ఉన్నాయి, అని ప్రధాన్ వివరించారు.

**డిజిటల్ మూల్యాంకన వ్యవస్థ**

పరీక్షల ప్రక్రియలో పారదర్శకత, సామర్థ్యం, విద్యార్థి-కేంద్రీకృత సంస్కరణలను నిర్ధారించే లక్ష్యంతో సీబీఎస్ఈ తొలిసారిగా పూర్తిస్థాయి డిజిటల్ మూల్యాంకన వ్యవస్థను ప్రవేశపెట్టిందని ప్రధాన్ తెలిపారు. ఈ కొత్త వ్యవస్థ కింద, విద్యార్థులు ఇప్పుడు తమ జవాబు పత్రాల స్కాన్ చేసిన కాపీలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు, కేటాయించిన మార్కులను సరిచూసుకోవచ్చు, మూల్యాంకనానికి సంబంధించి సందేహాలు అడగవచ్చు. మంత్రి ప్రకారం, దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థులు ఇప్పటికే తమ స్కాన్ చేసిన జవాబు పత్రాలను పొందారు, దీంతో దాదాపు 11 లక్షల జవాబు ప్రతులు అందుబాటులోకి వచ్చాయి. పరీక్షా ప్రక్రియపై నమ్మకాన్ని బలోపేతం చేయడానికి, విద్యార్థులకు వారి ఫలితాలపై మరింత స్పష్టతను అందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు.

**ఐఐటీలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల భాగస్వామ్యం**

డిజిటల్ మౌలిక సదుపాయాలకు మద్దతుగా, సాంకేతిక పర్యవేక్షణ, సాధారణ పర్యవేక్షణ కోసం సీబీఎస్ఈ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాన్పూర్, ఐఐటీ మద్రాస్‌తో సహా ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం తీసుకుంది. అదనంగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌తో సహా నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులు పునర్మూల్యాంకనం, ధృవీకరణ ప్రక్రియను సులభతరం చేయడానికి చెల్లింపు గేట్‌వేలను అనుసంధానించాయి. ఈ ప్రక్రియలో కొన్ని వ్యత్యాసాలు వెలుగులోకి వచ్చాయని విద్యాశాఖ మంత్రి అంగీకరించారు. వాటిని పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుందని తెలిపారు. దిద్దుబాటు చర్యలు అమలు చేస్తున్నామని, ఏ ఫిర్యాదు కూడా పరిష్కరించకుండా మిగిలిపోదని ఆయన విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొన్ని వ్యత్యాసాలను గుర్తించి, బాధ్యతను స్వీకరించి, దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తోంది. ఏ విద్యార్థి సమస్య కూడా పరిష్కారం కాకుండా మిగిలిపోకుండా అధికారులు చూసుకుంటారు, అన్ని స్థాయిలలో జవాబుదారీతనం ఉండేలా చూస్తారు అని విద్యాశాఖ మంత్రి తెలిపారు. ప్రతి స్థాయిలో జవాబుదారీతనం నిర్ధారించడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల సమస్యలన్నింటినీ సంబంధిత అధికారులు సకాలంలో, పారదర్శకంగా పరిష్కరించేలా చూస్తారని ప్రధాన్ నొక్కి చెప్పారు.

## జూన్ 3న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

**సొసైటీ అధ్యక్షులు మామిడి సోమయ్య**



**హైదరాబాద్, మే 28 (ఎఎంస్) :** గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ(జీహెచ్ జే ఎంఏసీ హెచ్ సీ) సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో జరుగుతుందని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేందుకు ఇటీవల ప్రక్రియను ప్రారంభించిన సందర్భంలో జరుగుతున్న ఈ సర్వసభ్య సమావేశం అత్యంత కీలకమైనదని, సొసైటీ సభ్యులందరు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని వారు ఒక ప్రకటనలో కోరారు.జీహెచ్ఎంసీ పరిధిలో పని చేస్తున్న దాదాపు 1350 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని,వీరిలో అత్యధిక శాతం జర్నలిస్టులు ఇరవై నుంచి 30 ఏళ్ళ సీనియారిటీ కలిగి ఉన్నారని పేర్కొన్నారు. 2008 నుంచి ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉండి ఇళ్ళస్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, కొంతమంది సీనియర్ పాత్రికేయులు ఇళ్ళస్థలాలు పొందకుండానే చనిపోయారని వారు తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జూన్ 3న జరిగే సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఇళ్ళస్థలాల సమస్య పై చర్చించి ఇళ్ళస్థలాల సాధనకు కార్యాచరణను రూపొందిస్తామని, ఇందుకోసం సీనియర్ సభ్యులతో కమిటీ వేస్తామని వారు పేర్కొన్నారు.

# ఎన్టీఆర్ అంటే పేదలకు భరోసా

మొదటి పేజీ తరువాయి



సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగు వారందరికీ పండుగ రోజు అని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుందని చెప్పారు. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దానికి తిరుగు ఉండదన్నారు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరని.. ఆయన మొదట సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరారని ప్రస్తావించారు. నీతి నిజాయితీతో ఆయన సినిమాల్లోకి వచ్చారని.. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారని వ్యాఖ్యానించారు. ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిందని.. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు.

# మద్దతు ధర ఇస్తాం

మొదటి పేజీ తరువాయి



సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ముందు యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు పరిశీలించి రైతులతో మాట్లాడి, వాని సమస్యలు తెలుసుకున్నారు. రానున్న నాలుగు రోజులూ యంత్రాంగమంతా అప్రమత్తంగా వ్యవహరించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని అధికారులకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ప్రైవేట్ లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఉపయోగించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ 1 నాటికి కొనుగోళ్లు పూర్తి చేయాలని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా దీనికి సహకరించాలని ఆయన సూచించారు. తమ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి కనీవినీ ఎరుగని రీతిలో దిగుబడులు వచ్చాయని.. ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఉత్తమ్ తెలిపారు. ప్రతిపక్షాలు రాజకీయం చేయడానికి యాత్రలు చేపడుతున్నాయన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. బిజెపి నాయకులు బస్సు యాత్రలు చేయడం కాదని.. ఢిల్లీ యాత్ర చేసి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వడ్లు అంటే తెలియని వారు వాటి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు సంకెళ్లు వేసి నడిరోడ్డుపై తిప్పిన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు

## ఆత్మహత్య కాదు, విచ్ఛిన్నమైన, అవినీతిమయమైన వ్యవస్థ



అనిశ్చితితో సతమతమవుతున్నారని, పేపర్ లీక్‌లు విద్యార్థుల, వారి కుటుంబాల కలలను మరింతగా నాశనం చేస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు.

**యువత ఇకపై అవినీతిని సహించదు**

నీట్ అభ్యర్థులతో జరిపిన సంభాషణలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరీక్షా విధానంపై తాము విశ్వాసం కోల్పోయామని విద్యార్థులు తనతో చెప్పారని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. అవినీతిపైనా, ప్రభుత్వ నిష్క్రియాత్మకతపైనా యువతలో ఆగ్రహం వేగంగా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ దేశ యువత ఇకపై అవినీతిని, ఉదాసీనతను సహించదు, అని గాంధీ అన్నారు. యువత చివరికి వ్యవస్థలో మార్పు తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు.

## 2026 - 27లో ద్రవ్యార్జన కోసం జాతీయ రహదారి ప్రాజెక్టుల తాత్కాలిక జాబితా సిద్ధం



**వుదయం డెస్క్, మే 28 :** ప్రస్తుతం అందుబాటులో ఉన్న జాతీయ రహదారులు, సంబంధిత ఆస్తుల నుంచి ఆదాయాన్ని పొందడం కోసం.. 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను టోల్- నిర్వహణ - బదిలీ (టీవోటీ), మౌలిక సదుపాయాల పెట్టుబడి నిధి (ఇన్విట్) పద్ధతుల్లో ఆదాయాన్ని పొందేందుకు ప్రతిపాదించిన జాతీయ రహదారి మార్గాల తాత్కాలిక జాబితాను ఎన్‌హెచ్ఏఐ ఖరారు చేసింది. అయితే 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను రాజ్‌మార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఆర్ఐఐటీ) ద్వారా ఆదాయం పొందాలని ప్రతిపాదించిన ఆస్తులను ఈ జాబితాలో చేర్చలేదు. మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడం కోసం అవసరమైన మూలధనాన్ని సమీకరించడం, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణతోపాటు ఆధునికీకరణను వేగవంతం చేయడం లక్ష్యంగా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జాతీయ రహదారి ఆస్తులను సద్వినియోగం చేసుకుంటూ, ఆస్తుల ద్వారా ద్రవ్యార్జన (మానిటైజేషన్) చేయాలన్న భారత ప్రభుత్వ వ్యూహంలో ఈ కార్యక్రమం భాగం. పెట్టుబడిదారులు లేదా బిడ్డర్లు తమ పెట్టుబడులను అత్యంత సమర్థమైన రీతిలో ప్రణాళిక చేసుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. గుర్తించిన జాతీయ రహదారుల మొత్తం పొడవు 1692.5 కిలోమీటర్లు. హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్రల్లో ఇవి విస్తరించి ఉన్నాయి. సుస్థిర రవాణా సామర్థ్యం, పటిష్టమైన రవాణా ప్రాధాన్యం కలిగిన ఆర్థిక, లాజిస్టిక్స్ కారిడార్లుగా ఈ రహదారి ఆస్తులు ఉంటాయి. 17 ప్రాజెక్టుల జాబితాను ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. టీవోటీ, ఇన్విట్ పద్ధతుల్లో అత్యంత పారదర్శకమైన, నిర్మాణాత్మక విధానాల ద్వారా ఈ ద్రవ్యార్జన ప్రక్రియ జరుగుతుంది. సుస్థిర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం వినూత్న ఆర్థిక విధానాలను అవలంబించడం, ఆస్తుల సమర్థ నిర్వహణ - కార్యాచరణలో అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పడం ద్వారా.. జాతీయ రహదారి మౌలిక సదుపాయాలను మరింత విస్తరించడానికి అవసరమైన దీర్ఘకాలిక సంస్థాగత పెట్టుబడులను ఆకర్షించడంలో ఈ రెండు విధానాలు అత్యంత విజయవంతమైన నమూనాలుగా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే, సరుకు రవాణా సామర్థ్యాన్ని పెంపొందించే, అంతరాయం లేకుండా అనుసంధానాన్ని అందించే.. ఆధునిక, పటిష్టమైన, సుస్థిర జాతీయ రహదారి వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ కట్టుబడి ఉందని ఈ చర్యతో స్పష్టమవుతోంది.

## జూన్ 6 వరకు ధాన్యం కొనుగోళ్లు

మొదటి పేజీ తరువాయి

లారీలను కేటాయించామని అన్నారు. మొత్తం 80 లారీలతో త్వరలోనే రైతుల నుంచి చివరి గింజ వరకు ధాన్యం కొని మిల్లులకు తరలిస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటున్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. జేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు.



# కాషాయ దళపతులు

మొదటి పేజీ తరువాయి

ఈ నియామకాలన్నీ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ చేయగా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ జారీ చేసిన వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా ఈ ప్రకటనలు వెలువడ్డాయి. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయి, అని సింగ్ అన్నారు. రాబోయే కీలక ఎన్నికల పోరాటాల నేపథ్యంలో బీజేపీ తన రాష్ట్ర స్థాయి నాయకత్వ నిర్మాణాన్ని చురుకుగా బలోపేతం చేస్తున్న తరుణంలో ఈ సంస్థాగత మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో పార్టీ తన కేంద్ర నాయకత్వానికి, ప్రాంతీయ విభాగాలకు మధ్య సమన్వయాన్ని క్రమబద్ధీకరించాలని చూస్తోంది.

**కొత్త రాష్ట్ర అధ్యక్షులు**

**హర్ష్ మల్హోత్రా..** మొదటిసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన హర్ష్ మల్హోత్రా, తన బలమైన సంస్థాగత నైపుణ్యాలు, ఢిల్లీ రాజకీయాలలో విస్తృతమైన క్షేత్ర స్థాయి అనుభవం కారణంగా బీజేపీలో విస్తృతంగా గుర్తింపు పొందారు. ఆయన ప్రస్తుతం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పనిచేస్తున్నారు. లోక్‌సభలో తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో, క్రికెట్ బాధ్యతలపై దృష్టి పెట్టడానికి తప్పుకున్న మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్థానంలో మల్హోత్రా తూర్పు ఢిల్లీ నుండి బరిలోకి దిగారు. ఆయన ఇండియా బ్లాక్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌ను 93,663 ఓట్ల తేడాతో ఓడించి ఆ స్థానాన్ని గెలుచుకున్నారు. పార్లమెంటులోకి ప్రవేశించడానికి ముందు, మల్హోత్రా బీజేపీ ఢిల్లీ విభాగంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేయడంతో సహా కీలకమైన సంస్థాగత పదవులను నిర్వహించారు. ఆయన రాజకీయ ప్రస్థానం పురపాలక స్థాయిలో ప్రారంభమైంది. అప్పటి తూర్పు ఢిల్లీ పురపాలక సంస్థలో 2012లో వెల్కమ్ కాలనీ నుండి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన ఆ సంస్థ విద్యా కమిటీకి అధ్యక్షత వహించి, 2015-16లో తూర్పు ఢిల్లీ మేయర్‌గా పనిచేశారు.

**కేవల్ సింగ్ ఢిల్లాన్..** బర్నాలా మాజీ ఎమ్మెల్యే అయిన కేవల్ సింగ్ ఢిల్లాన్, పంజాబ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారు. ఆయనను మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్అ మరీందర్ సింగ్‌కు సన్నిహితుడిగా పరిగణిస్తారు. ఆయన తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్‌తో ప్రారంభించి, 2022లో బీజేపీలోకి మారారు. ఢిల్లాన్ 2007 నుండి 2017 వరకు బర్నాలా అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత 2017లో ఆప్అభ్యర్థి గుర్మీత్ సింగ్ మీట్ హయేర్ చేతిలో ఆ స్థానాన్ని కోల్పోయి, 2019 లోక్‌సభ ఎన్నికలలో సంగ్రూర్ నుండి పోటీ చేశారు, అక్కడ ఆయన భగవంత్ మాన్ చేతిలో ఓడిపోయారు. బీజేపీలో చేరిన తర్వాత, ఆయన 2022 సంగ్రూర్ లోక్‌సభ ఉపఎన్నికలో, 2024 బర్నాలా అసెంబ్లీ ఉప ఎన్నికలో కూడా పోటీ చేసినప్పటికీ, రెండింటిలోనూ విఫలమయ్యారు.

**అర్చన గుప్తా..** పానిపట్ వాస్తవ్యురాలైన అర్చన గుప్తా, పార్టీ కొత్త రాష్ట్ర యూనిట్అ ధ్యక్షురాలిగా పదోన్నతి పొందక ముందు బీజేపీ హర్యానా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

**అభిషేక్ దేబ్రాయ్..** 2023 త్రిపుర శాసనసభ ఎన్నికలలో, అభిషేక్ దేబ్రాయ్ అత్యంత ప్రతిష్టాత్మకమైన మాతర్‌బారి నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, కాంగ్రెస్ అభ్యర్థి ప్రణజిత్ రాయ్‌ను 9,000 ఓట్లకు పైగా మెజారిటీతో ఓడించి విజయం సాధించారు.

# సిఎం పదవికి సిద్ధరామయ్య రాంరాం

మొదటి పేజీ తరువాయి



రాజకీయంగా ప్రాముఖ్యత కలిగిన ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు సీనియర్ మంత్రులు, కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వ్యక్తిగత కారణాలతో బుధవారం రాత్రి ఆలస్యంగా బెంగళూరు విడిచి వెళ్లడంతో సమావేశానికి హాజరు కాలేదు. నాయకత్వ మార్పును సులభతరం చేయమని కాంగ్రెస్ నాయకత్వం ఆదేశించిన తర్వాత సిద్ధరామయ్య గవర్నర్‌తో అపాయింట్‌మెంట్ కోరారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అయితే, లోక్ భవన్‌లోని అధికారులు ఆ తర్వాత ఎలాంటి అధికారిక అభ్యర్థన సమర్పించలేదని పేర్కొన్నారు.

**డీకే శివకుమార్‌కు మార్గం సుగమం**

తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించనప్పటికీ, డీకే శివకుమార్ లేదా డీకేఎస్ గా ప్రసిద్ధి చెందిన దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్ తదుపరి నాయకుడిగా బాధ్యతలు చేపట్టనున్నారని అందరికీ తెలుసు. కాంగ్రెస్ వ్యవస్థలో, రాజకీయ సంక్షోభాలను నిర్వహించడంలో, అస్థిరత సమయాల్లో శాసనసభ్యులను రక్షించడంలో పోషించిన పాత్ర కారణంగా శివకుమార్పా ర్టీ సమస్య పరిష్కర్తగా పేరు సంపాదించారు. 2017లో రాజ్యసభ ఎన్నికలకు ముందు గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల బసను బెంగళూరులోని ఒక రిసార్ట్‌లో ఏర్పాటు చేసినప్పుడు ఆయన జాతీయ స్థాయిలో దృష్టిని ఆకర్షించారు. ఈ చర్య సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అహ్మద్ పటేల్ విజయం సాధించడానికి దోహదపడింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన తీవ్రమైన ఫిరాయింపుల ప్రయత్నాల నుండి కాంగ్రెస్, జేడీ(ఎస్) శాసనసభ్యులను కాపాడటంలో సహాయపడి, చివరికి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు వీలు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీలతో ఆయనకున్న సన్నిహిత కార్య సంబంధం పార్టీ కేంద్ర నాయకత్వంలో ఆయన స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.

# అస్సాం ముఖ్యమంత్రికి ఢిల్లీ కోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ, మే 28 (వుదయం) :** మియా ముస్లింలపై చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల విషయంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు ఆయనకు నోటీసు జారీ చేసింది. బీజేపీ నాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడానికి నిరాకరించిన మునుపటి మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ కార్యకర్త హర్ష్ మందర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై విచారణ జరుపుతున్న అదనపు సెషన్స్ జడ్జి సోను అగ్నిహోత్రి ఈ నోటీసును జారీ చేశారు. మే 26 నాటి కోర్టు ఉత్తర్వు ప్రకారం, పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపిస్తున్నప్పుడు జీరో ఎఫ్ఐఆర్, ఇ-ఎఫ్ఐఆర్ పై హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్ఓపి) ప్రస్తావించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన వాదనలను దృష్టిలో ఉంచుకుని, జూలై 15, 2026 లోగా తగిన సమాధానం దాఖలు చేసిన మీదట ప్రతివాదులకు రివిజన్ పిటిషన్ నోటీసు జారీ చేయండి, అని కోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి శర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడానికి నిరాకరించిన మేజిస్ట్రేట్ కోర్టు ఏప్రిల్ 20 నాటి తీర్పును సవాలు చేస్తూ ఈ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. మియా ముస్లింలను లక్ష్యంగా చేసుకుని అస్సాం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రెచ్చగొట్టేవిగా ఉన్నాయని, వాటిపై క్రిమినల్ చర్య తీసుకోవాల్సి ఉంటుందని హర్ష్ మందర్ ఆరోపించారు. వలసలు, పౌరసత్వం వంటి అంశాలపై రాష్ట్రంలో జరుగుతున్న చర్చల నేపథ్యంలో అస్సాంలో బెంగాలీ మూలాలున్న ముస్లింలను సూచించడానికి సాధారణంగా వాడే మియా అనే పదం, గుర్తింపు, రాజకీయంగా సున్నితమైన అంశంగా మిగిలిపోయింది. ఈ విషయంపై తదుపరి విచారణ జూలై 15న జరగనుంది.



# గ్రేటర్ హైదరాబాద్



## త్యాగాల పునాదులపైనే ఇస్లాం నిలిచింది



**షాద్ నగర్ సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ**
**షాద్ నగర్ ఫరూక్ నగర్ లో ఘనంగా బక్రీద్ ప్రార్ధన వేడుకలు**
**ఖుర్బానీ విషయంలో నిబంధనలు పాటించాల్సిందే**

**షాద్ నగర్**

ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" ఎందరో మహానుభావుల త్యాగాల పునాదులపై ఇస్లాం మతం నిర్మించబడిందని త్యాగం, విశ్వాసం, దానానికి ప్రతిరూపం ముస్లిం సమాజమని షాద్ నగర్ సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ ఈద్గా వద్ద ఈద్‌ఉల్ అదా నమాజ్ ప్రార్థనలు ఘనంగా జరిగాయి. ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి షాద్ నగర్ సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ బక్రీద్ ప్రార్ధనల సందర్భంగా ప్రసంగిస్తూ ముస్లిం సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ బక్రీద్ పండుగనీ, పవిత్ర మక్కా యాత్ర హజ్ ఈ బక్రీద్ పండుగ నెలలోనే ఉంటుందని తెలిపారు. దైవానికి కావాల్సింది చిత్తశుద్ధి, సంకల్ప శుద్ధి. దీనిని చూడటం కోసమే అన్నట్లు దైవం సర్వ మానవాళికి వివిధ రూపాల్లో రకరకాల పరీక్షలు వస్తాయని అన్నారు. అల్లా కరుణ ఎంతో గొప్పదని కొనియాడారు. అల్లాను ఎప్పుడూ ప్రసన్నం చేసుకునే విధంగానే మన ప్రవర్తన ఉండాలని అన్నారు. అదేవిధంగా హాఫ్ ఏజ్ సయ్యద్ మునవ్వర్ అలీ మాట్లాడుతూ బక్రీద్ పండగ విశిష్టతను తెలిపారు. అల్లాపై ఉన్న భక్తితో ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్ధపడగా, ఆయన త్యాగానికి మెచ్చి అల్లా ఒక జంతువును బలిగా స్వీకరించినట్లు గ్రంథం ద్వారా పేర్కొనబడిందని వివరించారు. త్యాగాలు ఎంతో గొప్ప వని ముస్లింలు ఎల్లప్పుడూ త్యాగనిరతిని ప్రదర్శించాలని అన్నారు. ఖుర్బానీ పై కీలక వ్యాఖ్యలు బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు అన్ని నిబంధనలు పాటించాలని ముస్లిం సమాజానికి చెడ్డ పేరు వచ్చే విధంగా ప్రవర్తించే రాదని సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జంతుబలి జరగాలని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కుర్బాని ఇచ్చేందుకు గోవులను వధించ కూడదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఇతర మతాలను చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ముస్లిం సమాజంపై ఉందన్నారు. అదేవిధంగా ఖుర్బానీ సమయంలో వీధుల్లో రక్తం ప్రవహించేలా ఉండకూడదని, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని పారిశుద్ధ్యం నెలకొనేలా చూడాలని సూచించారు. జంతు బల్లుల సందర్భంగా స్థానిక ముస్లింలు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన రాష్ట్రాల వారు నిబంధనలను పాటించడం లేదని ఆపవాదు స్థానిక ముస్లింల పైన పడుతుందని దయచేసి ఈ విషయంలో వలస వచ్చిన బతుకుదెరువు కోసం ఇక్కడ ఉన్న ముస్లింలు నిబంధనలు పాటించాలని ఖుర్బానీ సమయంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చట్టానికి ప్రభుత్వ నిబంధనలకు సహకరించాల్సిన అవసరం అందరికీ ఉందని అన్నారు. గోవులను ఎక్కడ వధించరాదని సూచించారు. ఎవరైనా హద్దు దాటితే తామే ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ పట్టణంలోని ఫరూక్‌నగర్ ఈద్గా వద్ద బక్రీద్ (ఈద్ ఉల్అజ్హా) పండుగ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా హాజరయ్యారు. ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేసేందుకు షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే భీష్వ కిష్టయ్య ఈద్గా వద్దకు చేరుకున్నారు. ప్రార్థనల అనంతరం వారు మత పెద్దలను, ముస్లిం సోదరులను కలిసి ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. త్యాగానికి, భక్తికి నిదర్శనం బక్రీద్ పండుగ అని కొనియాడారు. సమాజంలో మనుషులంతా కలిసిమెలిసి ఉండాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ ఇస్తుందన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ముల్లా, గంగాజమునా తెహజీబ్ సంస్కృతితో జీవిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మాజీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, కౌన్సిలర్ మురళీ మోహన్, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, దిలీప్, రాజు నాయక్, ముబారక్ అలీ ఖాన్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్ శ్రీశైలం గౌడ్, కరుణాకర్, చందు నాయక్, తుపాకుల శేఖర్, సీతారాం, బాల గంధర్ తిలక్, బీరప్ప, శ్రీనివాస్ , శంకర్, యాదగిరి యాదవ్, రవితేజ, జయప్రకాష్ , సుదర్శన్, గంగమోని సత్తయ్య జగదీష్, మంగ మధు, మంగ అశోక్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## షాద్ నగర్ లో ఘనంగా ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకలు



**షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం.**
**ఎన్టీఆర్ ఓ యుగ పురుషుడు, ఆయనకు భారత రత్న పురస్కారం ఇవ్వాలి**
**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం శుభసూచకం.**
**కమ్మ సేవా సమితి డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు**

**రంగారెడ్డి జిల్లా**

షాద్ నగర్ పట్టణ పరిధిలోని ఎంపీ శేషయ్య నగర్ కమ్యూనిటీ హాల్ నందు 103 వ జయంతి వేడుకలను షాద్ నగర్ కమ్మ సేవా సమితి అధ్యక్షులు పాతూరి వెంకటరావు ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు గారి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం షాద్ నగర్ బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 1100 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమ్మ సేవా సమితి షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాతూరి వెంకట్రావు మాట్లాడుతూ.. తెలుగునేల పులకించి పోయే తెలుగు బిడ్డ, తెలుగు ప్రజలందరి చేత అన్నగారు అనిపిలిపించుకున్న మహానేత, దక్షిణ భారతదేశంలో పుట్టిన ముద్దుబిడ్డ చరిత్ర మరువని యుగపురుషుడు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు అని తెలుగు నేల ఉన్నంత వరకూ ఆయన చిరస్మరణీయుడనీ, తెలుగు వారి సామాజిక రాజకీయ ఉత్సవాలను రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకుంటున్నారనీ కొనియాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి ఆయన చేసిన గొప్ప సేవలను తెలుగు ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని కొనియాడారు. ఆయన ఆలోచనలు అజరామరం.. ఆయన నాయకత్వం అద్భుతాల నిలయం.. ఆయన దారి అనితరసాధ్యం.. అంటూ కీర్తించారు. భారతీయ సినిమాపైనే కాకుండా దేశ రాజకీయాల్లోనూ చెరగని ముద్రవేసి తనదైన చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించుకున్న మహనీయుడు ఎన్టీఆర్ అనీ, కృషి ఉంటే మనుషులు రుషులవుతారనే పదానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచి చరిత్రలో యుగ పురుషుడిగా నిలిచిపోయిన ఎన్టీఆర్ శత జయంతి అందరికీ పండగ లాంటిదని అన్నారు. ఆయనకు గౌరవ ప్రదమైన భారత రత్న పురస్కారం ఇవ్వాలి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం నాడు అమీర్పేట మైత్రీవనంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆవిష్కరించటం సంతోషంగా ఉందని , కమ్మ సేవా సమితి తరుపున ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు బండారుపల్లి నాగేశ్వర రావు, కొర్రపాటి శ్రీనివాస్ రావు, పాతూరి సత్యనారాయణ, పినపాక ప్రభాకర్ , గుదే వసంత రావు, పాతూరి బ్రహ్మయ్య , వట్టికొండ ఎర్రయ్య, మక్కపాటి మల్లేశ్వర రావు, నువ్వుల నాగేశ్వరరావు, ఆలపాటి పూర్ణ, కొడాలి సురేష్, కృష్ణారావు, కిలారు సాంబయ్య, సంజీవ రావు, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, నాగేశ్వర రావు, కోటేశ్వర రావు, కట్టా అప్పారావు, గుదే మస్తాన్ రావు, మలినేని శ్రీను , కట్టా హరి, కొత్త ప్రభాకర్, కొర్రపాటి శ్రీనివాస్, జొన్నలగడ్డ శ్రీనివాస్, యడ్ల శ్రీనివాస్ , కట్టా హరి, బొల్లినేని కోటేశ్వర్ రావు, పేరం అనిల్ , కనుమూరి రమేష్, కొర్రపాటి వెంకట్రావు, ఆలూరి శ్రీనివాస్, బ్రహ్మయ్య చౌదరి, మాధవ రావు. బాలయ్య, వెంకటేశ్వర రావు . నువ్వుల నాగేశ్వర్రావు, నువ్వుల వెంకటేశ్వర రావు , శశి, పాతూరి రఘు, పాతూరి విద్యాసాగర్, మక్కపాటి సతీష్ , సిరిపురపు వెంకట రమణ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## జూన్ 3న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

**హైదరాబాద్**
**వుదయం ప్రతినిధి మే 28:**

గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ(జీహెచ్ జే ఎంఏసీ హెచ్ సీ) సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభ లో జరుగుతుందని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేందుకు ఇటీవల ప్రక్రియను ప్రారంభించిన సందర్భంలో జరుగుతున్న ఈ సర్వసభ్య సమావేశం అత్యంత కీలకమైనదని, సొసైటీ సభ్యులందరు ఈ సమావేశానికితప్పనిసరిగా హాజరుకావాలని వారు ఒక ప్రకటనలో కోరారు.జీహెచ్ఎంసీ పరిధిలో పని చేస్తున్న దాదాపు 1350 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని,వీరిలో అత్యధిక శాతం జర్నలిస్టులు ఇరవై నుంచి 30 ఏళ్ళ సీనియారిటీ కలిగి ఉన్నారని పేర్కొన్నారు. 2008 నుంచి ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉండి ఇళ్ళస్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, కొంతమంది సీనియర్ పాత్రికేయులు ఇళ్ళస్థలాలు పొందకుండానే చనిపోయారని వారు తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జూన్ 3న జరిగే సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఇళ్ళ స్థలాల సమస్య పై చర్చించి ఇళ్ళస్థలాల సాధనకు కార్యాచరణను రూపొందిస్తామని, ఇందుకోసం సీనియర్ సభ్యులతో కమిటీ వేస్తామని వారు పేర్కొన్నారు.

## సిద్ధాపూర్ జోలికొస్తే సమరం తప్పదు ..

**సినీ నటుడు మహేష్ బాబు ఎక్కడ ?**
**దత్తత తీసుకున్న సిద్ధాపూర్ గ్రామానికి అన్యాయం జరుగుతుంటే మీరు స్పందించారా**
**డంపు కంపుపై ఊక దంపుడు ఉపన్యాసాలు ఆపాలి..**
**తక్షణమే ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి..**
**-----ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నరసింహ మాదిగ..**



**షాద్ నగర్ :**

ఎక్కడినుండో చెత్తను సేకరించి మా ప్రాంతంలో వేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో భారీ చెత్త డంప్ యార్డు నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో ఆయన తీవ్రంగా ఖండించి మాట్లాడారు. కొత్తూరు పారిశ్రామిక వాడ కావడంతో మండల వ్యాప్తంగా ఇప్పటికే తీవ్ర వాయు కాలుష్యం రాజ్యమేలుతోందని ఇప్పుడు డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపడితే ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతారన్నారు. పరిశ్రమలు అని.. ఉపాధి అని.. చివరికి రైతుల పొట్ట కొట్టి భూములు లాక్కున్నారని ఇప్పుడు.. ఆ భూముల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం సిగ్గుచేటు అన్నారు. సినీ నటుడు మహేష్ బాబు దత్తత తీసుకున్న గ్రామం మురికి కూపానికి గురవుతుంటే ఆయనతోపాటు ఆయన అభిమాన సంఘం మిన్నకుండిపోవడం సరికాదని ఈ విషయమై స్పందించి తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు. పరిసర గ్రామాలలో ఉన్న ప్రజలను ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భారీ ఎత్తున ఆందోళనకు తమ సిద్ధమని ప్రకటించారు..

## డిల్లీ గులాంలకు హైదరాబాద్ గులాబీకి చాలా తేడా ఉంది

**- మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి**
**- కార్యకర్త జోలికొస్తే ఊరుకోం.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే: 70MM సినిమా చూపిస్తాం!**
**- బోడుప్పల్ BRS సమావేశంలో మేడ్చల్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి**



**మేడిపల్లి వుదయం ప్రతినిధి మే 28.**

మేడ్చల్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి హాజరై, బూత్ కమిటీ సభ్యులకు నూతన డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు SIR (ఓటర్ల జాబితా సవరణ) అంశాలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో అధికారం కోల్పోవడం తాత్కాలికమేనని, విపక్షంలో ఉండే ఈ సమయం పార్టీ అంతర్గత బలాన్ని పెంచుకోవడానికి ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా నడిచే కాంగ్రెస్, బీజేపీల కంటే.. తెలంగాణ ప్రయోజనాల కోసం హైదరాబాద్ నుంచే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ పోరాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. గత పదేళ్ల BRS పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సోషల్ మీడియా ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే "సోషల్ మీడియా వారియర్స్" తయారుచేయడమే లక్ష్యమని తెలిపారు. యువతను ఆకర్షించేందుకు డిజిటల్ సభ్యత్వ నమోదు కీలకమని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరే ప్రతి కార్యకర్తకు ఇది సాధారణ రాజకీయ పోరాటం కాదని, తెలంగాణ పునర్నిర్మాణంలో రెండో దశ ఉద్యమమనే భావన కల్పించాలని నాయకులు పిలుపునిచ్చారు. నాయకత్వం క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుత పరిస్థితుల్లో కార్యకర్తలకు ఆర్థిక భరోసా కంటే ఆత్మగౌరవ భరోసా, రాజకీయ రక్షణ చాలా ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్తులో 70MM సినిమా చూపిస్తామని, రానున్న రోజుల్లో 'డీ అంటే డీ' అనే విధంగా తలపడతామని హెచ్చరించారు. బాధితులకు లీగల్ సెల్ ద్వారా తక్షణ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, స్థానిక నేతలు ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీను, బోడుప్పల్ నాయకులు కొత్త రవి గౌడ్, సామల సందీప్ రెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, కాటిపల్లి రాంచంద్రరెడ్డి, బండారం శ్రీధర్ గౌడ్, రమేష్ యాదవ్, మీసాల కృష్ణ, అలీం, రవికుమార్, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, బాలమల్లేష్, నాగేశ్వర్ గౌడ్, బొమ్మక్ విశ్వనాధం, రాసాల మహేష్ యాదవ్, ఉప్పరి విజయ్, కీర్తణ్,మాజీ ఎంపీటీసీ లు, నాయకులు, బూత్కమిటీసభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇకనైనా స్పందించేనా యంత్రాంగం?



**ఈద్గా దారినీ వదల్లేని మట్టి మాఫియా!**
**వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చిట్టిగిద్దలో దారుణం..**
**-పండుగ పూట ముస్లింల నిరసన!**

**వికారాబాద్ మే 28**
**(వుదయం బ్యూరో)**

అక్రమ సంపాదనే ధ్యేయంగా సాగుతున్న ఎర్రమట్టి తవ్వకాలు వికారాబాద్ జిల్లాలో హద్దులు దాటుతున్నాయి. ముఖ్యంగా నవాబ్‌పేట్ మండలం అక్రమ మట్టి తవ్వకాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందనడానికి తాజా ఘటనే నిదర్శనం. చిట్టిగిద్ద గ్రామంలోని సర్వే నంబర్ 510లో మట్టి అక్రమార్కులు కాసుల మైకంలో కండ్ల గుర్రం కట్టారు. పవిత్రమైన బక్రీద్ పండుగ వేళ ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకునే ఈద్గా దారిని కూడా చూడకుండా.. ఏకంగా దారినే అడ్డంగా తవ్వేసి తమ రాక్షసానందాన్ని చాటుకున్నారు.నెలల తరబడి 'వేల టిప్పర్ల' మట్టి తరలింపు.. అధికారుల కళ్లు కప్పారా? కుమ్మక్కయ్యారా? గత రెండు మూడు నెలల నుండి చిట్టిగిద్ద పరిసరాల్లో కొన్ని వేల టిప్పర్ల ఎర్రమట్టిని యథేచ్ఛగా తవ్వేసి, విక్రయాలు జరిపి మట్టి భూకబ్జాదారులు కాసుల వర్షం కురిపించుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఇంత పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక అసలు రహస్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు నిజంగానే ఈ విషయం తెలియదా? లేక అక్రమార్కులతో కుమ్మక్కై చూసిచూడనట్లు వదిలేశారా? అనే జోరుగా గుసగుసలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.పండుగ పూట రోడ్డుపైనే నిలిచిపోయిన ప్రార్థనలు..ఎస్ఐ చొరవతో సర్దుబాటు!ఈరోజు బక్రీద్ పర్వదినం సందర్భంగా గ్రామ ముస్లిం సోదరులు ఈద్గాకు వెళ్తుండగా, దారిని పూర్తిగా తవ్వేసి ఉండటం చూసి విస్తుపోయారు. ఆగ్రహించిన గ్రామస్తులు అక్కడే నిలిచిపోయి గంటల తరబడి తరలివెళ్లారు. పవిత్రమైన ఈద్గా దారిని తవ్వేసి, పండుగ పూట తమకు తీవ్ర మనోవేదన మిగిల్చిన అక్రమార్కులపై సమగ్ర విచారణ జరిపి, వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పోలీసులకు రాతపూర్వక మెమరండం అందజేశారు. జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశం**
**సిద్దిపేట జిల్లాలో 3.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ:**
**కలెక్టర్ హైమావతి**



**సిద్దిపేట, మే 27**
**(వుదయం బ్యూరో)**

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, అన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది ప్రజాపాలనలో రైతు పక్షపాత ప్రభుత్వమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 9,214 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, వాటిని వెంటనే లిఫ్ట్ చేసి రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించారు. కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు ఎక్కువ సంఖ్యలో లారీలు, హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలి. అవసరమైతే రాబోయే 5, 6 రోజులు ఇసుక లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లను ఉపయోగించుకోవాలి. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఈ రబీ సీజన్‌లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సీఎస్ లేదా సివిల్ సప్లైస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలి. వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ.. జిల్లాలో రబీ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, 427 కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3 లక్షల 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని తెలిపారు.రాత్రి కురిసిన వర్షాలకు జిల్లాలో 2,976 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, ఆ ధాన్యమంతటినీ వెంటనే లిఫ్ట్ చేసి మిల్లులకు తరలించామని వివరించారు. రేపు బక్రీద్ పండుగ కారణంగా లారీల డ్రైవర్ల కొరత వచ్చే అవకాశం ఉన్నందున, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్ మినహా మిగతా ప్రాంతాల్లో జూన్ మొదటి వారంలోగా కొనుగోళ్లు పూర్తవుతాయని కలెక్టర్ మంత్రికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్, అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఎస్సీఎస్ఓ తనూజ, డీఎం సీఎస్ఓ గోపికృష్ణ, డీఆర్డీఓ జయదేవార్య, డీసీఓ వరలక్ష్మి, డీఎం మార్కెటింగ్ నాగరాజు, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి మరియు రవాణా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణను అవమానిస్తే సహించం : నీరుడు సర్వేష్ ముదిరాజ్ ఘాటు హెచ్చరిక

**శంకర్ పల్లి మే 28 (వుదయం )**

తెలుగుదేశం పార్టీ డిక్షనరీలో తెలంగాణ అనే పదమే లేదంటూ షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన చారిత్రాత్మక ఉద్యమాన్ని, అమరుల త్యాగాలను అవమానించేలా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ సీనియర్ నాయకుడు నీరుడు సర్వేష్ ముదిరాజ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన బక్కని నరసింహులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడిన 1200 మంది అమరుల బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ తల్లిని అవమానించే వారెవరైనా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను తక్కువ చేసి మాట్లాడే వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని స్పష్టం చేశారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.

## కాజీపేట రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పూర్తి కావడానికి సిద్ధంగా ఉంది : అశ్విని వైష్ణవ్

**కాజీపేట :**

ఢిల్లీ ద్వారా భారతీయ రైల్వేకు చెందిన కాజీపేట రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పూర్తి కావడానికి సిద్ధంగా ఉంది. ఇది ఒక బహుముఖ రైల్వే రోలింగ్ స్టాక్ తయారీ యూనిట్. ప్రారంభంలో, కాజీపేట రాబోయే 5 సంవత్సరాలలో 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుంది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మరియు కేంద్ర రైల్వే సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు, సీనియర్ అధికారులతో కలిసి కాజీపేట రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కార్యాచరణలోకి



తీసుకువచ్చే ప్రణాళికలను సమీక్షించారు.

**IN THE COURT OF HON'BLE II ADDITIONAL DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT L. B. NAGAR.**
**I. A. No. 1188 of 2025**
**in**
**O. S. NO. 308 of 2022**

**Between:**
Kanala Nandam @ Dr. K. Sachidananda.
**....Petitioner/Plaintiff**
**AND**
Dasari Krishna Reddy & others.
**...Respondents/Defendants**

M/s. CVR Constructions and another
**...Respondents/Proposed Defendant No's. 8 & 9**
**(I. A. No. 57/2023**
Sri. Chejeti Srinivas Reddy and others.
**...Respondent No's. 11 to 45/ Proposed Defendant No's. 11 to 44**

To
11. Sri. Chejeti Srinivas Reddy S/o. Chejeti Venkateshwar Reddy, aged 50 Years, Occ: Business, R/o. Flat No.405, 4th Floor, Sai Srinivasa Towers, House No.2-22-314/D, Plot Nos. 159/A & 160-A, Opp. Ratnadeep Super Market, Addagutta Co-Operative Society Colony, Kukatpally Village and Mandal, Medchal-Malkajgiri District - 500085,
12. Smt. Chejeti Venkata Ramana W/o. Chejeti Srinivas Reddy, aged about 44 Years, Occ : House Wife, R/o. Flat No.405, 4th Floor, Sai Srinivasa Towers, House No.2-22-314/D, Plot Nos. 159/A & 160-A, Addagutta Co-Operative Society Colony, Kukatpally Village and Mandal, Medchal-Malkajgiri District 500085.
20. M/s. Spire Homes (Regd. Firm No. 379 of 2022) office at D.No. 1-111/2, S.V. Asha Arcade, 3rd Floor, Miyapur, Hyderabad-500049. Rep. By Managing partner B. Gangadhar Rao, S/o Ramalinga Rao, aged 47 years, R/o Plot No. 25, Muktha Residency, Allapur Housing Society, Nizampet Road, Tirumalgiri, Hyderabad – 500085.
21. Sri. Kodugula Suresh S/o. K Satyanarayana, aged 34 Years, Occ: Employee, R/o. House No. 9-10-3/VD/7, Roshandowla, Balapur, Ranga Reddy District-500005,
25. Madamoni Nagaraju S/o. M Venkaiah, aged 60 Years, Occ: Business, R/o. House No.5-13, Near Anjaneya Swamy Temple, Durga Nagar,Dilsukhnagar, Ranga Reddy District 500060, Telangana.
31. P. S. Vani Sree W/o. Erven Krishna, aged 48 Years, Occ: Govt. Employee, R/o. H. No.18-8-224/5/261, Rajanarasimha Colony, Saidabad, Hyderabad-500059,
34. Anreddy Parameshwar Reddy, S/o. A Balram Reddy, aged 60 Years, Occ: Employee, R/o. House No. 11-13-1163/1, Dwaraka Nagar, Opp. DPS School, RK Puram, Saroornagar, Ranga Reddy District-500035,
35. Kadukuntla Karuna Sree, W/o. Anreddy Parameshwar Reddy, aged 53 Years, Occ: Employee, R/o. House No.11-13-1163/1, Dwaraka Nagar, Opp. DPS School, RK Puram, Saroornagar, Ranga Reddy District-500035.
44. D. Ravindra S/o D. Venkatraju, aged 51 years, Occ: Govt. Employee,R/o. H. No. 15-145/29, Sharadha Theatre road, Kodandaram Nagar, Saroornagar, Ranga Reddy District-500060.
45. D. Sudharani W/o. D. Ravindra, aged 47 years, Occ: Housewife, R/o. H. No. 15-145/29, Sharadha Theatre road, Kodandaram Nagar, Saroornagar, Ranga Reddy District-500060.
**...Respondent No's. 11,12, 20,21, 31, 34, 35,44 & 45/ Proposed Defendant No's. 11, 12, 20,21, 31, 34, 35,44.**

**PUBLIC NOTICE**

That the above named Petitioner/ Plaintiff had filed the petition to implead you as Respondent No's. 11,12, 20,21, 31, 34, 35,44 & 45/ Proposed Defendant No's. 11, 12, 20,21, 31, 34, 35,44 in the above Suit filed for declaration of title and for recovery of possession and for Injunction against the defendants and the said matter is posted to 19-06-2026 for your appearance in the above said petition/suit. All of you are therefore hereby directed to appear before this Hon'ble Court on the above said date at 10.30 a.m. either in person or through your counsel, failing which the matter will be decided in your absence as per law.

***(BY ORDER OF THE COURT)***
**Sd/-**
**Ch. Lakshmi Narayana**
**B. Sai Sujith**
**T. Alekhya**
**D. Sarika**
**Advocate**
**76758 29699**
**94404 76239**
**Siri Residency, Flat No. 101, Vasavi Colony, Road no. 1, Plot no's. 5 & 6, Kothapeta. Hyderabad -500 102.**
**Email Id: chlnlegal@yahoo.co.in**

**MAA INSTITUTE OF SPEECH & HEARING (1687)**
1266, Jubliee Hills Check Post, Jubliee Hills, Hyderabad

Inviting applications for the following courses:

| S.No. | Course | Eligibility | Seats |
|---|---|---|---|
| 01 | M.Sc.(Audiology) | BASLP / B.Sc. (Speech & Hearing) / BSLH from a university recognized by the Rehabilitation Council of India (RCI) with Minimum 55% aggregate marks | 12 Seats |
| 02 | Bachelors in Audiology & Speech - Language Pathology (BASLP) | 10+2 or equivalent from a recognized State or Central Board with a minimum of 50% aggregate marks. With Physics, Chemistry, English and One additional subject from: Biology / Mathematics / Computer Science / Statistics / Electronics / Psychology | 25 Seats |
| 03 | P.G. Diploma in Early Intervention(PGDEI) | MBBS, BAMS, BUMS, BHMS, BNYS, BOT, BPT, BASLP, B.Ed. - Special Education, B.Sc. Nursing, Masters in Psychology, Social Work, Special Education, Child Development with 50% marks | 12 Seats |

**Applications are Issued. Last date of application is 6th July, 2026 and with late fee till 15th July, 2026.**

**For details contact: 8886689909 / 9100072758, mail to: admin@mish.co.in, www.mish.co.in**



" * అమెరికాతో కుదిరిన ముసాయిదా చట్రం ఒప్పందం ప్రకారం, నెల రోజుల్లోగా హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానం యుద్ధానికి ముందు స్థాయికి తిరిగి రాగలదు. ఈ ఒప్పందంలో
* ఇస్లామిక్ రిపబ్లిక్ నుండి అమెరికా బలగాల ఉపసంహరణ, అలాగే అమెరికా నావికా దిగ్బంధనంగా తెహ్రాన్ అభివర్ణించిన దానిని ఎత్తివేయడం కూడా ఉన్నాయి. తాము అవగాహన ఒప్పందం ముసాయిదా అని పిలిచిన దానిని ఉటంకిస్తూ, అది ఇంకా ఖరారు కాలేదు. హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచే షరతులను ముసాయిదా ఒప్పందం వివరిస్తుంది నివేదిక ప్రకారం, ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడానికి, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు రాకపోకలు సాగించే నౌకలను వేధించడం మానుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ కట్టుబడింది. దీనికి ప్రతిగా, వ్యూహాత్మకంగా కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి ఇరాన్ అనుమతిస్తుంది, అదే సమయంలో నౌకా మార్గాలను నిర్వహించడం, నౌకలను తనిఖీ చేయడం, ఈ మార్గాన్ని ఉపయోగించే నౌకలపై సేవా రుసుములను విధించడం కొనసాగిస్తుంది. "

- ఇరాన్ ప్రభుత్వం

## వే'మన'పద్యం

కొంకణంబుపోవ గుక్క సింహముగాదు
కాశికరుగ బంది గజముకాదు
వేరుజాతి వాడు విప్రుండు కాలేడు
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# ట్రంప్ మాటలు స్వాగతించదగినవే కానీ రుజువు కావాలి

భారత దేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్, ఆయన స్నేహితుడు, అమెరికా విదేశాంగ కార్యదర్శి రూబియో, అసాధ్యాన్ని సుసాధ్యం చేయడానికి ప్రయత్నించిన వైనం మనందరం చూశాం. భారతదేశంతో తమ సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో వాషింగ్టన్ చిత్తశుద్ధితో ఉందని, అనుమానంతో ఉన్న ఢిల్లీ విదేశాంగ విధాన ఉన్నతాధికారుల బృందాన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు. దీనికి కారణం, తన సహజ మిత్రదేశం అని చెప్పుకునే దేశం పట్ల, దాదాపు ధిక్కారానికి దారితీసే అపూర్వమైన చులకన భావంతో వాషింగ్టన్ వ్యవహరించడమే. సంబంధాలు అత్యంత కనిష్ట స్థాయిలో ఉన్నప్పుడు, రూబియో డిప్యూటీ క్రిస్టోఫర్ లాండౌ కొన్ని నెలల క్రితం చేసిన ఒక వ్యాఖ్య అందరినీ ఆశ్చర్యపరిచింది. అదేమిటంటే, భవిష్యత్తులో అమెరికా పరిశ్రమలకు పోటీ ఇవ్వగల మరో ఆర్థిక పోటీదారుగా భారతదేశం ఎదగడానికి అమెరికా స్వచ్ఛందంగా మార్గం సుగమం చేయదని. ఇప్పుడు, రూబియో, గోర్ చేస్తున్న ప్రయత్నాలకు భారతదేశం నుండి అంత ఉత్సాహభరితమైన స్పందన రాకపోవడంతో, బహుశా తమ దౌత్య ప్రయత్నాలు పెద్దగా ఫలించవని గ్రహించిన ఆ ఇద్దరూ, అక్షరాలా తమ బ్రహ్మాస్త్రాన్ని ఫోన్ ద్వారా ప్రయోగించారు. అమెరికా 250వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భారత్మండపంలో కిక్కిరిసిన సభలో, అమెరికా అధ్యక్షుడి ప్రత్యక్ష సందేశాన్నిప్రసారం చేయడానికి గోర్ టెలిఫోన్‌ను మైక్రోఫోన్‌కు పెట్టగా, ఆ విశాలమైన హాలు ట్రంప్ స్వరంతో మారుమోగింది. వాక్చాతుర్యం గల ట్రంప్ నిరాశపరచలేదు. ఆయన మోడీని ప్రశంసిస్తూ, నాకు ప్రధానమంత్రి అంటే చాలా ఇష్టం. ప్రధాని మోడీ గొప్పవారు, ఆయన నా స్నేహితుడు అని అన్నారు. ఆ తర్వాత భారత్–అమెరికా సంబంధాలు గతంలో కంటే బలంగా ఉన్నాయని వర్ణిస్తూ, తనపై 100 శాతం ఆధారపడవచ్చని ఢిల్లీకి హామీ ఇచ్చారు. ట్రంప్ ప్రశంసలు, హామీ స్వాగతించదగినవే అయినప్పటికీ, ఢిల్లీ ఆ ప్రకటనలకు కొట్టుకుపోనవసరం లేదు. దానికి బదులుగా, ట్రంప్‌ను కేవలం ఆయన చర్యల ఆధారంగానే అంచనా వేయాలి. ఇక డీసీ చేయాల్సింది ఇదే. ఇండో–పసిఫిక్‌లో చైనాను సమతుల్యం చేయడానికి ఉద్దేశించిన క్వాడ్ కూటమికి ప్రాధాన్యత తగ్గించకుండా, ఆ శిఖరాగ్ర సమావేశానికి కట్టుబడి ఉండాలి. ఇప్పటివరకు, శిఖరాగ్ర స్థాయి చర్చలకు హాజరయ్యేందుకు తాను తొందరపడుతున్నట్లు ట్రంప్‌ఎ లాంటి సూచనలు ఇవ్వలేదు. ఇక, పాకిస్తాన్ సమస్య కూడా ఉంది. ట్రంప్ ప్రభుత్వం భారత్, పాకిస్తాన్‌లను సమానంగా పరిగణించడం ఆపాలి. షెహబాజ్ షరీఫ్, జనరల్ అసిమ్ మునీర్ ఇద్దరిపై నిరంతరం విపరీతమైన ప్రశంసలుకురిపిస్తూ, పాకిస్తాన్‌కు పెద్ద ఎత్తున రాయితీలు ఇవ్వడం తప్పుడు సంకేతాన్ని పంపుతుంది. అంతేకాకుండా, పాకిస్తాన్‌ను సమానంగా చూడకూడదనే భారతదేశపు దీర్ఘకాలిక వైఖరిని ట్రంప్ నేతృత్వంలోని అమెరికా గౌరవించాలి. దురదృష్టవశాత్తు, ఆపరేషన్ సింధూర్ సమయంలో ట్రంప్ మాట్లాడిన తీరు సరిగ్గా అదే సమానత్వాన్ని బలపరిచింది. భారతదేశపు ఇంధన అవసరాలను ట్రంప్ గుర్తించాలి. భారతదేశం రష్యా నుండి భారీ మొత్తంలో చమురును కొనుగోలు చేస్తోందని ట్రంప్‌అం టున్నారు, కానీ తాము ప్రారంభించని ఈ యుద్ధ సమయంలో ఇంధన భద్రతకు వైవిధ్యభరితమైన వనరుల వినియోగం అవసరమని భారతదేశం నిరంతరం వాదిస్తూ వస్తోంది. ట్రంప్ ఈ విషయాన్ని అర్థం చేసుకుని, రష్యా లేదా ఇరాన్ నుండి భారతదేశం చేసే చమురు కొనుగోళ్లను నిలిపివేసే ఆలోచన నుండి వెనక్కి తగ్గాలి. ప్రధానంగా భారతదేశాన్ని రాక్షసత్వంగా చిత్రీకరించడానికి ఉపయోగించే టారిఫ్ కింగ్ అనే వాక్చాతుర్యాన్ని ట్రంప్ అధిగమించినప్పటికీ, భారతదేశాన్ని జపాన్, యూకేలతో సమాన స్థాయిలో నిలబెట్టే ఒప్పందాన్ని బలవంతంగా కుదిర్చే ఉద్దేశాన్ని ఆయన ఏమాత్రం సూచించలేదు. అమెరికా భారతదేశపు కీలక ప్రయోజనాలకు విరుద్ధంగా, ఒక కష్టమైన, సున్నితత్వం లేని, కేవలం లావాదేవీలకే పరిమితమైన భాగస్వామిగా వ్యవహరించడం మానేసేంత వరకు, దానిని నూటికి నూరు శాతం నమ్మలేము.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# "ఫ్యూచర్ సిటీ" భవిష్యత్తు నగరమా?

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన "భారత్ ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, రియల్ ఎస్టేట్ రంగాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. హైదరాబాద్ నగర విస్తరణకు కొత్త దిశగా, "2047 విజన్"లో భాగంగా ప్రభుత్వం దీన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇది సాధారణ టౌన్‌షిప్ కాదు... "భారతదేశపు తొలి నెట్–జీరో గ్రీన్ స్మార్ట్ సిటీ"గా దీన్ని రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ నగర దక్షిణ దిశలో — శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేల మధ్య — వేల ఎకరాల పరిధిలో ఈ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. AI, హెల్త్, ఎడ్యుకేషన్, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. "15 నిమిషాల నగరం" మోడల్‌తో ప్రజలకు పని, విద్య, వైద్యం, వినోదం—all within short travel distance—అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. ఈ ప్రాజెక్టు అవసరాన్ని ప్రభుత్వం ఒక ప్రధాన కారణంతో వివరిస్తోంది. హైదరాబాద్ ఇప్పటికే ట్రాఫిక్, నీటి కొరత, అధిక జనసాంద్రత, పెరుగుతున్న భూముల ధరలు వంటి సమస్యలతో ఒత్తిడిని ఎదుర్కొంటోంది. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో పెరుగుతున్న రద్దీని తగ్గించాలంటే కొత్త అభివృద్ధి కేంద్రాలు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. అదే సమయంలో AI, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఫ్యూచర్ సిటీని ఒక "నూతన ఆర్థిక ఇంజిన్"గా ప్రచారం చేస్తోంది.

అయితే ఈ ప్రాజెక్టుపై ప్రశ్నలు, విమర్శలు కూడా అంతే తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గతంలో "హైదరాబాద్ ఫార్మా సిటీ" కోసం సేకరించిన భూములనే ఇప్పుడు "ఫ్యూచర్ సిటీ" పేరుతో ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు రాజకీయంగా పెద్ద వివాదంగా మారాయి. రైతుల నుంచి ఒక ఉద్దేశ్యంతో భూములు తీసుకుని, తర్వాత ప్రాజెక్టు స్వరూపాన్ని మార్చడం ఎంత వరకు న్యాయసమ్మతం? అనే ప్రశ్నలు లేవుతున్నాయి.

*ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే ప్రభుత్వం ముందు ప్రజల నమ్మకం గెలుచుకోవాలి. రైతులను కేవలం భూములు కోల్పోయే వారిగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా చూడాలి. ల్యాండ్ పూలింగ్, రెవెన్యూ షేరింగ్, స్థానిక యువతకు ఉద్యోగాలు, స్కిల్ ట్రైనింగ్ వంటి విధానాలు తీసుకురావాలి. లేకపోతే భూములు కోల్పోయిన గ్రామాల అసంతృప్తి భవిష్యత్తులో పెద్ద సామాజిక సమస్యగా మారే అవకాశం ఉంది.*



కొందరు రైతులు "ఫార్మా సిటీ రద్దయితే మా భూములు తిరిగి ఇవ్వాలి" అని డిమాండ్ చేస్తున్నారు.
పర్యావరణ అంశం కూడా ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైనది. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో చెరువులు, సహజ నీటి మార్గాలు, కొంత అడవి భూభాగం ఉన్నాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. హైదరాబాద్ ఇప్పటికే వరదలు, భూగర్భజలాల తగ్గుదల, అధిక ఉష్ణోగ్రతలు వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో మరో భారీ నగర విస్తరణ ప్రకృతి సమతుల్యంపై ఎలా ప్రభావం చూపుతుందో అన్న ఆందోళన ఉంది. "గ్రీన్ సిటీ" అనే పేరు పెట్టడం ఒక్కటే సరిపోదు... ఆచరణలో నిజమైన పర్యావరణ పరిరక్షణ కనిపించాలి.

ఫ్యూచర్ సిటీ ప్రకటించగానే చుట్టుపక్కల భూముల ధరలు ఒక్కసారిగా పెరగడం కూడా ప్రజల్లో అనుమానాలకు దారితీసింది. అనేక రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్లాట్ల ప్రకటనలు, పెట్టుబడి ప్రచారాలు వేగంగా పెరిగాయి. దీంతో "ఇది నిజంగా భవిష్యత్తు నగర నిర్మాణమా? లేక రియల్ ఎస్టేట్ బూమ్ సృష్టించే మరో భారీ ప్రాజెక్టా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో దేశంలో అనేక మెగా ప్రాజెక్టులు పెద్ద ప్రకటనలతో ప్రారంభమై, తర్వాత పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందకపోయిన ఉదాహరణలు ప్రజల జ్ఞాపకాల్లో ఇంకా ఉన్నాయి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలంటే ప్రభుత్వం ముందు ప్రజల నమ్మకం గెలుచుకోవాలి. రైతులను కేవలం భూములు కోల్పోయే వారిగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా చూడాలి. ల్యాండ్ పూలింగ్, రెవెన్యూ షేరింగ్, స్థానిక యువతకు ఉద్యోగాలు, స్కిల్ ట్రైనింగ్ వంటి విధానాలు తీసుకురావాలి. లేకపోతే భూములు కోల్పోయిన గ్రామాల అసంతృప్తి భవిష్యత్తులో పెద్ద సామాజిక సమస్యగా మారే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణలో కూడా ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. చెరువులు, సహజ నీటి మార్గాలు, పచ్చదనాన్ని కాపాడకుండా "స్మార్ట్ సిటీ" నిర్మించడం అసాధ్యం. ప్రపంచ నగరాల పేర్లు చెప్పడం కంటే స్థానిక వాస్తవాలు గుర్తించడం ముఖ్యం. హైదరాబాద్ భవిష్యత్తుకు అవసరమైనది భారీ గాజు భవనాలు మాత్రమే కాదు... నీరు, గాలి, ప్రజా రవాణా,

**ఫ్యూచర్ సిటీ తెలంగాణకు నిజంగా గొప్ప అవకాశమవచ్చు. సరిగ్గా అమలు చేస్తే ఇది దేశంలో కొత్త తరహా నగర ప్రణాళికకు ఆదర్శంగా నిలవొచ్చు. కానీ భారతదేశంలో ఎన్నో "డ్రీమ్ ప్రాజెక్టులు" చివరకు మ్యాపుల్లోనే మిగిలిపోయిన చరిత్ర కూడా ఉంది. అందుకే ఈ ప్రాజెక్టు విజయం ప్రకటనలపై కాదు... పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణ, దీర్ఘకాలిక అమలుపై ఆధారపడి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ నిజంగా "భవిష్యత్తు నగరం" కావాలంటే అది కేవలం కాంక్రీట్ నిర్మాణాలతో కాదు.. ప్రజల విశ్వాసంతో నిర్మించబడాలి.**

అందుబాటు గృహాలు, పర్యావరణ సమతుల్యం కూడా.

ఫ్యూచర్ సిటీ తెలంగాణకు నిజంగా గొప్ప అవకాశమవచ్చు. సరిగ్గా అమలు చేస్తే ఇది దేశంలో కొత్త తరహా నగర ప్రణాళికకు ఆదర్శంగా నిలవొచ్చు. కానీ భారతదేశంలో ఎన్నో "డ్రీమ్ ప్రాజెక్టులు" చివరకు మ్యాపుల్లోనే మిగిలిపోయిన చరిత్ర కూడా ఉంది. అందుకే ఈ ప్రాజెక్టు విజయం ప్రకటనలపై కాదు... పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణ, దీర్ఘకాలిక అమలుపై ఆధారపడి ఉంటుంది. ఫ్యూచర్ సిటీ నిజంగా "భవిష్యత్తు నగరం" కావాలంటే అది కేవలం కాంక్రీట్ నిర్మాణాలతో కాదు... ప్రజల విశ్వాసంతో నిర్మించబడాలి.



శ్యాంమోహన్
9440595858

## యుద్ధం చేయాల్సిందే!

మాటలు అందరికీ
అర్థం అవుతాయి
మౌనానికి లోతైన
అర్థం ఉంటుంది
మౌన భాషను అర్థం
చేసుకున్న వారే..
అసలు సిసలైన నా వాళ్లు
అవుతారు !
ఎవరి కోసం ఎదురుచూడకు..
నీ యుద్ధం నీవే చేయాలి
సుదీర్ఘ జీవన పోరాట
క్షేత్రంలో..
ప్రత్యర్థి వర్గంలో
అందరూ నీ వాళ్లే..
అర్జునుడు, కృష్ణుడు
కూడా నువ్వే !

నేనేమిటో లోకానికి అసలే
తెలియదు
వారికి తెలిసిందేమిటో అది
నేను కాదు
నా గూర్చి తెలుసుకోవడం వారి
పని కాదు
నువ్వేమిటో ఎవరికీ చెప్ప
అవసరం లేదు !
విలువ, టైం విచిత్రమైన జంట..
విలువనిచ్చినోళ్లు నీకు టైం
ఇవ్వరు
టైం ఇచ్చినోళ్లు నిన్ను పట్టించు
కోరు
టైంకి విలువనిచ్చి
ఎదగడం నేర్చుకో !
పెదవులపై గలగలల గంగా..
చేతుల నిండా తిరంగా జెండా..
గొంతులో జై హింద
నినాదాలు
చేతల్లో చైతన్య ప్రగతి కవాతులు
ఇదే కదా భారతమాత కోరికలు !

మధుపాళీ
9949700047

## డిజిటల్ యుగంలో చేతిరాత

అక్షరం అంటే నాశనం లేనిది. మనిషి తన భావాలను కలకాలం పదిలపరుచుకోవడానికి కనిపెట్టి న అద్భుతమైన సాధనం లిపి. ఆ లిపికి అందమైన రూపాన్ని ఇచ్చేది చేతిరాత. ఒకప్పుడు చేతిరాతను కేవలం సమాచార మార్పిడి సాధనంగానే కాకుండా, ఒక గొప్ప కళగా, వ్యక్తిత్వానికి ప్రతిబింబంలా చూసేవారు.
నేటి డిజిటల్ కాలంలో కీబోర్డ్ వినియోగం, కంప్యూటర్ అక్షరాస్యత జీవితానికి అవసరమైన సాధనాలుగా మారాయి. సాంకేతికత మన పనులకు వేగాన్ని ఇస్తున్నప్పటి



కీ, అక్షరాలను అందంగా దిద్దే మధురమైన చేతిరాత కళ క్రమంగా మరుగున పడుతుండటం విచారించదగ్గ విషయం. ఇక్కడ సాంకేతికతను నిరసించడం కంటే, దాంతో పాటుగా మన మూలాలను కాపాడుకోవడం ముఖ్యం.
**చేతి రాతపై గాంధీజీ సందేశం :** చేతిరాత ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావిస్తూ.. "అశుద్ధమైన లేదా అస్పష్టమైన చేతిరాత అసంపూర్ణ విద్యకు సంకేతం" అని హెచ్చరించారు. విద్యార్థి దశలోనే అక్షరాలను అందంగా దిద్దడం నేర్చుకోవాలని, బాల్యంలో అలవడే గుండ్రని రాతే భవిష్యత్తు విద్యా వికాసానికి పునాది అవుతుందని ఆయన హితవు పలికారు. ప్రపంచంలోని అందమైన లిపి కలిగిన భాషల్లో తెలుగు ఒకటి. తెలుగు వృత్తాకారంలో రాయబడుతుంది కాబట్టి దీనికి గుండ్రటి ఆకృతి ఉంటుంది. తలకట్టులు, కొమ్ములు, దీర్ఘాల నిర్దిష్టమైన వంపులతో తెలుగు అక్షరాలు లయబద్ధంగా సాగుతాయి. అందుకే తెలుగు చేతిరాత చూడ్డానికి ముత్యాల సరాల కోవలా మెరిసిపోతుంది.
మన పూర్వీకులు తాళపత్ర గ్రంథాల మీద ఘంటంతో రాసేటప్పుడు అక్షరం ఏమాత్రం వంకర పోయినా ఆకు విరిగిపోయే ప్రమాదం ఉండేది. అందుకే వారు అత్యంత ఏకాగ్రతతో, కళాత్మకంగా రాయడం అలవాటు చేసుకున్నారు. అచ్చు యంత్రాలు రాకముందే మన లిపి ముత్యంలా ప్రకాశించేది. "చేతిరాతను చూసి మనిషి వ్యక్తిత్వాన్ని చెప్పవచ్చు" అంటారు పెద్దలు. దీనిని చేతిరాత విశ్లేషణ శాస్త్రం (గ్రాఫాలజీ) అని పరిగణిస్తారు. మనం అక్షరాలను రాసే తీరు, వాటి మధ్య ఇచ్చే ఖాళీలు మన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తాయి.
విజ్ఞాన శాస్త్రం ప్రకారం, మనం చేతితో రాస్తున్నప్పుడు మెదడులోని వివిధ భాగాలు చురుగ్గా పనిచేస్తాయి. కీబోర్డ్‌పై టైప్ చేయడం యాంత్రికమైనది. కానీ చేత్తో రాసేటప్పుడు కళ్లు, చేతి కండరాలు, మెదడు మధ్య లోతైన సమన్వయం అవసరమవుతుంది. చేత్తో రాసి నేర్చుకున్న విషయాలు మెదడులో ఎక్కువ కాలం గుర్తుంటాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.
**నేటి విద్యార్థుల ప్రాథమిక సమస్యలు:** విద్యా విధానంలో రాత నాణ్యత కంటే వేగానికే, మార్కులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రమైన ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు. అక్షర నిర్మాణ క్రమం తెలియకపోవడం: నేటి తరం విద్యార్థులకు ఒక అక్షరాన్ని ఎక్కడ ప్రారంభించాలో, ఎలా ముగించాలో అవగాహన లోపిస్తోంది. ఉదాహరణకు తెలుగులో 'ఓ' కు 'ఒ' కు ఉన్న తేడా, 'ఔ' కు 'జా' కు ఉన్న వ్యత్యాసం, అలాగే 'ఘ' – 'ఝ', 'న' – 'స', 'ఫ' – 'ష', 'భ' – 'మ' వంటి అక్షరాల ప్రాథమిక నిర్మాణ భేదాలు తెలియక తికమకపడుతున్నారు. ఒత్తులను సరైన స్థానంలో రాయడానికి ఇబ్బంది పడుతున్నారు.
**కృత్రిమ రాత, అక్షర దోషాలు :** అక్షరాల ఆకృతులపై స్పష్టత లేకపోవడంతో, వారు రాసే రాత ఇతరులకు అర్థం కాకపోవడమే కాకుండా, వారిలో అక్షర దోషాలు విపరీతంగా పెరుగుతున్నాయి. అభ్యాస పద్ధతులు లోపించడం : పాఠశాలల్లో ఒకప్పుడు కాపీ రైటింగ్ పుస్తకాలు తప్పనిసరిగా ఉండేవి. నేడు ప్రాథమిక స్థాయిలోనే స్క్రీన్ టైమ్ పెరగడంతో పెన్ పట్టి రాసే అలవాటు క్రమంగా తప్పుతోంది.
**పునరుజ్జీవనానికి ఆచరణాత్మక చర్యలు:** పాఠశాల స్థాయిలో శాస్త్రీయ శిక్షణ: ప్రాథమిక తరగతుల నుంచే అక్షరాల స్ట్రోక్స్ (ఎక్కడ మొదలుపెట్టాలి, ఎలా ముగించాలి) అనే పద్ధతిని ఉపాధ్యాయులు నేర్పించాలి. నేటి డిజిటల్ బోర్డులపై కూడా అక్షరాల అమరికను చలనచిత్రాల (యానిమేషన్) ద్వారా చూపిస్తూ సులువుగా నేర్పించవచ్చు. పోటీలు, ప్రోత్సాహకాలు: విద్యార్థుల అందమైన చేతిరాతలను పాఠశాల సమాచార పలకాలపై ప్రదర్శించాలి.

మారెపల్లి అనిల్ కుమార్
చేతి రాత నిపుణులు,
99121 62087

## పర్యావరణము, పరిశుభ్రత, ఆరోగ్యం

పచ్చని చెట్ల ఆవరణం
ప్రకృతి సొగసుకు ఆభరణం
ప్రతి నిత్యం వచ్చే సూర్యకిరణం
ఆక్సిజన్ అందించే చెట్లు అనుక్షణం
ఇవి మనం ఆస్వాదించే చిత్రం అనుదినం
నీటి విలువ తెలుసుకుందాం
ఇంటింటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుందాం
బొట్టు బొట్టు పొదుపుగా వాడుకుందాం
భావితరాలకు నీటిని మిగుల్చుకుందాం
జాతీ యావత్తు గర్వించ జలనిధే మన సొంతం
వనాలు అన్నీ అంతరించి
కాంక్రీట్ భవనాలుగా మారుతుంటే
ధరణి మీద ఆనందం
ధనికుల సొత్తేం కాదు
చెట్ల నరికివేతను మనమంతా కలిసి అడ్డుకుందాం
పచ్చ పచ్చని చెట్లు చూడముచ్చట గొలుపు
పంట చేలను మార్చి ఇంటి తలుపులు చేస్తే
ఇప్పటికే దాదాపు పంట స్థలములు తగ్గిపోయే
ఇంటింటా చెట్టు, ఉంటే మాత్రమే చాలదు
రైతు రాజ్యములోన, రాజువలె ఉండాలి
ఇంటి చుట్టుపక్కల శుభ్రంగా ఉంచేసి
చెత్తాచెదారం ఒకచోట కుప్పేసి
ఎరువుగా మార్చుకో,మొక్కల్ని ఏపుగా పెంచుకో
పాలిథిన్ సంచులను పట్టొద్దు, ముట్టొద్దు
మట్టిలో కలువవు, కాల్చిన చెడువాయువు
మట్టి విలువ తెలుసుకుందాం
పచ్చని చెట్లను పెంచుకుందాం
పరిసరాల పరిశుభ్రత మనకు ముఖ్యం
అందరికీ ఆరోగ్యం అందించడం మన లక్ష్యం
అందరము కలిసి మెలిసి చేస్తేనే ఇది సాధ్యం.



బొమ్మిదేని రాజేశ్వరి
9052744215

# వడ్డించేవాడు మనవాడా..? మంచివాడా..?

చరిత్రలో ప్రతి పెద్ద రాజకీయ ఉద్యమం ఒకే ప్రశ్నతో ప్రారంభమైంది_ ఎవరు పాలించాలి.? కానీ ముందుకు సాగినకొద్దీ మరో ప్రశ్న మరింత లోతుగా వినిపించింది_ పాలించే వారి మనస్సు ఎలా ఉండాలి.? భారతదేశ రాజకీయ, సామాజిక చరిత్రలో బహుజన రాజ్యాధికారం అనే ఆలోచన కేవలం ఎన్నికల నినాదం కాదు.ఇది ఒక చారిత్రక ప్రతిస్పందన.శతాబ్దాలుగా జ్ఞానం, వనరులు, నిర్ణయాధికార కేంద్రాల నుంచి దూరంగా ఉంచబడిన వర్గాలు తమ ఉనికిని తిరిగి రాజకీయంగా ప్రకటించుకోవాలనే ప్రయత్నం. పూలే నుంచి అంబేద్కర్ వరకు, అనంతరం అనేక ప్రాంతీయ, సామాజిక ఉద్యమాల వరకు ఒక భావన స్పష్టంగా కనిపిస్తుంది అదే " ప్రాతినిధ్యం లేకుండా ప్రజాస్వామ్యం అసం పూర్ణం". ఈ చరిత్రను తేలికగా చూడలేం. అయితే ఇక్కడే ఒక కీలకమైన మలుపు ఉంది. బహుజన రాజ్యాధికారం కోరుకోవడం రాజకీయంగా ఎంత అవసరమో ఆ రాజ్యాధికారాన్ని నిర్వహించే వ్యక్తి యొక్క మానసిక నిర్మాణం ( psychological architecture) గురించి ఆలోచించడం కూడా అంతే అవసరం. ఎందుకంటే అధికారం ఎప్పుడూ శూన్యంలో పనిచేయదుగనుక. ఒక వ్యక్తి అధికారంలోకి వెళితే అతను కేవలం తన శరీరాన్ని మాత్రమే తీసుకెళ్లడు.తనతోపాటు తన చరిత్ర,తన అవమానాలు,తన గాయాలు,తన భయాలు,తన గుర్తింపు రాజకీయాలతో పాటు తన మానసిక నిర్మాణాన్ని కూడా తీసుకెళ్తాడు. ఈ సందర్భంలోనే మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ ఒక ఆసక్తికరమైన తలుపు తెరుస్తాడు. ఫ్రాయిడ్ ప్రకారం మనిషి హేతుబద్ధజీవి(rational being) మాత్రమే కాదు. అతనిలో అవచేతనాత్మక ప్రేరణలు(unconscious drives),అణచబడ్డ కోరికలు(suppressed desires),లోటు పూడ్చుకోవాలనుకునే అంతర్గత తపనలు(compensatory impulses), " నేను" అనే భావనాత్మక నిర్మాణం(ego formation), సంఘర్షణ(internal conflict),వంటి అనేక అంతర్గత శక్తులు పని చేస్తుంటాయని, ఈ సిద్ధాంతాన్ని రాజకీయాలపై ప్రయోగిస్తే మనకు ఒక అసౌకర్యమైన ప్రశ్న ఎదురవుతుంది. అదేంటంటే " అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ అధికారాన్ని పొందిన లేదా పొందాలనుకున్న వ్యక్తి తనలోని ఆధిపత్య నిర్మాణాన్ని ప్రశ్నించాడా?" ఎందుకంటే రాజకీయ ఉద్యమాలు చాలాసార్లు బాహ్య నిర్మాణాలను మార్చడంపై దృష్టిపెడుతాయి.కానీ ఫ్రాయిడ్ మనకు చెబుతున్నది" బాహ్య మార్పులు అంతర్గత మార్పులకు హామీ ఇవ్వవు" ఒక వ్యక్తి చాలాకాలం అణచివేతను అనుభవించి ఉండొచ్చు కానీ ఆ అనుభవం అతనిని స్వయంచాలకంగా( automatically) నైతిక పాలకుడిగా మార్చదు.ఇక్కడ నాకు ఒక సైకలాజికల్ భావన గుర్తుకొస్తుంది అదే" identification with agressor" అంటే కొన్ని సందర్భాల్లో బాధను అనుభవించిన వ్యక్తి తెలియకుండానే అదే శక్తి నిర్మాణాన్ని(imposition of pain) అనుకరిస్తాడు.తాను విముక్తి కోరుకున్న పద్ధతిని కాకుండా తాను చూసిన అధికార భాషను పునరుత్పత్తి చేస్తాడు.అందుకే రాజ్యాధికారం అన్న ప్రశ్నను కేవలం సామాజిక వర్గానికి పరిమితం చేయడం సరిపోదు. అధికారంలోకి వెళ్లే మనిషి తనలోని భయాన్ని అధిగమించాడా ? తన కోపాన్ని న్యాయంగా మార్చుకున్నాడా? తన అవమానాలనీ ఆత్మపరిశీలనగా మార్చుకున్నాడా? అని పరిశీలించాల్సిన అవసరం ఉంటుంది. ఇక్కడే ఫ్రాయిడ్ చెప్పిన Id_ ego_ super ego భావన ఒక రాజకీయ పాఠంలా మనకు ఉపయోగపడుతుంది. Id అంటే_ అధికారాన్ని కోరే ఆకాంక్ష. Ego అంటే_ అధికారాన్ని సాధించే రాజకీయ నైపుణ్యం. Super ego అంటే_ ఆ అధికారానికి నైతిక సరిహద్దులు. ఈ మూడింటిలో మూడోది లేకపోతే ప్రజాస్వామ్యం సంఖ్యల్లో గెలిచి విలువల్లో ఓడిపోతుంది. ఇక్కడ తత్వ శాస్త్రం మరో విషయాన్ని గుర్తుచేస్తుంది. అరిస్టాటిల్, మార్థా నుస్బాం (martha nussbaum_(American philosopher) లాంటి తత్వవేత్తలు కూడా రాజకీయాల్ని కేవలం పాలనా యంత్రాంగంగా చూడలేదు. వారి దృష్టిలో రాజకీయాల లక్ష్యం good life. అంబేద్కర్ కూడా ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల ప్రక్రియగా చూడలేదు.దాన్ని ఒక associated mode of living గా వివరించాడు. అంటే మంచి రాజ్యం ఏర్పడాలంటే మంచి రాజ్యాంగం మాత్రమే కాదు ప్రజాస్వామ్య చైతన్యంతో కూడిన మంచి మనుషులు కూడా అవసరం అని. లేదంటే రాజ్యాధికారం ఉద్యమంగా మొదలై అధికార సంస్కృతిగా ముగిసిపోయే ప్రమాదముంటుంది. సంఖ్యాబలం అనేది పాలనను గెలిపించవచ్చు కానీ సంబంధంలేని మనిషి బాధను కూడా నైతిక ప్రపంచంలోకి తీసుకురాగల సామర్థ్యం(moral imagination)మాత్రమే దాన్ని న్యాయంగా నిలబెడుతుంది.కాబట్టి బహుజన రాజ్యాధికారాన్ని వ్యతిరేకించడం కాదు ఈ ప్రశ్న దాన్ని మరింత లోతుగా తీసుకెళ్లే ప్రయత్నం.ఎందుకంటే చరిత్ర మనకు నేర్పిన ఒక కఠినమైన సత్యం ఉంది.అదేంటంటే ప్రాతినిధ్యం మారితే ముఖాలు మారుతాయి మనస్తత్వం మారితే చరిత్ర మారుతుంది. చివరగా... ప్రజాస్వామ్యం అడిగే ప్రశ్నేంటంటే అధికారంలోకి వెళ్లడం సరే వెళ్ళిన తరువాత వారు తమలోని ఏ మనిషిని తీసుకువచ్చారన్నది ముఖ్యం. అక్కడి నుండే రాజ్యాధికారం రాజకీయ విజయాన్ని దాటి నాగరిక విజయంగా మారుతుంది.

*" నేను" అనే భావనాత్మక నిర్మాణం(ego formation), సంఘర్షణ(internal conflict),వంటి అనేక అంతర్గత శక్తులు పనిచేస్తుంటాయని, ఈ సిద్ధాంతాన్ని రాజకీయాలపై ప్రయోగిస్తే మనకు ఒక అసౌకర్యమైన ప్రశ్న ఎదురవుతుంది. అదేంటంటే " అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ అధికారాన్ని పొందిన లేదా పొందాలనుకున్న వ్యక్తి తనలోని ఆధిపత్య నిర్మాణాన్ని ప్రశ్నించాడా?" ఎందుకంటే రాజకీయ ఉద్యమాలు చాలాసార్లు బాహ్య నిర్మాణాలను మార్చడంపై దృష్టిపెడుతాయి.కానీ ఫ్రాయిడ్ మనకు చెబుతున్నది" బాహ్య మార్పులు అంతర్గత మార్పులకు హామీ ఇవ్వవు" ఒక వ్యక్తి చాలాకాలం అణచివేతను అనుభవించి ఉండొచ్చు కానీ ఆ అనుభవం అతనిని స్వయంచాలకంగా( automatically) నైతిక పాలకుడిగా మార్చదు.ఇక్కడ నాకు ఒక సైకలాజికల్ భావన గుర్తుకొస్తుంది అదే" identification with agressor" అంటే కొన్ని సందర్భాల్లో బాధను అనుభవించిన వ్యక్తి తెలియకుండానే అదే శక్తి నిర్మాణాన్ని(imposition of pain) అనుకరిస్తాడు.*



ఐరబోయిన బిక్షపతి
(అగల్ జోయా)
79932 48717

# జాతీయం - అంతర్జాతీయం

## హొర్ముజ్ ఒప్పందంపై ఇరాన్ సంచలనాత్మక వాదన
# పూర్తి కల్పన అంటూ ఖండించిన అమెరికా



**వుదయం డెస్క్, మే 28:** అమెరికాతో కుదిరిన ముసాయిదా చట్రం ఒప్పందం ప్రకారం, నెల రోజుల్లోగా హొర్ముజ్ జలసంధి గుండా నౌకాయానం యుద్ధానికి
ముందు స్థాయికి తిరిగి రాగలదని ఇరాన్ వెల్లడించింది. ఈ ఒప్పందంలో ఇస్లామిక్ రిపబ్లిక్ నుండి అమెరికా బలగాల ఉపసంహరణ, అలాగే అమెరికా నావికాదిగ్బంధనంగా తెహ్రాన్ అభివర్ణించిన దానిని ఎత్తివేయడం కూడా ఉన్నాయి. తాము అవగాహన ఒప్పందం ముసాయిదా అని పిలిచిన దానిని ఉటంకిస్తూ, అది ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్, స్పష్టం చేసింది.
హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచే షరతులను ముసాయిదా ఒప్పందం వివరిస్తుందినివేదిక ప్రకారం, ఇరాన్‌పై నావికా దిగ్బంధనాన్ని ఎత్తివేయడానికి, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు రాకపోకలు సాగించే నౌకలను వేధించడం మానుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ కట్టుబడింది.దీనికి ప్రతిగా, వ్యూహాత్మకంగా కీలకమైన హొర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి ఇరాన్ అనుమతిస్తుంది, అదే సమయంలో నౌకా మార్గాలను నిర్వహించడం, నౌకలను తనిఖీ చేయడం, ఈ మార్గాన్ని ఉపయోగించే నౌకలపై సేవారుసుములను విధించడం కొనసాగిస్తుంది.జలసంధిని షరతులు లేకుండా తిరిగి తెరవబోమని కూడా ఆ ముసాయిదాలో
పేర్కొన్నారు. ప్రతిపాదిత కట్టుబాట్లు సైనిక నౌకలకు వర్తించవని స్పష్టం
అమెరికా దళాల ఉపసంహరణపై మిగిలి ఉన్న ప్రశ్నలు
ఈ ప్రాంతం నుండి దళాల ఉపసంహరణకు సంబంధించి అమెరికా ఒక నిబద్ధతనుప్రకటించిందని ఇరాన్ ప్రభుత్వ టీవీ నివేదిక పేర్కొంది.
అయితే, ఈ ప్రస్తావన కేవలం సంఘర్షణకు ముందు, సంఘర్షణ సమయంలో మోహరించినదళాలకు మాత్రమే వర్తిస్తుందా, లేక గల్ఫ్ ప్రాంతంలోని ప్రస్తుత అమెరికా
సైనిక స్థావరాలను కూడా కలుపుతుందా అనేది అస్పష్టంగా ఉందని ఆ నివేదిక తెలిపింది.ప్రాథమిక ముసాయిదాపై ఒప్పందం కుదిరిన తర్వాత, తెహ్రాన్, వాషింగ్టన్ మధ్య60 రోజుల చర్చల కాలాన్ని ఈ ముసాయిదా ప్రతిపాదన సూచిస్తున్నప్పటికీ, ఆ
చర్చలలో ఏ అంశాలను చర్చించాలో అది స్పష్టంగా పేర్కొనలేదు.
60 రోజుల వ్యవధిలో చర్చలు తుది ఒప్పందానికి చేరుకుంటే, ఈ ఒప్పందం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి కట్టుబడి ఉండే తీర్మానం ద్వారా ఆమోదించబడుతుందని భావిస్తున్నారు, అని ముసాయిదాలో పేర్కొన్నారు.
నివేదికను "కల్పన"గా కొట్టివేసిన వైట్ హౌస్ఈ అవగాహన ఒప్పందానికి సంబంధించిన వాదనలను యునైటెడ్ స్టేట్స్ వెంటనే తిరస్కరించింది.
ఇరాన్ నియంత్రిత మీడియా నుండి వచ్చిన ఈ నివేదిక నిజం కాదని, వారు 'విడుదల' చేసిన అవగాహన ఒప్పందం (ఎంఒయు) పూర్తిగా కల్పితమని, ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రచారం చేస్తున్న వాటిని ఎవరూ నమ్మకూడదు. వాస్తవాలే ముఖ్యం, అని వైట్ హౌస్ ఎక్స్‌పై పోస్ట్ చేసింది.ఉద్రిక్తతలను తీవ్రతరం చేసిన తాజా అమెరికా దాడులు
దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. మంగళవారం, అమెరికా సైన్యం దక్షిణ ఇరాన్‌లో తాజా దాడులు ప్రారంభించింది.దక్షిణ ఇరాన్‌లో క్షిపణి స్థావరాలు, మందుపాతరలు అమర్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించిన పడవలను లక్ష్యంగా చేసుకుని తాజా దాడులను
ప్రారంభించింది, ఈ ఆపరేషన్‌ను ఆత్మరక్షణ చర్యగా అభివర్ణించింది.
దాడులు జరిగిన కొన్ని గంటల తర్వాత, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో, ఇరాన్ తన వద్ద ఉన్న సుసంపన్నం చేసిన యురేనియంను నాశనం కోసం అమెరికాకు అప్పగిస్తుందని లేదా అంతర్జాతీయపర్యవేక్షణలో ఇరాన్‌లోనే దానిని నాశనం చేయడానికి అనుమతిస్తుందని తానుఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.
పూర్తిస్థాయి యుద్ధం జరిగే అవకాశం లేదన్న ఇరాన్ఉద్రిక్త మాటలు, సైనిక ఘర్షణలు పెరుగుతున్నప్పటికీ, తెహ్రాన్, వాషింగ్టన్‌ల మధ్య విస్తృత యుద్ధం జరిగే అవకాశం లేదని ఇరాన్ బుధవారంతెలిపింది.ఏప్రిల్ నుంచి అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికాఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించిన ఒక రోజు తర్వాత ఈ ప్రకటన వెలువడింది.కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జరిగిన అత్యంత తీవ్రమైన
దాడులుగా తాము అభివర్ణించిన వాటి నేపథ్యంలో, ప్రతీకార చర్యలకు సిద్ధంగా ఉన్నామని కూడా ఇరాన్ హెచ్చరించింది.చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇటీవలి వారాల్లో ఇరాన్, అమెరికా మధ్యసుదీర్ఘ వాగ్వాదం కొనసాగుతోంది, ఈ క్రమంలో పాకిస్తాన్ ఇరుపక్షాల మధ్యమధ్యవర్తిత్వ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తోంది.

## కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రి కానున్నడి.కె. శివకుమార్ ఎవరు?



**బెంగళూరు, మే 28(ఎ.ఎం.ఎస్):**
డి.కె. శివకుమార్ లేదా డి.కె.ఎస్.గా ప్రసిద్ధి చెందిన దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్, కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రి కానున్నారు. ఒక విద్యార్థి కార్యకర్తగా ప్రారంభమై, అత్యంత శక్తివంతమైన నాయకులలో ఒకరిగా దక్షిణ భారతదేశంలోని కాంగ్రెస్ పార్టీ ఆయననుతీర్చిదిద్దిన దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి ఇది గమ్యం కానుంది. బెంగళూరు సమీపంలోని కనకపురలో 1962 మే 15న జన్మించిన శివకుమార్,ప్రభావవంతమైన వొక్కలిగ్గ సామాజిక వర్గానికి చెందినవారు. సంవత్సరాలుగా,ఆయన కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి కీలకమైన సంస్థాగత శక్తిగా, జాతీయనాయకత్వానికి విశ్వసనీయ వ్యూహకర్తగా ఎదిగారు. పార్టీ హైకమాండ్‌తోసంప్రదింపుల అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్య పదవి నుంచి వైదొలుగుతారనివిస్తృతంగా భావిస్తున్న నేపథ్యంలో, కర్ణాటక కాంగ్రెస్‌లో ఒక పెద్దనాయకత్వ మార్పు జరుగుతున్న తరుణంలో ఆయనకు ఈ పదోన్నతి లభించనుంది.
అత్యున్నత పదవికి సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంశివకుమార్ 1980వ దశకం ప్రారంభంలో విద్యార్థి ఉద్యమాల ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించి, కాంగ్రెస్ పార్టీలో వేగంగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. కేవలం 27 ఏళ్ల వయసు లోనే, ఆయన 1989లో సాతనూర్ నియోజకవర్గం నుంచితన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన ఆ స్థానాన్నిపలుమార్లు నిలబెట్టుకున్నారు. అనంతరం కనకపురకు మారారు, 2008 నుంచి ఆ నియోజకవర్గానికి ఆయన నిరంతరం ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
తన రాజకీయ జీవితంలో శివకుమార్ జలవనరులు, బెంగళూరు అభివృద్ధి, పట్టణప్రణాళిక వంటి అనేక ప్రధాన శాఖలను నిర్వహించారు. ఆయన పరిపాలనా అనుభవం,బలమైన సంస్థాగత నెట్‌వర్క్ క్రమంగా ఆయనను కర్ణాటక కాంగ్రెస్ అత్యంతప్రభావవంతమైన నాయకులలో ఒకరిగా నిలబెట్టాయి.
జూలై 2020లో, ఆయన కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ పదవిలో ఉంటూ, 2023 అసెంబ్లీ ఎన్నికలలోరాష్ట్రంలో కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో ఆయన పార్టీప్రచారానికి సారథ్యం వహించారు. ఆ విజయం అనంతరం, ఆయన ఉప ముఖ్యమంత్రి కాగా, సిద్దరామయ్య ముఖ్యమంత్రిపదవిని చేపట్టారు.
కాంగ్రెస్ సంక్షోభ నిర్వాహకుడు, వ్యూహకర్తరాజకీయ సంక్షోభాలను నిర్వహించడంలో, అస్థిరత సమయాల్లో శాసనసభ్యులనురక్షించడంలో పోషించిన పాత్ర కారణంగా, కాంగ్రెస్ వ్యవస్థలో శివకుమార్పార్టీ సమస్య పరిష్కర్తగా పేరు సంపాదించారు. 2017లో రాజ్యసభ ఎన్నికలకుముందు గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరులోని ఒక రిసార్ట్‌లో బసచేయడానికి ఆయన ఏర్పాటు చేసినప్పుడు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఈచర్య సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అహ్మద్ పటేల్ విజయం సాధించడానికిదోహదపడింది.
2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన తీవ్రమైన ఫిరాయింపుల ప్రయత్నాల నుండి కాంగ్రెస్, జేడీ(ఎస్) శాసనసభ్యులను కాపాడటంలో సహాయపడి,చివరికి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు వీలు కల్పించడంలో ఆయన కీలక పాత్రపోషించారు.
రాహుల్ గాంధీ, సోనియా గాంధీలతో ఆయనకున్న సన్నిహిత కార్య సంబంధం పార్టీ
కేంద్ర నాయకత్వంలో ఆయన స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.
సంపద, వివాదాలు, రాజకీయ పలుకుబడి
భారతదేశంలోని అత్యంత సంపన్న రాజకీయ నాయకులలో ఒకరిగా శివకుమార్ ను
పరిగణిస్తారు. 2018లో దాఖలు చేసిన తన ఎన్నికల అఫిడవిట్‌లో, ఆయన సుమారు
రూ. 840 కోట్ల విలువైన ఆస్తులను ప్రకటించారు.ఆయన పెరుగుతున్న రాజకీయ పలుకుబడి కేంద్ర ఏజెన్సీల పరిశీలనను కూడా
ఆకర్షించింది. 2017లో, ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆయన ఆస్తులు, సహచరులకు సంబంధించిన ఆస్తులపై దాడులు నిర్వహించాయి. ఆకేసులకు సంబంధించిన దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.వివాదాలు ఉన్నప్పటికీ, శివకుమార్ క్షేత్రస్థాయిలో బలమైన పునాదిని నిలుపుకున్నారు. కర్ణాటకలో రాజకీయంగా పలుకుబడి ఉన్న వొక్కలిగ్గ సమాజంలోగణనీయమైన మద్దతును పొందుతున్నారు.కర్ణాటక నాయకత్వ మార్పుకు సన్నద్ధంకర్ణాటకలో కాంగ్రెస్ అధికారిక నాయకత్వ మార్పునకు సిద్ధమవుతున్న తరుణంలో,
శివకుమార్ పదోన్నతి అన్నదానిని పార్టీకి, రాష్ట్రానికి ఒక ప్రధాన రాజకీయ ఘట్టంగా పరిగణిస్తున్నారు.
ఆయన ఎదుగుదల కేవలం ఆయన సంస్థాగత సామర్థ్యాలను, రాజకీయ దృఢత్వాన్నిమాత్రమే కాకుండా, కర్ణాటకను తదుపరి పాలన దశలోకి నడిపించగల ఆయనసామర్థ్యంపై కాంగ్రెస్ నాయకత్వానికి ఉన్న విశ్వాసాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.
కాంగ్రెస్ శాసనసభ పక్షం అధికారికంగా ఎన్నుకుంటే, పార్టీలో సంవత్సరాల తరబడి జరిగిన అంతర్గత చర్చలు, రాజకీయ పోరాటాలు, వ్యూహాత్మక ఎత్తుగడలతర్వాత శివకుమార్ కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారు.



# అస్సాం ముఖ్యమంత్రికి ఢిల్లీ కోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మే 28(ఎ.ఎం.ఎస్):**
మియా ముస్లింలపై చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల విషయంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు ఆయనకు నోటీసు జారీచేసింది. బీజేపీ నాయకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడానికినిరాకరించిన మునుపటి మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ
కార్యకర్త హర్ష్ మందర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌పై విచారణ జరుపుతున్నఅదనపు సెషన్స్ జడ్జి సోను అగ్నిహోత్రి ఈ నోటీసును జారీ చేశారు.
మే 26 నాటి కోర్టు ఉత్తర్వు ప్రకారం, పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపిస్తున్నప్పుడు జీరో ఎఫ్ఐఆర్, ఇఎఫ్ఐఆర్ పై హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్ఓపి) ప్రస్తావించారు.
పిటిషనర్ తరపు న్యాయవాది చేసిన వాదనలను దృష్టిలో ఉంచుకుని, జూలై 15, 2026లోగా తగిన సమాధానం దాఖలు చేసిన మీదట ప్రతివాదులకు రివిజన్ పిటిషన్ నోటీసుజారీ చేయండి, అని కోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది.
వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి శర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించడానికి నిరాకరించిన మేజిస్ట్రేట్ కోర్టు ఏప్రిల్ 20 నాటి తీర్పును సవాలు చేస్తూ ఈ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు.మియా ముస్లింలను లక్ష్యంగా చేసుకుని అస్సాం ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు
రెచ్చగొట్టేవిగా ఉన్నాయని, వాటిపై క్రిమినల్ చర్య తీసుకోవాల్సి ఉంటుందని హర్ష్ మందర్ ఆరోపించారు.
వలసలు, పౌరసత్వం వంటి అంశాలపై రాష్ట్రంలో జరుగుతున్న చర్చల నేపథ్యంలోఅస్సాంలో బెంగాలీ మూలాలున్న ముస్లింలను సూచించడానికి సాధారణంగా వాడే మియా
అనే పదం, గుర్తింపు, రాజకీయంగా సున్నితమైన అంశంగా మిగిలిపోయింది. ఈ విషయంపై తదుపరి విచారణ జూలై 15న జరగనుంది.

## కాజీపేటలో త్వరలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభం



**కాజీపేట వుదయం డెస్క్, మే 28:** లో రైళ్ల తయారీ యూనిట్ పూర్తికావచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేస్తుందని తెలిపారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన ఇవాళ కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు.
కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు.
రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చే

# ఆత్మహత్య కాదు, విచ్ఛిన్నమైన, అవినీతిమయమైన వ్యవస్థ

### నీట్ అభ్యర్థిమృతిపై రాహుల్ గాంధీ



**మే 28(ఎ.ఎం.ఎస్):**
నీట్ పేపర్ లీక్ విషయంపై తీవ్ర మనస్తాపానికి గురైఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారంలో ఉన్న నీట్ అభ్యర్థి ప్రదీప్ మేఘ్వాల్కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం కలిశారు. విఫలమైన,అవినీతిమయమైన వ్యవస్థ నుండి విద్యార్థులను కాపాడటంలో కేంద్రం విఫలమైందనిఆయన ఆరోపించారు.విఫలమైన వ్యవస్థ ఫలితమే ప్రదీప్ మృతిఆ కుటుంబం పడుతున్న బాధను మాటల్లో వర్ణించలేమని రాహుల్ గాంధీ ఒక ప్రకటనలోతెలిపారు. విద్యార్థి మరణం వ్యక్తిగత చర్య కాదని, వ్యవస్థాగత వైఫల్యం
ఫలితమేనని ఆయన అభివర్ణించారు.
ప్రదీప్ మరణం ఆత్మహత్య కాదు, అది విఫలమైన, అవినీతిమయమైన వ్యవస్థ ఫలితం,
అని గాంధీ అన్నారు. పరీక్షల వ్యవస్థను మాఫియాలకు అప్పగించేశారని ఆయన
ఆరోపించారు.
పరీక్షల అవకతవకల పై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్న రాహుల్
పరీక్షల అవకతవకలు, పేపర్ లీక్ వివాదాల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని ఆయన
లక్ష్యంగా పెట్టుకున్నారు.
దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఇప్పటికే విద్యా ఒత్తిడి,పోటీ, భవిష్యత్తుపై అనిశ్చితితో సతమతమవుతున్నారని, పేపర్ లీక్‌లువిద్యార్థుల, వారి కుటుంబాల కలలను మరింతగా నాశనం చేస్తున్నాయని రాహుల్గాంధీ అన్నారు.యువత ఇకపై అవినీతిని సహించదునీట్ అభ్యర్థులతో జరిపిన సంభాషణలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరీక్షావిధానంపై తాము విశ్వాసం కోల్పోయామని విద్యార్థులు తనతో చెప్పారని
కాంగ్రెస్ ఎంపీ అన్నారు. అవినీతిపైనా, ప్రభుత్వ నిష్క్రియాత్మకతపైనా యువతలో ఆగ్రహం వేగంగా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.
ఈ దేశ యువత ఇకపై అవినీతిని, ఉదాసీనతను సహించదు, అని గాంధీ అన్నారు. యువత
చివరికి వ్యవస్థలో మార్పు తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు.

# తిరువనంతపురంలో ఘోర ప్రమాదం

### విరిగిపడ్డ జెయింట్ వీల్.. ఏడుగురికి తీవ్ర గాయాలు!



**కేరళ,మే 28(ఎ.ఎం.ఎస్):**
తిరువనంతపురంలోని ఒక అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో ప్రమాదం జరిగింది. ఒక భారీ జెయింట్ వీల్ (స్కై రైడ్) కూలిపోవడంతో అందులో రైడ్ చేస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తిరువనంతపురం, వెంబాయంలోని, హ్యాపీలాండ్ వాటర్ థీమ్ అండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో గురువారం మధ్యాహ్నం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కొందరు విజిటర్స్ ఇక్కడి జెయింట్ వీల్ ఎక్కారు. వారు రైడ్ చేస్తుండగా ఉన్నట్లుండి జెయింట్ వీల్ విరిగిపోయి, కింద పడిపోయింది. దీంతో అందులో ఉన్న ఏడుగురు గాయపడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంజారమూడుకు చెందిన పోలీసులు, స్థానిక అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని స్థానిక గోకులం మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరికి స్వల్ప గాయాలుకాగా, మరి కొందరి ఎముకలు విరిగిపోయినట్లు తెలుస్తోంది. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి సమాచారం రావాల్సి ఉంది. ఈ ఘటన నేపథ్యంలో పార్క్ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ ప్రకారం.. జెయింట్ వీల్‌కు సంబంధించిన సపోర్ట్ స్టాండ్ విరిగిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగింది.

## ఐటీ జాబ్ వదిలి వ్యవసాయం



ఐటీ ఉద్యోగాన్ని వీడి.. ఓ టెకీ సాగుబాట పట్టాడు. ఇందులో భాగంగా పొలం చూసేందుకు వెళ్లగా.. అక్కడే పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన కర్ణాటకలోని మైసూరులో వెలుగుచూసింది.మడికెరి పట్టణానికి చెందిన రోషన్ బాలకృష్ణ (43) అనే ఐటీ ఉద్యోగి... దీంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరొకరికి గాయాలయ్యాయివ్యవసాయంపై ఆసక్తితో ఇటీవల తన ఉద్యోగాన్ని వదిలేశాడు. స్నేహితుడితో కలిసి సేద్యంలోకి అడుగుపెట్టాడు. ఆధునిక వ్యవసాయ పరికరాల మార్కెటింగ్ కూడా చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సాగు ప్రణాళికల్లో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి మైసూరులో ఓ పొలం చూసేందుకు వెళ్లాడు.అక్కడే ఓ మామిడి చెట్టు వద్ద పండ్లు కోసేందుకు వెళ్లగా.. ఒక్కసారిగా పిడుగుపడింది. దీంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరొకరికి గాయాలయ్యాయి. మృతుడి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.5 లక్షల పరిహారం ప్రకటించాయి.

# ఢిల్లీలో మండుతున్న ఎండలు



**న్యూఢిల్లీ, మే 28(ఎ.ఎం.ఎస్)**
దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు మండుతున్నాయి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఎండలకు తాళలేకపోతున్నారు. మరోవైపు ఎండలో బయటకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ నగరంలో సోలార్ హట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.స్థానిక షాలిమార్ బాగ్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయబోతున్నారు. దీని గురించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..చల్లదనాన్ని అందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అన్ని వైపులా గడ్డిని ఏర్పాటు చేస్తారు. స్ప్రింక్లర్ సిస్టమ్ కూడా ఉండటం వల్ల లోపల అంతా చల్లదనాన్ని పరుచుకుంటుంది. ప్రజలకు దీనివల్ల నీడతోపాటు చల్లదనం లభిస్తుంది. ఇది సోలార్ శక్తి మీద నడుస్తుంది. ఈ హట్‌స్‌లో ప్రజలు ఎండ సమయంలో విశ్రాంతి తీసుకోవచ్చు. పౌరులు లోపల కూర్చోవడానికి సీటింగ్ ఏర్పాట్లు ఉంటాయి. అలాగే, చల్లటి మంచి నీరు అందుబాటులో ఉంటుంది. ఢిల్లీ నగరంలో సోలార్ హట్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.స్థానిక షాలిమార్ బాగ్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద వీటిని ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయబోతున్నారు. దీని గురించి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చల్లదనాన్ని అందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఫోన్ ఛార్జింగ్ సౌకర్యం కూడా కల్పిస్తారు.ఈ హట్స్ పైన సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం వల్ల దీన్నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం ఈ హట్ నిర్మాణ దశలో ఉంది. రెండు, మూడు రోజుల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీన్ని సీఎం రేఖా గుప్తా ప్రారంభిస్తారు. ఢిల్లీ వ్యాప్తంగా మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు కూలింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా కూలీలు, పాదచారులు, ప్రయాణికులకు దీనివల్ల ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం దీనికి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చి, మంచి ఫలితం ఉంటే నగరవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ఆలోచన.



# కరీంనగర్ |ఆదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఈదురుగాలుల బీభత్సం

**సర్వస్వం కోల్పోయిన బాధితులకు కాంగ్రెస్ నాయకుల భరోసా**



**కరీంనగర్ ,మే 28 (వుదయం ప్రతినిధి):**
కరీంనగర్ లో గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల బీభత్సంతో బొమ్మకల్ సమీప ప్రాంతంలో రాజేష్ అనే పేద కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ఈదురుగాలుల ధాటికి రేకులతో నిర్మించిన ఇంటి పైకప్పు లేచిపోయి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇంట్లోని ఫ్రిడ్జ్, టీవీ సహా ఇతర సామాగ్రి చెల్లాచెదురైంది, వంట సామాగ్రి వర్షం నీటిలో కొట్టుకుపోయి కుటుంబం ఆర్థికంగా పూర్తిగా నష్టపోయింది, కుటుంబ యజమాని రాజేష్ ఒక ప్రైవేటు ఉద్యోగి ఇటీవల రోడ్డు ప్రమాదంలో పాలుకు తీవ్ర గాయమై ఇబ్బందులు పడుతున్నారు ఈ పరిస్థితుల్లో ఈ ఆపద వారికి మరింత మనోవేదనకు గురి చేసింది, అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది.విషయం తెలుసుకున్న కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మాజీ ఎంపీటీసీ మొహమ్మద్ పాషా, సింగిల్ విండో వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, కాంగ్రెస్ నేతలు షాహిద్, వీర దేవేందర్ పటేల్, పెంట శేఖర్, దొంతి గోపి తదితరులతో కలిసి ధ్వంసమైన ఇంటిని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంజన్ కుమార్ తక్షణమే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు.



## బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ ,మే 28 (వుదయం ప్రతినిధి):**
దేశంలో అన్ని మతాలు సమానమని, గంగా,యమున సరస్వతీ నదుల సంగమంలా అందరూ సోదరభావంతో కలిసి మెలసి జీవించాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం బక్రీద్ పండగను పురస్కరించుకొని పట్టణంలోని ఈద్గాను ఆయన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శించారు. ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలిపారు.ఆదిలాబాద్ లో కుల మత బేధాలు లేకుండా హిందూ, ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు సోదర సోదరీ భావంతో జీవిస్తున్నారని ,ఒకరి పండగలో మరొకరు పరస్పర సహకారం చేసుకుంటూ ఆనందోత్సహాలతో పండగలు జరుపుకుంటున్నారని ఆయన అన్నారు. ఇది ఇలాగే కలకాలం కొనసాగాలని అన్ని మతాలు మతసామరస్యం పాటిస్తూ ఆనందంగా జీవించాలని ఆయన ఆకాక్షించారు. త్యాగం ,భక్తి ,ప్రేమ, సహనానికి నిదర్శనంగా బక్రీద్ పండగ నిలుస్తుందని ఆయన బక్రీద్ పండగ ప్రత్యేకతను చాటి చెప్పారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ముస్లీం సోదర సోదరీ మణులకు ఆయన బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ , మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ ,కొండ గంగాధర్ , పత్తి ముజ్జు,ఎంఏ షకీల్ ,ఎల్టి భోజారెడ్డి , సుధాకర్ గౌడ్, మంచాల మల్లయ్య, దాసరి ఆశన్న , రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ప్రభుత్వం

- **రైతులు ఆందోళనకు గురి కావద్దు**

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్,మే 28 (వుదయం ప్రతినిధి):**
అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వంపరంగా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని 1 కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరిస్తున్న తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం రాత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్లకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరిందని అన్నారు. అయితే దిగుబడులు ఆలస్యంగా వచ్చిన చోట ధాన్యం సేకరణ కోసం ఇంకనూ సుమారు 120 వరకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. అకాల వర్షం కురిసిన కారణంగా జిల్లాలో బషీరాబాద్, ఉప్లూర్ తదితర ప్రాంతాల్లో సుమారు 40 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం బస్తాలు తడిసినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం పంపడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వేగవంతంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తాను కూడా స్వయంగా మిల్లులను సందర్శించి, ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియలను పరిశీలించాలని కలెక్టర్ వెల్లడించారు. తడిసిన ధాన్యం విషయమై ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు మేరకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందుగా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






## షబ్బీర్ అలీకి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్

**కామారెడ్డి, మే 28 (వుదయం ప్రతినిధి):-**
ముస్లింల పవిత్ర పండుగ అయిన బక్రీద్ (ఈద్‌ఉల్‌అజ్హా)ను పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ ని కామారెడ్డి పురపాలక సంఘం చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీకి హృదయపూర్వక బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కామారెడ్డి పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి ఈ సందర్భంగా పలు విషయాలు చర్చకు వచ్చాయి. పట్టణంలో పండుగ వాతావరణం ప్రశాంతంగా, సంతోషంగా సాగాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీగా నీరటి శంకర్ నియామకం

- **నియామక పత్రం అందజేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**పెద్దపల్లి, మే 28 (వుదయం కరస్పాండెంట్ న్యూస్)**



ఐఎన్‌టీయూసీ (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీగా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పూసలకు చెందిన నీరటి శంకర్ నియమితులయ్యారు. గురువారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గనులు మరియు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నీరటి శంకర్ మాట్లాడుతూ తమ రాజకీయ గురువు, రాష్ట్ర గనులు మరియు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా నియామక పత్రం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ఐఎన్‌టీయూసీ నేషనల్ ప్రెసిడెంట్ సంజీవ రెడ్డి, నేషనల్ సెక్రటరీ బాబర్ సలీం పాషా, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నీరటి శంకర్ పేర్కొన్నారు.

## కొనుగోళ్ల ప్రక్రియ ముగిసే వరకూ ఇదే చొరవతో పని చేయాలి

**రాజన్న సిరిసిల్ల , మే 28 (వుదయం ప్రతినిధి):**
ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో ముగిసే వరకూ అధికారులు ఇదే చొరవతో పని చేస్తూ రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధాన్యం సేకరణ, తడిసిన ధాన్యం విషయంలో రైతులు ఆందోళన చెందకుండా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించడం, అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం కొనుగోలు కేంద్రాల వద్ద నుండి అపరల్ పార్క్ కు హమాలీలను తరలించడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ గురువారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 23 వేల 709 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, వర్షం కారణంగా ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందకుండా అధికారులు అవగాహన కల్పించి, ధాన్యం కొనుగోలు చేస్తామనే భరోసా క్షేత్ర స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వారీగా ధాన్యం సేకరణ, అన్ లోడింగ్ పై ఆరా



తీసి, ప్రక్రియ వేగవంతంగా సజావుగా పూర్తయ్యేవరకు అధికారులు ఇదే చొరవతో పని చేయాలని, రాబోయే వారం రోజుల్లోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని అన్నారు.
కొనుగోలు కేంద్రాలలో ఉన్న హమాలీలను ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయడం కోసం అపరల్ పార్క్ కు తరలించాలని, తద్వారా వాహనాలు తొందరగా అన్ లోడింగ్ జరిగి అవసరమైన కేంద్రాలకు వాహనాలను పంపడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. వాహనాల కొరత లేకుండా సరైన పర్యవేక్షణ చేయాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా చూడాలని ఆదేశించారు. మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

## ముస్లింల సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉంది

- **మసీదులు,ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయింపు**
- **నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి రూ.2 లక్షల బ్యాంక్ రుణాలు ఈద్గా ప్రార్థనల్లో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మణ్ కుమార్**





**ధర్మపురి,మే28(వుదయం ప్రతినిధి):**
రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించు కుని ధర్మపురిలోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ముస్లింల జీవన ప్రమాణాలు మెరుగుపర చడమే ధ్యేయంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని మసీదులు,ఈద్గాల ఆధునీకరణ, అభివృ ద్ధి పనుల కోసం ప్రత్యేకంగా రూ.7 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతీ యువ కులు సొంతంగా రాణించేందుకు, స్వయం ఉపాధి సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసు కుంటోందని మంత్రి లక్ష్మణ్ కు మార్ వివరించారు.ధర్మ పురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఖాళీ గా ఉన్న యువతీ యువకులకు అండగా నిలుస్తామన్నారు.వారు ఉపాధి పొందేందుకు వీలుగా బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల చొప్పున రుణాలు ఇప్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.అర్హత, ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కొని ఆర్థికంగా స్థిరపడాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సి పల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్,మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు.రామన్న, కౌన్సిలర్లు,ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.



- **జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**
- **ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**

## బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు

**జగిత్యాల మే 28 (వుదయం ప్రతినిధి)**
బక్రీద్ ని పురస్కరించుకొని జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ పవిత్ర పర్వదినాన్ని శాంతి సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా జగిత్యాల కోరుట్ల లో గల పలు ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని పేర్కొన్నారు

## ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- **రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల జిల్లా మే 28 (వుదయం ప్రతినిధి):**
ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా రైతుల వద్ద నుండి ఆఖరి గింజ వరకు వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు., ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. చెన్నూర్, కోటపల్లి ప్రాంతాలలో పంట ఆలస్యంగా వస్తున్నందున జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. 2022 23 లో 1 లక్ష 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈసారి ఇప్పటివరకు 1 లక్ష 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, జూన్ 6వ తేదీ వరకు 30 వేల నుండి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, మొత్తంగా దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడడం జరిగిందని, ఇసుక



లారీలను ధాన్యం రవాణాకు మళ్ళించడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, జైపూర్ మండలంలో వచ్చే 3 రోజులలో ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములోనికి చెన్నూర్ నుండి వచ్చే ధాన్యాన్ని అనుమతించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 70 శాతం ధాన్యం ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, చెన్నూర్, కోటపల్లి మండలాలకు సంబంధించి ధాన్యం ప్రక్రియను 15 రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉందని, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి




**: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా మే28 (వుదయం ప్రతినిధి):**
జనగణనలో భాగమైన ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం దిలావర్ పూర్ మండలంలోని కాల్వ గ్రామంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జనగణన సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ జనగణనలో అత్యంత కీలకమైన ఘట్టమని, . సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలు, ఇప్పటివరకు పూర్తయిన ఇండ్ల వివరాలను ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో అడిగి వాకబు చేశారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలని సూచించారు.ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ స్థానికులతో మాట్లాడుతూ, జనగణన దేశ అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు ప్రజాప్రయోజనార్థం వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తాయని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలంతా ఎన్యుమరేటర్లు అడిగిన వివరాలను ఖచ్చితంగా అందించి, జనగణన ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ పరిశీలన లో జనగణన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ

**ఆసిఫాబాద్( వుదయం ప్రతినిధి )**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గురువారం భక్తిశ్రద్ధలతో ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఉదయం ఈద్గాల వద్ద మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు కుల మతాల కచ్చితంగా రాజకీయ నాయకులు పాల్గొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కాగజ్నగర్ మున్సిపాలిటీలో చైర్మన్ కౌన్సిలర్లు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు మండలాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ ఈ సందర్భంగా కుర్బానీ కొత్త



దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు వివిధ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## రామయ్యపల్లి డిసిఎమ్ఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి



- **23 రోజుల్లో 9వేల250 క్వింటాళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా ముగిసిన కొనుగోళ్ల ప్రక్రియ**

**ధర్మపురి,మే 2 7(వుదయం ప్రతినిధి):**
మండలంలోని రామయ్యపల్లె వద్ద ఏర్పాటు చేసిన డిసిఎమ్ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు బుధవారంతో విజయవంతంగా ముగిశాయి.ఈ నెల 5వ తేదీన ప్రారంభమైన ఈ కేంద్రంలో గత 23 రోజులుగా కొనుగోళ్లు నిరంతరాయంగా సాగాయి.ఈ కాల వ్యవధిలో మొత్తం 9వేల 250 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుండి సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.కొనుగోళ్ల ప్రక్రియ ముగిసిన సందర్భంగా కేంద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమంనిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్,నాగారం సర్పంచ్ చిలుముల.లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.రామయ్య పల్లె సర్పంచ్ రవీందర్ రెడ్డి గ్రంథాలయం చైర్మన్ దినేష్ ను, రైస్ మిల్లర్ల ను శాలవతో సన్మా నించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రికార్డు స్థాయిలో 23 రోజుల్లోనే పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం అభినందనీయమ న్నారు. ఈ కొనుగోళ్ల ప్రక్రియ విజయ వంతం కావడానికి సహకరించిన శ్రీ లక్ష్మి గణేష్,ఎంఆర్ఎం రైస్ మిల్ యాజమాన్యం ఇనుగంటి వినోద్ రావు, ఇనుగంటి.వెంకటేశ్వర్ రావు, శంకరయ్య, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ జి .నరేష్,స్థానిక రైతులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## లివర్‌ను కాపాడితేనే జీవితం సురక్షితం..!




**ఫ్యాటీ లివర్, హెపటైటిస్‌తో పెరుగుతున్న క్యాన్సర్ ముప్పు – ముందస్తు పరీక్షలతో ప్రాణాలు కాపాడుకోవచ్చని నిపుణుల హెచ్చరిక**

**సంగారెడ్డి, వుదయం.**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీకి చెందిన సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లివర్ స్పెషలిస్ట్ డాక్టర్ నవీన్ పోలవరపు తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్లు, అధిక మద్యపానం వంటి కారణాలతో లివర్ తీవ్రంగా దెబ్బతింటోందన్నారు. లివర్ డ్యామేజ్‌ను "సైలెంట్ కిల్లర్"గా అభివర్ణిస్తూ, కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు బయటపడే వరకు చాలా మందికి వ్యాధి ఉన్న విషయం తెలియదన్నారు. అప్పటికే వ్యాధి ముదిరిపోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. హెపటైటిస్ బి, సి వైరస్లు చాలామందికి తెలియకుండానే శరీరంలో ఉండి క్రమేపీ లివర్‌ను దెబ్బతీస్తాయని తెలిపారు. ముందుగానే పరీక్షల ద్వారా గుర్తిస్తే వ్యాక్సినేషన్, చికిత్సలతో ప్రమాదాన్ని తగ్గించవచ్చన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఫ్యాటీ లివర్ నివారణకు కొలెస్ట్రాల్, డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలను కూడా అదుపులో ఉంచుకోవాలని సూచించారు.అధిక మద్యపానం వల్ల ప్యాంక్రియాటైటిస్ వచ్చే ప్రమాదం ఉందని, ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు. మద్యపానం తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం ద్వారా లివర్, ప్యాంక్రియాస్ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చన్నారు.అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు, జీర్ణకోశ సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. మలవిసర్జనలో మార్పులు, మోషన్‌లో రక్తం పడటం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి కొనసాగితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.కొలనోస్కోపీ ద్వారా పేగుల్లోని పాలిప్స్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి తొలగించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. పాశ్చాత్య దేశాల్లో కొలనోస్కోపీపై అవగాహన పెరగడంతో పెద్దప్రేగు క్యాన్సర్ కేసులు గణనీయంగా తగ్గాయని వివరించారు .ఈ కార్యక్రమంలో కార్పొరేట్ రిలేషన్స్ ఆఫీసర్ మహేష్, సంగారెడ్డి అధికారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## స్తోమత కలిగిన వారు ఖుర్బానీ ఖచ్చితంగా ఇవ్వాలి



**- ఇస్లాం సూచించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి**
**- స్తోమత కలిగి కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఖుర్బానీ ఇవ్వాలి**
**ఈద్ ఉల్ అజ్హా లో మౌలానా ఆలీమ్ హఫీజ్ షాకీర్ సిద్దిఖి**

**నాగర్ కర్నూల్ మే 28 (వుదయం ప్రతినిధి)**

స్తోమత కలిగిన ప్రతి ఒక్క ముస్లిం ఖుర్బానీ ఖచ్చితంగా ఇవ్వాలని జామియా నిజామీయా కు చెందిన ఈద్ ఉల్ అజ్హా లో మౌలానా ఆలీమ్ హఫీజ్ షాకీర్ సిద్దిఖి అన్నారు. గురువారం నాడు జిల్లా కేంద్రం లోని శ్రీపురం రోడ్డు నగల ఈద్గా వద్ద ఈద్ ఉల్ అజ్హా సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. స్తోమత కలిగి ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వకపోవడం ఇస్లాం ధర్మం అందించిన మార్గదర్శకాలకు విరుద్ధమన్నారు. సంపాదనతో భోగభాగ్యాలు అనుభవిస్తూ కుర్బానీ, జకాత్ వంటి ఇస్లాం చూపించిన మార్గదర్శకాల అమలుకు వచ్చేవరకు పేదలుగా సతమతమవడం తగదన్నారు. తమ వద్ద ఉన్న ఆస్తులు అనుభవిస్తున్న సమయంలో ఇస్లాం చూపిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. తమ వద్ద ఉన్న స్థిర చర ఆస్తులు, బంగారం వెండి వంటి వస్తువులు అత్యవసర సమయంలో విక్రయించే అవకాశం లేని ఎడల కుర్బానీ జకాత్ ఇచ్చే అంశం ముందుకు వస్తే ఆర్థిక ఇబ్బందులు అనే సాకుతో పాటించడం లేదని ఇది ఇస్లాం ధర్మంలో విరుద్ధమన్నారు. కుటుంబంలో సపాదించేవారు ఎంతమంది ఉంటే అందరిపై ఖుర్బానీ వాజిబ్ అంటే అది ఖచ్చితం అన్న అంశాన్ని మరువకూడదన్నారు. బక్రీద్ అంటేనే త్యాగాలకు ప్రతిక అని అయిన వివరించారు. అనంతరం మౌలానా హాఫీజ్ మహబూబ్ అలీ ఆధ్యాత్మిక సందేశం అందిస్తూ ఇస్లాం ధర్మం పవిత్రతను వివరించారు. ఇస్లాం ధర్మం చూపిన మార్గంలో అన్ని అంశాలను కులం కుశంగా అమలు చేసినప్పుడే అల్లా కృపకు పాత్రులు అవుతారన్నారు. జకాత్, కుర్బానీ వంటి అంశాల విషయంలో ముస్లింలు ఎప్పుడు వెనకడుగు వేయకూడదని సూచించారు.
ఈద్ ఉల్ అజ్హా ప్రత్యేక నమాజు, ఖుద్బాను జామా మస్జిద్ ఇమామ్ అబ్దుల్ హాక్ తనయులు మౌలానా హాఫీజ్ అన్వారుల్ హాక్ చదివించారు. ప్రత్యేక ప్రార్థనలు ప్రపంచ శాంతి, దేశం సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పాడి పంటలతో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.వక్ఫ్ కాంప్లెక్స్ మేనేజింగ్ కమిటీ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తోపాటు ఇతర ప్రజాప్రతినిధులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అధికారులు అనధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ఏర్పాట్లు చేసినందుకుగాను ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి: అధికారుల వెల్లడి



**వనపర్తి మే 28 (వుదయం ప్రతినిధి)**

రైతుల్లో ఆందోళన అవసరం లేదు.. వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తాం అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేసి, వచ్చే 15 రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండలం చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం నిల్వ కోసం అదనంగా ఏర్పాటు చేసిన గోదామును అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి సందర్శించి అక్కడ జరుగుతున్న అన్లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిస్థాయిలో కంప్లీట్ చేస్తామని హామీ ఇచ్చారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అకాల వర్షం కారణంగా 600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడవగా వాటిని బాయిల్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో గత రెండేళ్ల నుంచి రికార్డు స్థాయిలో వరి ధాన్యం దిగుబడులు వస్తున్నాయని తెలిపారు. గతంలో సీజన్ కు 1,50,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చేదని, గత రెండేళ్ల కాలం నుంచి ఒక సీజన్ కు జిల్లాలో 2,50,00 మెట్రి టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో అత్యధిక దిగుబడి ధాన్యం నిల్వ కోసం గోదాముల్లో స్థలం కొరత ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఈసారి వరి ధాన్యం కోతలు ఆలస్యంగా ప్రారంభం కావడం, బీహార్ నుండి వచ్చే హమాలీల కొరత కూడా కొనుగోళ్ల ప్రక్రియ నెమ్మదిగా సాగడానికి ఒక కారణమని తెలిపారు. జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్ కు సంబంధించి ఇప్పటివరకు 1,50,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించడం జరుగుతోందని, ఇంకా లక్ష మెట్రిక్ టన్నుల దాకా కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని 45 ప్రాంతాల్లో అన్లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం నిలువకు స్థలం కొరత ఏర్పడిన నేపథ్యంలో చిట్యాల మార్కెట్ యార్డులోని షెడ్ 1 ను గోదాముగా మార్చిడి చేసుకొని ధాన్యాన్ని అన్లోడింగ్ చేసి నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంకా అదనంగా స్థలాలను ఏర్పాటు చేయడం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హమాలీలను సైతం వీలైనంత ఎక్కువ మందిని రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ చిమనగుంటపల్లి శివారులో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర గోదామును సందర్శించి అక్కడ కూడా అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. హమాలీలను ఎక్కువ మందిని రప్పించి అన్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డి సి ఎస్ ఓ కాశీ విశ్వనాథ్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్ సింగ్, డి సి ఓ రాణి, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లై ఆంజనేయులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గజ్వేల్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**గజ్వేల్, మే 28 (వుదయం ప్రతినిధి)**

మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని, ఆయన అందరికీ చిరస్మరణీయుడని కొనియాడారు. యువత రాజకీయాల్లోకి రావడానికి ఎన్టీఆర్ స్ఫూర్తి అని, ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, వెంకటేశ్వర్లు, టీచర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల వంటి పథకాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ వేడుకల్లో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు ఆర్కే శ్రీనివాస్ మరియు పెద్ద సంఖ్యలో ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



## ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తి ఎన్టీఆర్




**నారాయణపేట మే 28 (వుదయం ప్రతినిధి)**

తెలుగోడి ఘన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత నాయకుడు ఎన్టీ ఆర్ అని తెలుగుదేశం పార్టీ హయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉంటూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి అహోరాత్రులు శ్రమించి స్వచ్ఛమైన సుపరి పాలనను అందించిన నాయకుడు అని టిడిపి రాష్ట్ర నాయకులు ఓంప్రకాష్ ముదిరాజ్ అన్నారు.గురువారం ఎన్టీ ఆర్ 103,వ జయంతి వేడుకలను ఆపార్టీ రాష్ట్ర నాయకులు ఓంప్రకాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు సెంటర్ చౌక్ బజార్ లో సత్యనారాయణ చౌరస్తా లో ఎన్టీ ఆర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళర్పించారు. అనంతరం అయన మాట్లాడుతు నిరుపేదల కూడు గూడు గుడ్డతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొరకు నిరంతరం తపించిన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్, యాబన్న చౌదరి, వద్ది నారాయణ, భీమన్న, పెంటయ్య, రాములు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల వ్యాప్తంగా గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా లో ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.ఈ మేరకు మండల కేంద్రంలోని మసీదులో ముస్లిం మత పెద్ద జనాబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను కొలుస్తామన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలుతెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం కులస్తులు మైనోద్దీన్, ఏక్బాల్,ఇబ్రహీం,మాజీ కోఆప్షన్ అబ్దుల్ అజీజ్,నసీరుద్దీన్, అజ్గర్,తలహా,సిద్ధిక్,బాబు మియా, షాదుల్లా,ఖలీల్, అజీజ్, రఫిక్, హుస్సేన్,రియాజ్, ఫిరోజ్,పాషా భాయ్,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అమ్మవార్ల కల్యాణ మహోత్సవం..



**ముదిరాజ్ కుల పెద్దలకు ఘన సన్మానం!**

**సిద్దిపేట/జగదేవపూర్, మే 28: (వుదయం ప్రతినిధి)**

మండల కేంద్రమైన జగదేవపూర్ పట్టణంలో గురువారం పెద్దమ్మతల్లి, మహంకాలమ్మ తల్లి, మరియు కనకదుర్గమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ముదిరాజ్ కుల పెద్దలను ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ దంపతులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా అభిషేక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది .ఈ మహత్తర కార్యాన్ని ముందుండి, అత్యంత దిగ్విజయంగా నిర్వహించినందుకు గాను ముదిరాజ్ కుల పెద్దలను ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులైన:రాగుల రాజయ్య, కొంపెల్లి కరుణాకర్, రాగుల రాజు, రాగుల బలరాం, కొంపెల్లి కృష్ణ, రాగుల నర్సింలు, రాయరాం, చంద్రయ్య, రాగుల బాలనర్సింలు, అరే కనకయ్యగార్లకు శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు, కుల బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## తడిసిన ధాన్యం బస్తాల పరిశీలన

**పారాబైల్డ్ రైస్ మిల్లుకు తరలింపు**

**మహబూబ్ నగర్ మే 28 (వుదయం ప్రతినిధి)**



రైతు సంక్షేమం ధ్యేయంగా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది అని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ రవి నాయక్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరి ధాన్యం రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు కు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందన్నారు.భూత్పూర్ మండలంలో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి రైతుకు అండగా నిలిచారు. భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన రైతు కె. శ్రీనివాసులు నిల్వ చేసిన వరి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా తడిసిపోయిన విషయం తెలిసిందే. రైతు ఇబ్బందులను గమనించిన జిల్లా యంత్రాంగం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే స్పందించి, ప్రభుత్వ రైతు సంక్షేమ విధానాలకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది అన్నారు.బుధవారం హస్నాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలించిన జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవి నాయక్, సంబంధిత అధికారులు రైతు ధాన్యం లోతట్టు ప్రాంతంలో నిల్వ ఉండటంతో వర్షపు నీటిలో తడిసిపోయినట్లు గుర్తించారు. సుమారు 150200 వరి సంచులు నీటిలో తడిసిపోయిన నేపథ్యంలో రైతుకు ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు ప్రారంభించారు.
ప్రభుత్వ ఆదేశాల మేరకు తాటికొండలోని నరహరి పారా బాయిల్డ్ రైస్ మిల్ యాజమాన్యంతో చర్చించి, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు రవి నాయక్,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ లు అదేవిధంగా కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌కు మిల్లర్ అక్‌నాలెడ్జ్ చేసిన వెంటనే ట్రక్ షీట్ జనరేట్ చేసి, రైతుకు కనీస మద్దతు ధర చెల్లింపులు అత్యవసరంగా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతు కె. శ్రీనివాసులు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తామని చెప్పడమే కాకుండా విషయంలో ఆచరణలో చూపించింది అన్నారు. నా వంటి నిరుపేద రైతులకు ఈ ప్రభుత్వం నిజమైన అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కి, వచ్చిన అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు రోజులలో ఎంఎస్పీ మొత్తం నా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని అధికారులు ధైర్యం చెప్పడంతో నాకు ఎంతో భరోసా కలిగింది అని ఆనందం వ్యక్తం చేశారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు.

## ఖండాంతర ఖ్యాతిగాంచిన గద్వాల చీరల చరిత్ర

**గద్వాల మే 28 (వుదయం బ్యూరో)**



తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల్ ప్రాంతం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది "గద్వాల చీర". భారతీయ చేనేత సంప్రదాయంలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ చీరలు కేవలం వస్త్రాలు మాత్రమే కావు. అవి కళ, సంప్రదాయం, సంస్కృతి, నైపుణ్యం, కుటుంబాల జీవనాధారం అన్నీ కలిసిన గొప్ప వారసత్వం. "గద్వాల చీర" పేరు దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, విదేశాల్లో కూడా ఖ్యాతి గడించింది.గద్వాల చీరల ఆవిర్భావంగద్వాల చీరల చరిత్ర దాదాపు 300 సంవత్సరాలకు పైబడినదిగా చెబుతారు. అప్పటి గద్వాల సంస్థానం పాలకులు చేనేత కళను ప్రోత్సహించారు. ముఖ్యంగా మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ కాలంలో నేత కళాకారులకు విశేష ఆదరణ లభించింది.గద్వాల ప్రాంతంలోని పద్మశాలి, దేవాంగ, స్వకులశాలి, కుర్ని, తొగుట, జాంద్ర తదితర నేత కుటుంబాలు తమ సంప్రదాయ నైపుణ్యంతో చీరల తయారీలో ప్రత్యేకత సాధించాయి. మొదట రాజ కుటుంబాల కోసం మాత్రమే నేసిన ఈ చీరలు తరువాత సాధారణ ప్రజల్లోనూ ప్రాచుర్యం పొందాయి.
గద్వాల చీరల ప్రత్యేకత ఏమిటి?గద్వాల చీరలను ఇతర చీరలతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెట్టే అంశాలు ఎన్నో ఉన్నాయి.
1. పట్టు అంచు – పత్తి మధ్యభాగంగద్వాల చీరలో ప్రధాన ప్రత్యేకత "కాటన్ బాడీ - సిల్క్ బోర్డర్". చీర మధ్య భాగం పత్తితో ఉండగా, అంచులు మరియు పల్లూ పట్టుతో తయారవుతాయి. ఈ మేళవింపే గద్వాల చీరలకు ప్రత్యేక అందాన్ని ఇస్తుంది.
2. కుట్టు (జాయింట్ లాక్) నైపుణ్యంపత్తి మరియు పట్టును కలిపే ప్రత్యేక నేసే విధానాన్ని కుట్టు (జాయింట్ లాక్)" అంటారు. ఇది అత్యంత క్లిష్టమైన కళ. చేతితో నేసే ఈ ప్రక్రియకు ఎంతో ఓపిక, నైపుణ్యం అవసం.3. జరీ పనితనం పురాతన కాలంలో స్వచ్ఛమైన వెండి, బంగారు జరీలను ఉపయోగించేవారు. అందుకే గద్వాల చీరలు రాజసాన్ని ప్రతిబింబిస్తాయి.4. తేలికైన చీర"గద్వాల చీరను మాచిస్ (అగ్గిపెట్టెలో) పెట్టెలో మడిచిపెట్టొచ్చు" అనే మాట ప్రసిద్ధి చెందింది. అంత తేలికగా, మృదువుగా ఈ చీరలు ఉంటాయి.ఆలయ కళల ప్రభావంగద్వాల చీరల అంచుల్లో, పల్లూలో కనిపించే డిజైన్లు దక్షిణ భారత ఆలయ శిల్పకళ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. దేవాలయ గోపురాలు, పూల డిజైన్లు, సంప్రదాయ ఆకృతులు చీరలకు మరింత అందాన్ని ఇస్తాయి.
దేశ విదేశాల్లో గుర్తింపుగద్వాల చీరలు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ సంపాదించాయి. వివాహాలు, పండుగలు, ప్రత్యేక వేడుకల్లో గద్వాల చీరలకు ప్రత్యేక స్థానం ఉంది. అంతేకాకుండా అమెరికా, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల్లో నివసించే భారతీయులు కూడా గద్వాల చీరలను ఎంతో ఇష్టపడుతున్నారు.భౌగోళిక గుర్తింపు (GI Tag)గద్వాల చీరలకు భారత ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు (GI Tag) మంజూరు చేసింది. ఇది గద్వాల చీరల ప్రత్యేకతకు అధికారిక గుర్తింపు. ఈ గుర్తింపు వల్ల ప్రపంచవ్యాప్తంగా గద్వాల చీరలకు మరింత ప్రాధాన్యం పెరిగింది. నేతన్నల కష్టంఒక గద్వాల చీర నేయడానికి రోజుల నుంచి వారాల వరకు సమయం పడుతుంది. డిజైన్ క్లిష్టతను బట్టి నెలరోజులు కూడా పట్టవచ్చు. కానీ నేతన్నలకు సరైన ఆదాయం అందకపోవడం బాధాకరం.ముడి సరుకుల ధరలు పెరగడం, యంత్రాల తయారీ చీరల పోటీ, మధ్యవర్తుల దోపిడీ కారణంగా చాలామంది నేత కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.ఆధునిక కాలంలో మార్పులుఇప్పటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా గద్వాల చీరల్లో కొత్త డిజైన్లు, ఆధునిక రంగులు, ఫ్యాషన్ శైలులు ప్రవేశించాయి. అయినప్పటికీ సంప్రదాయ నేసే కళను కాపాడేందుకు నేత కళాకారులు కృషి చేస్తున్నారు. ఆన్‌లైన్ మార్కెట్లు రావడంతో గద్వాల చీరలు ప్రపంచవ్యాప్తంగా మరింత చేరువయ్యాయి.గద్వాల చీర – తెలంగాణ గర్వకారణంగద్వాల చీర కేవలం వస్త్రం కాదు; అది తెలంగాణ సంస్కృతి ప్రతీక. నేతన్నల చెమట, కళ, సంప్రదాయం, కుటుంబ జీవన పోరాటం అన్నీ కలిసిన కళాఖండం.ఈ కళను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా నేత కుటుంబాలకు అండగా నిలబడాలి. గద్వాల చీరలను కొనుగోలు చేయడం అంటే ఒక సంప్రదాయాన్ని నిలబెట్టడం అనే భావన సమాజంలో పెరగాలి.

## అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తరలింపు వేగవంతం

**వికారాబాద్: మే 28, (వుదయం జిల్లా ప్రతినిధి)**



తడిసిన ధాన్యాన్ని అదనపు లారీలు, ట్రాక్టర్ల తో పారా బాయిల్డ్ మిల్లులకు తరలింపు జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ యాసంగి 202526 సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా మరియు మిల్లులకు తరలింపు ప్రక్రియను జిల్లా యంత్రాంగం వేగవంతంగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల పరిధిలో సుమారు 3000 వేల బ్యాగులు, 120 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమైనట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్, పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి, సహకార, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించి నట్టు కలెక్టర్ తెలిపారు.ధాన్యం తరలింపుపై ప్రత్యేక చర్యలుతడిసిన ధాన్యం రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు లారీలు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి అత్యవసరంగా పారా బైయిల్డ్ మిల్లులకు తరలింపు చర్యలు చేపట్టి నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు.బుధవారం ఒక్క రోజే సుమారు 120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సమీపంలోని పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు విజయవంతంగా తరలించి నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఎక్కడైతే వర్షపు నీటితో ధాన్యం తడిసిందో అక్కడే సంచుల్లో నింపి మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.
పిపిసి సెంటర్ పరిగి మండలం సుల్తాన్ పూర్,గ్రామం, పి పి సి సెంటర్ బాలం పేట్ గ్రామం, దౌల్తాబాద్ మండలం, పి పి సి సెంటర్ మేకవనం పల్లి గ్రామం, మోమిన్ పేట్ మండలం, పిపిసి సెంటర్ ముజాయిద్ పూర్ గ్రామం కుల్కచెర్ల మండలం ల లో నిల్వ చేసిన వరి ధాన్యం వర్షాల కారణంగా పూర్తిగా తడిసిపోవడంతో అధికారులు వెంటనే స్పందించి పరిశీలించి పారా బాయిల్డ్ మిల్లులకు తరలించి నట్టు ఆయన తెలిపారు.రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ధాన్యాన్ని సురక్షితంగా తరలించి ఎంఎస్పీ చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లులకు తరలింపు మరియు ఎంఎస్పీ చెల్లింపుల ప్రక్రియలను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సందర్శించిన వ్యవసాయ అధికారి

**మహబూబ్ నగర్ మే 28 (వుదయం ప్రతినిధి)**



మూసాపేట మండలంలోని వేముల, కొమిరెడ్డిపల్లి, మహమ్మద్ హుస్సేన్ పల్లి, నందిపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి బి. వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులతో కలసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు పరిశీలించారు.రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇందులో భాగంగా వేముల గ్రామం లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఇంకా రెండు లారీలు ధాన్యం రవాణా కు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. కొమ్మిరెడ్డిపల్లి వరి కొనుగోలు కేంద్రంలో ఒక లారీ అవసరం ఉందని సంబంధిత రైతులు,కొనుగోలు కేంద్రం ఇంచార్జి ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ధాన్యం రవాణా కు లారీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 6000 గన్ని బ్యాగులు అవసరమని, 6 లారీలు ఏర్పాటు చేయాలని రైతులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అలాగే పైన తెలిపిన కొనుగోలు కేంద్రాలలో కొన్ని లారీలు, ట్రాక్టర్లు దాన్యం రైస్ మిల్స్ దగ్గర అన్లోడింగ్ కావడంలేదని రైతులు వివరించారు.ధాన్యం రవాణా కు,లారీల ఏర్పాటు,గన్నీల సరఫరా కు పౌర సరఫరాల శాఖ అధికారులతో మాట్లాడి ఏర్పాటు కు తగిన చర్యలు తీసుకున్నారు.ఆన్లైన్ ప్రొక్యూర్ మెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ లో లో వెంటనే పెండింగ్ ఎంట్రీ లు నమోదు చేసి ధాన్యం చెల్లింపులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు.

## ఎర్ర పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం.. కాంగ్రెస్ నాయకులకు ఆహ్వానం

**- బోనాల పండుగకు తరలిరావాలని జై భీమ్ నగర్ వాసుల విజ్ఞప్తి**

**సిద్ధిపేట/జగదేవపూర్, మే 28 (వుదయం ప్రతినిధి)**



సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలోని జై భీమ్ నగర్ వాసులు కొత్తగా నిర్మించిన ఎర్ర పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి, అలాగే బంగారు మైసమ్మ, మాతమ్మ దేవతల బోనాల పండుగ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను జై భీమ్ నగర్ కుల సంఘం సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేయాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి ని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి గారిని, కాంగ్రెస్ మండల మాజీ వైస్ ఎంపీపీ దయాకర్ రెడ్డి ని, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర రాము ని మరియు వార్డు సభ్యులు దండే వెంకటేష్ ను నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికలు అందజేసిన వారిలో జై భీమ్ నగర్ కుల సంఘం సభ్యులు మచ్చ చంద్రయ్య, తుర్కపల్లి నాగరాజు, ధార కరుణాకర్, మచ్చ అశోక్, కోరమైన యాదగిరి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో అమ్మవార్ల ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు.

## మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ ప్రధానం



**నారాయణపేట మే 28 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రం కృష్ణ గోకులం స్కూల్ ఆవరణలో మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో సీనియర్ కరాటే మాస్టర్ అశోక్ తో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కరాటేలో ఉత్తీర్ణత సాధించి బ్లాక్ బెల్ట్ సాధించారు. కరాటే లో బ్లాక్ బెల్ట్ సాధించిన భావేష్ నాయుడు,రిత్విక్ అద్వైత్, రాజేశ్వరి, స్రవంతి, శివ శంకర్, యం. అఖిల్, అభిరామ్, అర్జున్, లావణ్య, భీమేష్ లను తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వర్యులు డా.వాకిటి శ్రీహరి విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ ,సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఫౌండర్ కేశవ్ గౌడ్, స్థానిక కరాటే మాస్టర్ అశోక్, మాస్టర్ శివకుమార్ యాదవ్, కానిస్టేబుల్ బాలరాజు, యం. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ సుదర్శన మహాయాగం

**యాగంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు.**

**నారాయణఖేడ్ మే 28 వుదయం**



నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణం లోని శ్రీ మహతి జ్యోతిష్యాలయం నందు లోకకళ్యాణార్థం శ్రీ లక్ష్మీ సుదర్శన మహాయాగ క్రతువు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం యాగంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సతీమణి అనుపమ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్మార్త జ్యోతిష్య చండీ ఉపాసకులు శ్రీ మాల్మంచి గురురాజ శర్మ ఆధ్వర్యంలో అధికజ్యేష్ఠ మాసం సందర్భంగా ఈ మహా యాగమును నిర్వహిస్తున్నారు. ఈ నెల (మే) 18వ తేదీన ప్రారంభమైన ఈ యాగ క్రతువు జూన్ 15వ తేదీ అమావాస్య పార్యము వరకు నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగనుంది.ఈ మహా యజ్ఞంలో భాగంగా గురువారం నాడు జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి, అనుపమ సంజీవరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యాగ నిర్వాహకులు శ్రీ మాల్మంచి గురురాజ శర్మ ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, పట్లోళ్ల సుధాకర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగ విశేషాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన టిడిపి నాయకులు

**సంగారెడ్డి వుదయం**



సంగారెడ్డిలో మహనీయులు స్వర్గీయ ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మెదక్ పార్లమెంట్ టిడిపి కన్వీనర్ ఇల్లేందుల రమేష్ ఆధ్వర్యంలో జిల్లా టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి, సంగారెడ్డి ఎక్స్ రోడ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు.అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో రెండో రోజు నిర్వహించిన వర్చువల్ మహానాడులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇల్లేందుల రమేష్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ కారణజన్ముడని, వెండితెర ఇలవేల్పుగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నో సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు.మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కరికే సత్యనారాయణ యాదవ్, అశోక్ గుప్తా, జనార్దన్, వివి నర్సింలు, బందెన్న గౌడ్, ప్రకాష్, మల్లేశం యాదవ్, హనుమంతరెడ్డి, మానేయా గౌడ్, నాగేంద్ర గౌడ్ (నాని), సూర్య ప్రకాష్, అయ్యప్ప, గోపాల్, సాయన్న చారి, రామచంద్ర యాదవ్, యండి నజీర్, నహీం, ధర్మారావు, సురేష్, రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ జరుపుకున్న ముస్లిం సోదరులు



**మరికల్ మే 28 (వుదయం ప్రతినిధి)**

మరికల్ మండల కేంద్రంలో మరియు ధన్వాడ మండల కేంద్రంలో తో పాటు వివిధ గ్రామాల గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఉదయం జామియా మజీద్ లో ప్రత్యేక ప్రార్థనలు స్థానిక వేలాదిమంది భక్తులు హాజరయ్యారు ప్రార్థన అనంతరం ముస్లింలు బక్రీద్ పండుగ పవిత్రత పరస్పర త్యాగం మరియు సేవా భావాలపై ప్రసంగించారు పండుగను కేవలం ధార్మిక సందర్భంగా కాకుండా సమాజంలో ఐక్యత మరియు సహాయ సేవల వేడుకగా ముస్లిం సోదరులు జరుపుకున్నారు అనంతరం వివిధ రాజకీయ నాయకులు ముస్లింలకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ముస్లింలు సోదరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రపంచంలోనే అతిపెద్ద నందీశ్వర విగ్రహం

**సంగారెడ్డి వుదయం.**



సంగారెడ్డి మండలం ఫసల్వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రపంచంలోనే అతిపెద్ద నందీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. గురువారం ఆశ్రమంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.ఆయన మాట్లాడుతూ.. 30 అడుగుల పొడవు, 13 అడుగుల వెడల్పు, 19 అడుగుల ఎత్తుతో భారీ నందీశ్వర విగ్రహాన్ని తయారు చేయనున్నట్లు చెప్పారు. ఈ విగ్రహానికి ఉపయోగించే రాయి బరువు సుమారు 684 టన్నులు ఉంటుందని తెలిపారు. కంది మండలం ఎర్దనూర్ శివారులోని కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ఈ భారీ రాయి లభ్యమైనట్లు వెల్లడించారు.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయంలో ఉన్న నంది విగ్రహమే అతిపెద్దదిగా గుర్తింపు పొందిందని, ఫసల్వాదిలో ఏర్పాటు చేయబోయే నందీశ్వర విగ్రహం దానికంటే ఎత్తు, బరువులో మరింత భారీగా ఉండబోతుందని పేర్కొన్నారు. త్వరలో ప్రత్యేక భారీ వాహనంలో ఈ రాయిని ఊరేగింపుగా ఆశ్రమానికి తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నందీశ్వర ప్రతిమ నమూనాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యాపీఠం మీడియా ఇన్‌చార్జి తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ.. బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రపంచంలోనే అతిపెద్ద నందీశ్వర విగ్రహం ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి కావడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు.సమావేశంలో సభ్యులు ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

**డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్**

**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**



నిజాంపేట మండలం ఆరుగాలం కష్టపడి పండించిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి .శంకర్ అన్నారు. గురువారం నాడు మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు మరియు నందిగామ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రైతులు ధాన్యం తీసుకు వచ్చి నెలరోజులవుతున్న కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల రైతు నరకయాతన పడుతున్నారని అన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని అదనపు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి, పౌర సరఫరాల శాఖ మంత్రి మాటలకు చేతలకు పొంతన లేదని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొనుగోలు జరగడంలేదని అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో దాదాపు 500 మందికి పైగా రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి రాగా ఇప్పటివరకు కేవలం 338 మంది రైతుల నుండి మాత్రమే కొనుగోలు చేశారని ఇంకా 120 మంది రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ఎదురుచూపులు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల ధాన్యం తడవకుండా అదనపు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించిన కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అదనపు ఏర్పాట్లు చేయలేదన్నారు. 500 మంది రైతులకు కేవలం 25 తార్పాలిన్ కవర్లను మాత్రమే ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఒక రైతు కిరాయికి 5 కవర్లను తీసుకుంటే రోజుకు ఒక్కొక్క కవర్కు 20 చొప్పున దాదాపు నెలవుకు 3000 రూపాయలకు పైగా కవర్ ల కిరాయి చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారని శంకర్ తెలిపారు. ప్రతి బస్తాకు రెండుకిలోల వరకు తరుగు తీస్తూ రైస్ మిల్లర్ల వ్యాపారులు రైతుల నుండి దోచుకుంటున్నారని ఆరోపించారు. ధాన్యాన్ని దించుకోకుండా తరుగు తీస్తు రైతులను ఇబ్బందులపాలు చేస్తున్న రైస్ మిల్లను సీజ్ చేసి జరిమానావిధించాలని కోరారు. యుద్ధ ప్రాతిపదికన కళ్ళల్లో ఉన్న ధాన్యము తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని శంకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ రైతులు శ్రీనివాస్ ,బాలయ్య శ్రీశైలం ,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి శిబిరంలో 112 మందికి కంటి పరీక్షలు, 50 మందికి కంటి ఆపరేషన్లు....



**నాగర్ కర్నూల్ మే 28 (వుదయం ప్రతినిధి)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా గురువారం నాడు పాత కలెక్టరేట్ భవనం 102 గది లో నిర్వహించిన కంటి చికిత్స శిబిరం విజయవంతమైనట్లు నాగర్ కర్నూల్ ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ తెలిపారు.ఈ శిబిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో అర్హులైన క్యాటరాక్ట్ పొరగల 50 మందిని గుర్తించి ప్రత్యేక అంబులెన్స్ లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు. రోగులకు శిబిరంలో ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు,మందులు అందజేశారు. ప్రతి ఒక్కరు జీవితకాలము కంటిచూపును కలిగి ఉండుటకు నిత్య భోజనంలో విటమిన్ ఏ కూడిన క్యారెట్, ఆకుకూరలు,చేపలు, ఆహార పదార్థాలు అధిక మొత్తంలో తినాలని సూచించారు .ఈ కార్యక్రమంలో సుకుమార్ రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తరలింపులో అధికారులు జాప్యం చెయ్యవద్దు

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**ఇతర ప్రాంతాలలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకోవాలి**

**తాండూరు మ్మెల్యే మనోహర్ రెడ్డి**

**యాలాల మే 28 (వుదయం ప్రతినిధి ):**



ధాన్యం తరలింపులో అధికారులు జాప్యం చేయొద్దని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. యాలాల మండలం పర్యటనలో భాగంగా తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గారు స్థానిక నాయకులతో మాట్లాడి ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధికారులతో ఫోన్లో మాట్లాడారు.అనంతరం ఆయన జిల్లా అధికారులతో, మిల్లర్ లతో, ట్రాన్స్పోర్ట్ వారితో ఫోన్ లో మాట్లాడుతూ.. తాండూర్ నియోజకవర్గంలో స్టాక్ పాయింట్స్ పూర్తిగా ధాన్యంతో భర్తీ కావడం జరిగింది అన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల్లో స్టాక్ పాయింట్స్ గుర్తించడంతో తాండూర్ ప్రాంతంలో గల ధాన్యంను ఇతర స్టాక్ పాయింట్స్ కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు పూర్తి ఏర్పాట్లు చేసి రైతులకు ఇబ్బందులు రాకుండా నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కేంద్రాలలో ధాన్యం నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ధాన్యం తరలింపు ఆలస్యమైందని వివరించారు. వెంటనే అదనంగా స్టాక్ పైన ఏర్పాటుచేసి ధాన్యాన్ని స్టాక్ పాయింట్ కు చేరవేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండి రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. అధికారుల అప్రమత్తంగా ఉండి ధాన్యం సరఫరా వేగవంతం చేయాలని సూచించారు. లారీలను ట్రాన్స్పోర్ట్ అధికారులతో స సమన్వయం చేసుకొని ధాన్యం తరలించే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రైతులను ఇబ్బందులు పెడితే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**అదనపు ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు**

**తడిసిన ధాన్యం కొంటాం, రైతులకు ఆందోళన వద్దు**

**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ మే 28 (వుదయం ప్రతినిధి)**



జిల్లా లోని తెలకపల్లి మండలం చిన్న ముద్దునూరు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ, రవాణా, నమోదు ప్రక్రియలు, కాంటా వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, వరి తూకం విధానం, నాణ్యత ప్రమాణాలు, రికార్డుల నిర్వహణను స్వయంగా పరిశీలించారు. రిజిస్టర్‌లు, ట్రక్ షీట్లు తనిఖీ చేసి ఇప్పటివరకు ఎన్ని లారీలు వచ్చాయి, ఎన్ని అన్‌లోడింగ్ పూర్తయ్యాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.2. రైతులకు భరోసా తడిసిన ధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని, తూకంలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు.3. అధికారులకు కీలక ఆదేశాలు ధాన్యం ఎక్కువ కాలం కేంద్రాల్లో నిల్వ ఉండకుండా వేగంగా లోడింగ్ పూర్తి చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లు, రవాణా, చెల్లింపుల ప్రక్రియలను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, రైతుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు ఛార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల కోసం తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు ఉండేలా చూడాలని, ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వరి కొనుగోలు ప్రక్రియ అమలు చేసి, రైతులకు కనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో అందించాలని పేర్కొన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం...



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామానికి చెందిన బక్కొల్ల దేవుని కొమరయ్య (70) అనారోగ్యంతో మరణించడం జరిగింది. గ్రామ సర్పంచ్ కనకరాజు,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమేష్,వార్డు సభ్యులు నవీన్, కుంట నర్సింలు, బొజ్జ స్వామి, రాజ్యం,సత్యనారాయణ, స్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రమైన మద్దతు ధరల నిర్ణయాన్ని నిరసించండి

**నారాయణపేట మే 28 (వుదయం ప్రతినిధి)**



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పంటల మద్దతు ధరల ను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కోటకొండ గ్రామంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్) మండల నాయకుడు ఏం సుభాష్ అధ్యక్షతన మినిమం సపోర్ట్ ప్రైస్ జీవో కాపీని దహనం చేశారు. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ భారత ప్రభుత్వం 202627 సం,,రానికి సంబంధించి వ్యవసాయ పంటలకు మద్దతు ధరలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గల ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సి సి ఈ ఎ) అసమగ్రామైన మద్దతు ధరలను నిర్ణయించింది అన్నారు. బిజెపి పార్టీ అధికారంలోకి రాకముందు దేశంలో రైతాంగం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలంటే స్వామినాథ సిఫారాసుల కనుగొనంగా సమగ్రమైన వ్యవసాయ ఉత్పత్తుల ఖర్చుల ప్రతిపాదికన సి2+50 శాతం కలిపి ధర నిర్ణయిస్తామని 2022 నాటికి దేశ రైతాంగానికి రెట్టింపు ఆదాయం కలిగే విధంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొస్తామని పుంకాను పుంకాలుగా ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడుస్తున్న (మూడవసారి అధికారం లోకి వచ్చిన కూడా) దేశానికి అన్నం పెట్టే అన్నదాతకు ఆసరా చేయకపోగా తీవ్రమైన ద్రోహానికి ఒడిగట్టిందన్నారు. రైతాంగానికి అవసరమైనటువంటి విత్తనాలు, రసాయనిక ఎరువులు,పురుగు మందులు, కూలీల వేతనాలు, ట్రాక్టర్ కిరాయిలు, డీజిల్ ,పెట్రోల్, విద్యుత్తు, సాగునీరు తదితర వ్యవసాయ ఉత్పత్తి కారకాల ధరలు ఆకాశాన్ని ఎక్కుతున్న వీటిని ఏమాత్రం ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా మినిమం సపోర్ట్ ప్రైస్ (ఎం ఎస్ పి) ఏ2+ ఎఫ్ఎల్ ప్రకారం గత సంవత్సరం రేటు పైన మొక్కజొన్నకు 10రూ,,లు, పెసరకు 12 రూ,,లు, వరికి 72 రూ,,లు, సజ్జలకు 125 రూ,,లు, వేరుశనగ కు 254 రూ,,లు తదితర పంటలకు అతి తక్కువ ధర పెంచుటకు నిర్ణయించారు. ఇది రైతందానికి గొడ్డలు పెట్టు లాంటిదన్నారు. ఇది సి2 కంటే సుమారు 30 శాతం తక్కువ అయినా ప్రభుత్వం తనను తాను సమర్ధించుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రాములు, బి చెన్నప్ప, గొల్ల లక్ష్మప్ప, జి నాగప్ప, వెంకటయ్య, బాలకృష్ణ , గుండెగారి అంజి, సక్రియ నాయక్, తదితర రైతులు పాల్గొన్నారు.

## సాహస వీరుడు సావర్కర్ నాగురావ్ నామాజీ

**నారాయణపేట మే 28 (వుదయం ప్రతినిధి)**



తొలి స్వాతంత్ర సమరయోధుడు దామోదర్ వీర సావర్కర్ సాహస వీరుడు అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావునామాజీ,సీనియర్ ఆర్ ఎస్ ఎస్ నేత జి. కుర్మన్నకొనియాడారు.సావర్కర్ 133వ జయంతి సందర్భంగా గురువారం నారాయణపేట జిల్లా కేంద్రం లో నీ వీర సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందీ హిందూ హిందుస్థాన్అన్న సావర్కర్ పిలుపు ఆనాటి యువతకు తారక మంత్రంగా పనిచేసిందన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో ఉగ్రుతలూగించి ఉరికొయ్యాలని కూడా పూల మాలలుగా అందుకున్న భగత్ సింగ్ ,రాజగురు సుఖదేవులతో సహా, జలియన్ వాలాబాగ్ ఊచకోతకు కారణమైన సైనిక జనరల్ లండన్ వీధిలోనే తన తుపాకి తూటాకు బలిచేసిన ఉద్ధం సింగ్ లాంటి యువకుల కేందరికో స్ఫూర్తి ప్రదాత అన్నారు 1857 ప్రథమ స్వాతంత్ర సంగ్రామ చరిత్ర రచయిత, అండమాన్ జైలులో కాలాపాని చీకటి గదిలో మూడు ఆ జీవన కారాగార శిక్షలను అనుభవించిన స్వాతంత్ర వీర వినాయక దామోదర సావర్కర్ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్,కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయ వాది నందు నామాజీ,జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్,జిల్లా ప్రధాన కార్య దర్శి లక్ష్మి శ్యామ్ సుందర్ గౌడ్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, ప్రభాకర్, నాయకులు నక్క సత్యనారాయణ,చిన్న రఘు,ఉమాకాంత్,కుర్వ శ్రీను,చలపతి, కుమార్,మణికంఠ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**నారాయణపేట టౌన్ మే 28 (వుదయం ప్రతినిధి)**

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్యారా లీగల్ వాలంటరీ యాదమ్మ అన్నారు. నారాయణపేట మండలం అమ్మిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సవస్థ నారాయనపేట వారి అధ్వర్యంలో గురువారం సురక్షిత్ బచ్చన్ (సురక్షిత మైన బాల్యం) సురక్షిత్ భవిష్య ( సురక్షితమైన భవిష్యత్) అంశము పై మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పై బాలా కార్మిక వ్యవస్థ పై బాల్య వివాహాలు ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లి చేసినట్లు తెలిస్తే పెళ్లి లో పాల్గొన అందరిపై కేసు నమోదు చేయడం జరుగుతుంది అన్నారు. పిల్లలను చదివించాలి లైంగిక వేధింపులకు గురికాకుండా చూడాలి సైబర్ మోసాలకు గురికాకుండా ఉండాలని పిల్లలకు ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే 1098 కి,న్యాయ పరమైన సలహాలు సూచనలు కావాలంటె 15100 కి ఫోన్ చేసి వివరాలు చెప్పాలని మహిళలకు సూచించారు.

## తల్లి జ్ఞాపకార్థం వైకుంఠ రథం విరాళం

**గజ్వేల్, మే 27 (వుదయం ప్రతినిధి)**




సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన శేగారి వేంకటమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త పెంటయ్య, కుమారుడు కోడలు నీలిమశ్రీనివాస్ కుటుంబ సభ్యులు కలిసి బుధవారం గ్రామపంచాయతీకి ఉచిత వైకుంఠ రథాన్ని అందజేశారు. గ్రామంలో అంతిమయాత్రల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను గమనించి, సామాజిక దృక్పథంతో ఈ రథాన్ని కొనుగోలు చేసి గ్రామస్తులకు అప్పగించారు.ఈ సందర్భంగా శేగారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన తల్లి జ్ఞాపకార్థం చివరి మజిలీ కార్యక్రమాలకు ఉపయో ఉంటుందని పేర్కొన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ఈ రథాన్ని గ్రామానికి అందుబాటులో ఉంచుతామని పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదస్ శ్రీనివాస్, తాజా సర్పంచ్ బ్యాగరి ప్రభాకర్ పాల్గొని శేగారి కుటుంబ సభ్యులను అభినందించారు. అలాగే విశ్వనాథ్ పంతులు, ఆందోల్ నర్సింలు, నరేందర్ రెడ్డి, పాల రమేష్ గౌడ్, ధర్మ రెడ్డి, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ సమక్షంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నియామక పత్రం స్వీకరణ

**సంగారెడ్డి వుదయం**

ఢిల్లీలోని ఇందిరా భవన్ లో జరిగిన అఖిల భారత దళిత కాంగ్రెస్ సమావేశంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన గాంగేరి శ్రీహరి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ సమక్షంలో నియామక పత్రం అందజేయడం జరిగింది.

ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు రాజేంద్ర పాల్ గౌతమ్ , జాతీయ సలహాదారు కొప్పుల రాజు , రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు కవంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలనలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళితులకు జరుగుతున్న అన్యాయాలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేద దళితుల పక్షాన నిలుస్తుందని అన్నారు.

# చక్కని ఆరోగ్యం

## బతికినంత కాలం రోగాలు లేకుండా ఉండాలంటే..



ఆయుష్షు ఎంతకాలం ఉంటుంది అన్నది కేవలం జన్యువులపై మాత్రమే ఆధారపడదని, జీవనశైలి, రోజువారీ అలవాట్లు కూడా పెద్ద పాత్ర పోషిస్తాయని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవిం చడం అనేది ఇప్పుడు వైద్య రంగంలో ప్రధా న చర్చగా మారింది. ముఖ్యంగా వ్యాయా మం, ఆహారం, నిద్ర, ఒత్తిడి నియంత్రణ, ధూమపానం, మద్యం వినియోగం, సామాజిక సంబంధాలు వంటి అంశాలు ఆరోగ్యకర వృద్ధాప్యంపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల ఆక్స్‌ఫర్డ్‌లో నిర్వహించిన స్మార్ట్ ఏజింగ్ సమ్మిట్‌లో విడుదలైన నివేదిక ప్రకారం, మనుషుల ఆరోగ్యకరమైన ఆయుష్షుపై వారి నియంత్రణ ఇప్పటివరకు అనుకున్నదానికంటే చాలా ఎక్కువగా ఉందని వెల్లడైంది. దీర్ఘాయుష్షు అంటే కేవలం ఎక్కువ సంవత్సరాలు జీవించడం మాత్రమే కాకుండా, వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా జీవించే సంవత్సరాలను పెంచడం అని పరిశోధకులు స్పష్టం చేస్తు న్నారు. నివేదిక ప్రకారం ధూమపానం ఇప్పటికీ అత్యంత ప్రమాదకర అలవాట్లలో ఒకటిగా ఉంది. ఇది అనారోగ్యకర వృద్ధాప్యానికి ప్రధాన కారణంగా మారుతోందని హెచ్చరిస్తున్నారు. వృద్ధాప్యంలో గుండె జబ్బులు, క్యాన్సర్, మతిమరుపు, డయాబెటిస్, ఊబకాయం వంటి సమస్యలకు జన్యువులు కొంతమేర ప్రభావం చూపినా, జీవనశైలి మరింత కీలకంగా మారుతోంది. బాల్యం నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరుచుకోవడం, మధ్య వయస్సు తర్వాత వాటిని కొనసాగించడం ఎంతో ముఖ్యమని నివేదిక పేర్కొంది. పలు విస్తృత అధ్యయనాల ప్రకారం మనుషుల ఆయుష్షులో జన్యువుల ప్రభావం పరిమితంగానే ఉంటుందని, పర్యావరణం, ప్రవర్తనా అలవాట్లు మరింత ప్రభావం చూపుతున్నాయని వెల్లడైంది. దశాబ్దాల పాటు కొనసాగిన అలవాట్లు గుండెజబ్బులు, టైప్–2 డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు, ఊబకాయం, మతిమరుపు వంటి సమస్యల ప్రమాదాన్ని ప్రభా వితం చేయగలవని నిపుణులు చెబుతున్నారు. కుటుంబ చరిత్ర లో వ్యాధులు ఉన్నప్పటికీ ఆరోగ్యకర జీవనశైలి వల్ల గణనీయమైన లాభాలు పొందవచ్చని వారు సూచిస్తున్నారు.

నిత్య వ్యాయామం ఆరోగ్యకర వృద్ధాప్యానికి అత్యంత ముఖ్యమైన అంశాల్లో ఒకటిగా గుర్తించబడుతోంది. క్రమం తప్పకుండా నడక, తేలికపాటి వ్యాయామం వంటి శారీరక చలనం గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణ, కండరాల బలం, మెదడు పనితీరు, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రోజూ కొద్దిసేపు నడవడం కూడా దీర్ఘకాలిక వ్యాధులు, అకాల మరణాల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. నిద్ర, ఒత్తిడి కూడా ఆయుష్షుపై ప్రభావం చూపుతున్న కీలక అంశాలుగా మారాయి. సరైన నిద్ర లేకపోతే అధిక రక్తపోటు, ఊబకాయం, డిప్రెషన్, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు), కార్టిసోల్ స్థాయిలు పెరిగి గుండె, మెటబాలిక్ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భావోద్వేగ సమతుల్యత, విశ్రాంతి, సామాజిక మద్దతు కూడా ఆరోగ్యకర వృద్ధాప్యంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని చెబుతున్నారు. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా సమతుల్యమైన పోషకాహారం కీలకమని పరిశోధకులు చెబుతున్నారు. కూరగాయలు, పండ్లు, పూర్తి ధాన్యాలు, పప్పులు, డ్రైఫ్రూట్స్, ఆరోగ్యకర కొవ్వులు ఎక్కువగా ఉండే ఆహారం దీర్ఘాయుష్షుతో సంబంధం కలిగి ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. మరోవైపు అధికంగా ప్రాసెస్డ్ ఫుడ్స్, చక్కెర పానీయాలు, ధూమపానం వంటి అలవాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. ఒంటరితనం, సామాజిక దూరం కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి.

మంచి సామాజిక సంబంధాలు మానసిక ధైర్యం, తక్కువ ఒత్తిడి, మెరుగైన మెదడు ఆరో గ్యం, ఆరోగ్యకర అలవాట్లకు మద్దతు ఇస్తాయి. భావోద్వేగ ఆరోగ్యం, శారీరక ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉంటాయి. ఆరోగ్యకర అలవాట్లు జీవితంలో ఆలస్యంగా ప్రారంభించినా ప్రయోజనాలు పొంద వచ్చు.

## రోజూ మామిడి పండును తింటే శరీరంలో వచ్చే మార్పులు..

వేసవి వచ్చిందంటే చాలు చాలామందికి ముందుగా గుర్తుకొచ్చే పండు మామిడిపండు. తీపి రుచి, సువాసనతోపాటు దీన్ని పోషకాల పరంగా కూడా ఎంతో విలువైనదిగా భావిస్తారు. అయితే ప్రతిరోజూ మామిడి తింటే శరీరంలో ఏం మార్పులు జరుగుతాయి? సరైన మోతాదులో తీసుకుంటే ఇది ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడుతుంది? అనే విషయాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.



ఒక కప్పు మామిడి ముక్కల్లో సుమారు 99 క్యాలరీలు, 25 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 2.6 గ్రాముల ఫైబర్‌తో పాటు విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం, కాపర్ వంటి పోషకాలు లభిస్తాయి. అందుకే మామిడి కేవలం తీపి పండు మాత్రమే కాకుండా శరీరానికి ఉపయోగపడే పోషకాల నిల్వగా కూడా చెప్పవచ్చు. అయితే ఇందులో సహజ చక్కెరలు ఎక్కువగా ఉండటంతో మోతాదు నియంత్రణ చాలా ముఖ్యం. ప్రతిరోజూ మామిడి తినడం ప్రారంభించిన మొదటి వారంలోనే శరీరానికి తక్షణ శక్తి అందుతుంది. సహజ కార్బోహైడ్రేట్లు త్వరగా ఎనర్జీ ఇస్తాయి. ఫైబర్ జీర్ణక్రియను కొంత నెమ్మదిగా చేసి ఎక్కువసేపు తృప్తి కలిగిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడమే కాకుండా మొక్కల ఆధారిత ఆహారాల్లోని ఐరన్‌ను శరీరం బాగా గ్రహించేందుకు సహాయపడుతుంది. ప్యాకెట్ స్నాక్స్ లేదా చక్కెర పానీయాల స్థానంలో మామిడి తీసుకుంటే తేలికైన ఆహారపు అలవాట్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. రెండో వారానికి వచ్చేసరికి మామిడిలోని ఫైబర్ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఇది మలబద్ధకాన్ని తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా ఉంచడంలో సహాయపడుతుంది. నీటి శాతం ఎక్కువగా ఉండటంతో శరీరానికి తేమను కూడా అందిస్తుంది. అయితే మితిమీరిన మోతాదులో తింటే కొంతమందిలో చక్కెర ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారు పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. మూడో వారానికి మామిడిలోని పోషకాల అసలు ప్రయోజనం కనిపించడం ప్రారంభమవుతుంది. విటమిన్ ఎ, విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, కణాల రక్షణకు తోడ్పడతాయి. విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ తయారీలో కూడా సహాయపడుతుంది. క్రమం తప్పకుండా పండ్లు తినని వారి ఆహారంలో మామిడి చేరితే పోషకాల లోటు కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది.

## 'జంక్ ఫుడ్'కు జంకుతున్న మనిషి మెదడు!



'జంక్ ఫుడ్'కు మనిషి మెదడు జంకిపోతున్నది. అధిక కొవ్వు, చక్కెరలతో నిండిన అనారోగ్యకరమైన ఆహారం.. మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఐర్లాండ్‌కు చెందిన యూనివర్సిటీ కాలేజ్ కార్క్ శాస్త్రవేత్తలు తాజాగా చేపట్టిన పరిశోధన.. ఈ విషయాలను తేల్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రఖ్యాత సైన్స్ జర్నల్ 'నేచర్ కమ్యూనికేషన్స్' ప్రచురించింది. ఈ సర్వే వివరాల ప్రకారం.. చిన్నతనంలో అధికంగా జంక్‌ఫుడ్ తినేవారిలో మెదడు ఆరోగ్యం దెబ్బతింటున్నది. వారు భవిష్యత్తులో ఆరోగ్యకరమైన ఆహారానికి మారినప్పటికీ.. అప్పటికే మెదడుకు జరిగిన నష్టం పూడ్చలేమని పరిశోధకుల మాట. బాల్యంలో అధిక కేలరీలతో నిండిన, పోషకాలు లేని జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల.. ఆకలిని, తినే అలవాట్లను నియంత్రించే మెదడులోని 'హైపోథాలమస్' భాగం దెబ్బతింటుంది. ఈ మార్పుల వల్ల భవిష్యత్తులోనూ మరింత కొవ్వు, చక్కెరలు ఉన్న ఆహారాన్నే కోరుకునేలా మెదడు రూపాంతరం చెందుతుంది. ఈ అధ్యయనంలో శాస్త్రవేత్తలు మరో ఆందోళనకర విషయాన్ని గుర్తించారు. పెద్దయ్యాక పౌష్టికాహారానికి మారినప్పుడు శరీర బరువు సాధారణ స్థితికి వచ్చినప్పటికీ.. మెదడులోని ఆకలి నియంత్రణ వ్యవస్థ మాత్రం పాత అలవాట్ల ప్రభావం నుంచి పూర్తిగా కోలుకోకపోవడం కనుగొన్నారు. అంటే, మెదడుపై జంక్‌ఫుడ్ ప్రభావం 'నిగూఢంగా' కొనసాగుతూనే ఉంటుందని వారు చెబుతున్నారు. అందుకే, చిన్న వయసులో ఏం తింటున్నారనేది చాలా ముఖ్యమనీ, బాల్యంలో తప్పుడు ఆహారపు అలవాట్లు భవిష్యత్తులో దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు. ఈ నష్టాన్ని కొంతవరకు అధిగమించడానికి శాస్త్రవేత్తలు ఒక మార్గాన్ని కూడా సూచించారు. జీర్ణవ్యవస్థలోని మంచి బ్యాక్టీరియా.. మెదడు ఆరోగ్యంతో ముడిపడి ఉంటుంది. కొన్ని ప్రోబయోటిక్స్ మెదడుపై జంక్‌ఫుడ్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలు, వెల్లుల్లి, అరటిపండ్లు, ఆస్పరాగస్ వంటి సహజ ఆహారాల్లో ఉండే ప్రీబయోటిక్ ఫైబర్ ఈ విషయంలో ముందుంటుంది. ఇది పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పెంచి, మెదడు పనితీరును, ఆహారపు అలవాట్లను మళ్లీ ఆరోగ్యకరమైన మార్గంలోకి తెచ్చేందుకు దోహదపడుతుంది. కాబట్టి, పిల్లలకు చిన్నవయసు నుంచే సహజమైన పౌష్టికాహారాన్ని అలవాటు చేయాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

## యుక్త వయస్కుల్లో పెరిగిన హిప్ సమస్యలు..

కోవిడ్ మహమ్మారి తర్వాత భారత్‌లో మరో ఆందోళనకర ఆరోగ్య సమస్య వేగంగా పెరుగుతోందని ఆర్థోపెడిక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువకులు, మధ్య వయస్కుల్లో హిప్ జాయింట్ సమస్యలు, అవాస్క్యులర్ నెక్రోసిస్ (AVN) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని వైద్యులు వెల్లడించారు. ఈ సమస్య వల్ల హిప్ ఎముకకు రక్త సరఫరా తగ్గిపోవడం లేదా ఆగిపోవడం జరుగుతుంది. ఫలితంగా తీవ్రమైన నొప్పి, నడవడంలో ఇబ్బంది, కీళ్లు దెబ్బతినడం వంటి సమస్యలు వస్తాయి. ఢిల్లీలో నిర్వహించిన 2వ ఢిల్లీ హిప్ 360 కాన్ఫరెన్స్‌లో నిపుణులు మాట్లాడుతూ కోవిడ్ తర్వాత కాలంలో హిప్ జాయింట్ల నష్టం వేగంగా పెరిగిందని, దీంతో టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సల సంఖ్య కూడా అధికమవుతోందని తెలిపారు. ఈ సమావేశాన్ని ఢిల్లీ ఆర్థోపెడిక్ అసోసియేషన్, ఇండియన్ ఆర్థ్రోప్లాస్టీ అసోసియేషన్ కలిసి నిర్వహించాయి.



దేశవ్యాప్తంగా ప్రముఖ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు ఇందులో పాల్గొని హిప్ జాయింట్ సమస్యలపై తాజా సాంకేతికతలు, చికిత్సా విధానాలపై చర్చించారు. వైద్యులు తెలిపిన ప్రకారం ప్రస్తుతం ఆసుపత్రులకు తీవ్రమైన హిప్ నొప్పి, కుంటుతూ నడవడం, కీళ్లు గట్టిపడటం వంటి సమస్యలతో వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా AVN, ప్రారంభ దశ హిప్ ఆర్థరైటిస్ సమస్యలు 30 నుంచి 40 ఏళ్ల వయసువారిలో ఎక్కువగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కోవిడ్ చికిత్స సమయంలో ఎక్కువ మోతాదులో లేదా ఎక్కువకాలం స్టెరాయిడ్లు వాడటం AVN ప్రమాదాన్ని పెంచే అవకాశముందని పలు అంతర్జాతీయ అధ్యయనాలు సూచించాయి. ముఖ్యంగా ఇప్పటికే రక్తనాళాలు లేదా మెటబాలిజం సంబంధిత సమస్యలు ఉన్నవారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. AVN ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించవు. చాలామంది తొలిదశలో వచ్చే తొడ భాగ నొప్పి లేదా గట్టిదనాన్ని సాధారణ కండరాల నొప్పిగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. ఫలితంగా సమస్య గుర్తించే సమయానికి హిప్ జాయింట్ తీవ్రంగా దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడుతుంది. చివరికి నడక సామర్థ్యాన్ని తిరిగి పొందడానికి హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స అవసరమవుతుంది. కోవిడ్ సమయంలో స్టెరాయిడ్లు అనేక మంది ప్రాణాలను కాపాడినప్పటికీ, కొన్ని సందర్భాల్లో అవి అధికంగా లేదా నియంత్రణ లేకుండా వాడటం వల్ల ఎముకలకు రక్త సరఫరా తగ్గి హిప్ జాయింట్ త్వరగా దెబ్బతినే ప్రమాదం పెరిగింది. ప్రస్తుతం చిన్న వయసులోనే హిప్ ఎముక కుంగిపోవడం, తీవ్రమైన ఆర్థరైటిస్‌తో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమవుతున్న రోగులు ఎక్కువగా కనిపిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

## స్విమ్మింగ్ పూల్‌లో జర జాగ్రత్త



ఎండల్లో హాయ్ హాయ్ అంటూ కేరింతలు కొడుతూ పిల్లలు స్విమ్మింగ్ పూల్స్‌కి వెళ్తున్నారు. స్విమ్మింగ్ సంతోషమే కాదు ఏదైనా ప్రమాదంలో ప్రాణాలు కాపాడుకునే నైపుణ్యం కూడా. కాబట్టి పిల్లలకు స్విమ్మింగ్ నేర్పించాలి. పట్టణాల్లో చాలా చోట్ల స్విమ్మింగ్ నేర్పించే బోర్డులు కనిపిస్తున్నాయి. పల్లెల్లో చెరువులు, బావుల్లో ఈత కొట్టేందుకు పిల్లలు ఇష్టపడుతుంటారు. పిల్లలకు స్విమ్మింగ్ మనోల్లాసంతోపాటు శరీర దారుఢ్యాన్నీ పెంచుతుంది. అయితే ఈ సందర్భంలోనూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు కొందరు. కాబట్టి తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు కొన్ని మెలకువలు నేర్పాలి. అప్పుడే ప్రమాదాలు జరగవు, అనారోగ్య సమస్యలు రావు. బాల్యంలో ఎక్కువమంది ఎదుర్కొనే ప్రమాదాల్లో ఊపిరితిత్తుల్లోకి నీళ్లు పోవడం ఒకటి. చిన్న పిల్లలు టబ్బుల్లో, స్విమ్మింగ్ పూల్‌లో ఒక్కోసారి మునిగి పోతారు. ఆ సందర్భంలో లైఫ్ రిస్క్‌ని ఎదుర్కొంటారు. పిల్లలు ఎదుర్కొనే ప్రాణాంతకమైన సమస్యల్లో ఇదీ ఒకటి. కాబట్టి పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలను స్విమ్మింగ్‌కి అనుమతించొద్దు. పిల్లలు ఈదుతున్నంత సేపూ పెద్దవాళ్లు గమనిస్తూనే ఉండాలి. కొంత సమయం ఈదగలుగుతున్నారని వారిని ఒంటరిగా వదలిపెట్టొద్దు. స్విమ్మింగ్ నేర్చుకోవడానికి వయో పరిమితి ఉంది. మూడు నుంచి నాలుగు ఏళ్ల వయసు పిల్లలు ఈత నేర్చుకోవచ్చు. అంతకంటే చిన్న వయసు పిల్లలకు చెప్పినా ఈదడం నేర్చుకోలేరు. కాబట్టి ప్రమాదాల బారినపడతారు.

## పిల్లలు ఆ వయస్సు నుంచే ధైర్యంగా ఉండాలంటే..

కొంతమంది పిల్లలు ఎంత ఒత్తిడి వచ్చినా కుంగిపోకుండా తట్టుకుని నిలబడగలుగుతారు. చదువు ఒత్తిడి, స్నేహితుల మధ్య సమస్యలు, ఓటమి లేదా జీవితంలో ఎదురయ్యే చిన్న, పెద్ద ఇబ్బందులను తట్టుకుని మళ్లీ సాధారణ స్థితికి రావడంలో వారు ప్రత్యేకంగా కనిపిస్తారు. దీనినే మానసిక ధైర్యం లేదా రెసిలియెన్స్‌గా నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఇది పుట్టుకతోనే వచ్చే లక్షణం మాత్రమే కాదని, కుటుంబ వాతావరణం, తల్లిదండ్రుల ప్రవర్తన, రోజువారీ అనుభవాలు కూడా దీనిపై ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. పిల్లలు ప్రతి సమస్య నుంచి పూర్తిగా రక్షించబడితే వారు బలంగా ఎదగరని అంటున్నారు. చిన్న చిన్న నిరాశలు, అపజయాలు, ఎదురు చూపులు కూడా పిల్లలకు జీవిత పాఠాలుగా మారుతాయని పేర్కొంటున్నారు. ప్రతి సారి వెంటనే సహాయం చేయకుండా, సమస్యను ఎలా పరిష్కరించాలో ఆలోచించే అవకాశం ఇవ్వడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సూచిస్తున్నారు. పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా చెప్పగల వాతావరణం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. బాధ, కోపం, భయం లేదా నిరాశ వంటి భావాలను అణచివేయకుండా వినిపించుకునే కుటుంబాల్లో పిల్లలు భావోద్వేగ పరంగా మరింత బలంగా ఎదుగుతారు. ఏడవొద్దు, భయపడకు అని చెప్పడం కంటే, నీకు ఎందుకు ఇలా అనిపిస్తోంది? అని అడగడం ఎక్కువ ఉపయోగకరం. తల్లిదండ్రులు చూపించే ప్రవర్తనే పిల్లలకు పెద్ద పాఠం. ఒత్తిడి వచ్చినప్పుడు పెద్దలు ఎలా స్పందిస్తారో పిల్లలు గమనిస్తుంటారు. సమస్యల సమయంలో ప్రశాంతంగా ఉండడం, తప్పులను అంగీకరించడం, మళ్లీ ప్రయత్నించడం వంటి అలవాట్లు పిల్లల్లో కూడా సహజంగా పెరుగుతాయి. పిల్లల్లో బాధ్యతాభావం పెంచడం కూడా మానసిక బలాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. చిన్న పనులు చేయించడం, నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించడం, తమ పనులు తామే చేసుకునే అలవాటు నేర్పించడం వల్ల వారు స్వతం త్రంగా ఆలోచించడం నేర్చుకుంటారు. స్నేహాలు, కుటుంబ బంధాలు, గురువులతో మంచి సంబంధాలు కూడా పిల్లల మానసిక ఆరోగ్యానికి కీలకం. తమను అర్థం చేసుకునే వారు ఉన్నారన్న భావన పిల్లలకు భద్రతను కలిగిస్తుంది. ఒక పిల్లవాడు ఒంటరిగా కాకుండా, తనకు తోడుగా ఎవరైనా ఉన్నారని భావించినప్పుడు కష్టాలను తట్టుకునే శక్తి పెరుగుతుంది. పిల్లల జీవితంలో పూర్తిగా ఒత్తిడి లేకుండా చేయడం సాధ్యం కాకపోయినా, ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం మాత్రం చాలా అవసరం.



## కూర్చుని పనిచేసేవారికి అలర్ట్..

ఆధునిక జీవనశైలిలో రోజుకు 8 గంటలకు పైగా కూర్చునే అలవాటు చాలా మందికి సాధారణంగా మారిపోయింది. ఆఫీసులో కంప్యూటర్ ముందు పని చేయడం, ట్రాఫిక్‌లో ఎక్కువసేపు డ్రైవింగ్ చేయ డం లేదా ఇంటికి వచ్చాక కూడా మొబైల్, టీవీల ఎదుట గంటల తరబడి కూర్చోవడం వల్ల శరీరంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా కాళ్లలో రక్త ప్రసరణ దెబ్బతిని, భవిష్యత్తులో రక్తనాళాల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం సహజంగా కదలికల కోసం నిర్మాణమైందని, కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కాళ్ల కండరాలు పనిచేయకుండా పోతాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కాళ్ల కండరాల కదలికలే రక్తాన్ని తిరిగి గుండె వైపు పంపించడంలో సహాయపడతాయి. అయితే గంటల తరబడి కూర్చుంటే ఈ ప్రక్రియ మందగించి రక్తం కాళ్లలోనే నిలిచిపోవడం ప్రారంభమవుతుంది. దీని వల్ల క్రమంగా రక్తనాళాల పనితీరు దెబ్బతింటుందని పేర్కొంటున్నారు. కాళ్లలో రక్త ప్రసరణ సరిగా లేకపోతే మొదట కనిపించే ముఖ్య లక్షణాల్లో ఒకటి మడమలు, పాదాలు, కాళ్ల దిగువ భాగంలో వాపు రావడం. దీన్ని పెరిఫెరల్ ఎడిమా అని పిలుస్తారు. ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల రక్తం కాళ్లలో నిలిచిపోవడంతో ద్రవం చర్మ కణజాలాల్లోకి చేరి వాపులకు కారణమవుతుంది. రోజు ముగిసే సమయానికి చెప్పులు బిగుతుగా అనిపించడం లేదా సాక్స్ తీసేసిన తర్వాత మడమల వద్ద గాట్లు కనిపించడం ఈ సమస్యకు సంకేతాలుగా చెప్పవచ్చు. అలాగే స్పైడర్ వీన్స్, వెరికోస్ వీన్స్ కనిపించడం కూడా ఇంకో ముఖ్య హెచ్చరిక సంకేతంగా చెప్పవచ్చు. సాధారణంగా రక్తనాళాల్లో ఉండే చిన్న వాల్వులు రక్తం వెనక్కి వెళ్లకుండా అడ్డుకుంటాయి. కానీ ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల కాళ్లలో ఒత్తిడి పెరిగి ఈ వాల్వులు బలహీనపడతాయి. ఫలితంగా చర్మం కింద ఎరుపు, నీలం లేదా ఊదా రంగులో సన్నని రక్తనాళాలు కనిపించడం ప్రారంభమవుతుంది. మరింత తీవ్రమైతే పెద్దగా వాపులకు గురై, మెలికలు తిరిగిన నీలి రంగు రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఇవి కేవలం అందానికి సంబంధించిన సమస్యలే కాకుండా రక్త ప్రసరణలో లోపానికి సంకేతాలని వైద్యులు చెబుతున్నారు. చాలాసేపు కూర్చున్న తర్వాత కాళ్లలో చిమ్మటలు రావడం, నిస్సత్తువగా అనిపించడం లేదా సూదులతో గుచ్చినట్లుగా అనిపించడం కూడా ప్రమాద సూచికలుగా చెబుతున్నారు. రక్త ప్రసరణ తగ్గిపోవడంతో నరాలకు సరైన ఆక్సిజన్, పోషకాలు అందక ఈ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా కాళ్లు ముడుచుకుని కూర్చోవడం లేదా సరైన కుర్చీలు ఉపయోగించకపోవడం వల్ల నరాలపై ఒత్తిడి పెరిగి పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఎక్కువసేపు కదలకుండా ఉండటం వల్ల వచ్చే అత్యంత ప్రమాదకర పరిస్థితి డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (DVT). కాళ్ల లోతైన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ఈ సమస్య వస్తుంది. ఆ గడ్డ రక్తప్రసరణ ద్వారా ఊపిరితిత్తులకు చేరితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమస్యలను నివారించడానికి చిన్న చిన్న అలవాట్లే చాలనని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి 30 నుంచి 60 నిమిషాలకు ఒకసారి లేచి నడవడం, స్ట్రెచింగ్ చేయడం, కాళ్ల వ్యాయామాలు చేయడం మంచిది. కూర్చునేటప్పుడు రెండు కాళ్లను నేలపై సరిగా ఉంచడం, కాళ్లు మడవకుండా ఉండడం, రోజులో కొంతసేపు కాళ్లను గుండె స్థాయి కంటే ఎత్తుగా పెట్టుకుని విశ్రాంతి తీసుకోవడం ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రోజంతా కుర్చీలో కూర్చోవడం తప్పనిసరి అయినా, కాళ్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. చిన్న లక్షణాలను ముందుగానే గుర్తిస్తే భవిష్యత్తులో తీవ్రమైన రక్తనాళాల సమస్యలను నివారించవచ్చు.



## పెరగనున్న హ్యూందాయ్ కార్ల ధరలు

ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ హ్యూందాయ్ కార్ల ధరలను పెంచనుంది. వేరియంట్‌ను బట్టి రూ.12,800 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. జూన్ 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. కమొడిటీ, ముడిసరకుల ధరలు పెరగడంతో కార్యకలాపాల వ్యయం భారంగా మారిందని కంపెనీ తెలిపింది. కార్లలో వేరియంట్లు, మోడళ్ల ఆధారంగా ఈ పెంపు వర్తిస్తుందని పేర్కొంది. వినియోగదారులపై భారం మోపాలనే ఉద్దేశం సంస్థకు లేదని, మార్కెట్ ధరల ప్రభావం కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది.




# ఒక శాతం కంపెనీలకే.. 95 శాతం లాభాలు..!



అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలో గత కొంతకాలంగా సంపద సృష్టి వేగంగా జరుగుతోంది. దానివల్ల అన్ని కంపెనీలూ లాభపడుతున్నాయనుకుంటే పొరపాటే. పెద్ద మొత్తంలో లాభాలను కొన్ని కంపెనీలు ఎగరేసుకుపోతున్నాయి. 95 శాతం మార్కెట్ లాభాలు కేవలం 1 శాతం కంపెనీలదేనని తాజాగా యెస్ సెక్యూరిటీస్ నివేదిక వెల్లడించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ప్రపంచ మార్కెట్ విలువ దాదాపు 12 ట్రిలియన్ డాలర్ల మేర పెరిగింది. ఇందులో దాదాపు 95 శాతం అంటే 11.4 ట్రిలియన్ డాలర్ల లాభాలు కేవలం 100 కంపెనీల స్టాక్స్‌కే దక్కాయని నివేదిక పేర్కొంది. మిగతా 0.6 ట్రిలియన్ డాలర్ల లాభాలు 9,900 కంపెనీలకు వచ్చాయని తెలిపింది. అత్యధికంగా అమెరికాకు చెందిన 53 కంపెనీలు మెజార్టీ లాభాలను ఆర్జించగా.. చైనా నుంచి 9, జపాన్ నుంచి 8, తైవాన్ నుంచి 6, దక్షిణ కొరియా నుంచి 5 కంపెనీల షేర్లు భారీగా రాణించాయి. ఆ టాప్-100 కంపెనీల మెజార్టీ లాభాలకు ప్రధాన కారణం ఏఐ అని నివేదిక పేర్కొంది. ఏఐ ఆధారిత కంపెనీలు రాణించడం వల్లే ఈ ఏడాదిలో అమెరికా, దక్షిణకొరియా, తైవాన్, జపాన్ మార్కెట్లు రికార్డు స్థాయిలో పెరిగాయి. అమెరికాకు చెందిన టెక్ బేస్డ్ స్టాక్ ఎక్స్ఛేంజీ నాస్‌డాక్ తొలిసారి 30వేల మార్క్ దాటింది. ఏఐ వినియోగంతో మైక్రాన్, శాన్‌డిస్క్, ఎన్విడియా వంటి కంపెనీలు మంచి ఫలితాలను ఆర్జించాయి. దీంతో ఆయా సంస్థల షేర్లు రాణించాయి. మరోవైపు, ఏఐ విస్తరణతో ఈ ఏడాది చిప్ తయారీ కంపెనీలకు బాగా కలిసొచ్చింది. ఇప్పటికే శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ వంటి సంస్థలు మార్కెట్ విలువలో ట్రిలియన్ డాలర్ల మార్క్ దాటగా.. తాజాగా దక్షిణ కొరియాకు చెందిన సెమీకండక్టర్ల సంస్థ ఎస్‌కే హైనిక్స్ ఈ జాబితాలో చేరింది. నేటి ట్రేడింగ్‌లో ఈ కంపెనీ షేర్లు 11.1శాతం మేర పెరగడంతో కంపెనీ మార్కెట్ విలువ 1.08 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు హైనిక్స్ షేరు విలువ 245 శాతం పెరగడం గమనార్హం.

# ఏఐ నిపుణులు దేశం దాటొద్దు..

ఈ సరికొత్త టెక్ యుగంలో కృత్రిమ మేధ నిపుణులకు భారీ డిమాండ్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తమ దేశ నైపుణ్యం ఇతరుల చేతికి చిక్కకుండా చైనా జాగ్రత్త పడుతున్నట్లు కనిపిస్తోంది. అందులోభాగంగానే ఏఐ నిపుణులు దేశం దాటొద్దంటూ నిషేధం విధించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అలీబాబా గ్రూప్ హోల్డింగ్ లిమిటెడ్, డీప్‌సీక్ వంటి సంస్థలకు చెందిన అగ్రశ్రేణి ఏఐ నిపుణుల విదేశీ ప్రయాణాలపై ఆంక్షలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. తన సాంకేతికతను పరిరక్షించుకునేందుకు, ఈ రంగంలో అమెరికాను అధిగమించే క్రమంలో వారిని వ్యూహాత్మక ఆస్తులుగా పరిగణిస్తూ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఒకవేళ ఆ నిపుణులు విదేశీ ప్రయాణం చేయాలనుకుంటే.. సంబంధిత అధికారుల వద్ద అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే చైనా ఈతరహా ఆంక్షలు విధించడం ఇదే తొలిసారి కాదు. కళాశాల పరిశోధకులు, అణుశాస్త్రవేత్తలు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన కీలక అధికారులు దేశం దాటే విషయంలో కొన్నేళ్లుగా ఆంక్షలు అమలుచేస్తోంది.




ఇప్పుడు ఆ జాబితాలోకి ఏఐ రంగాన్ని చేర్చింది. అయితే చైనా ప్రభుత్వం అతి జోక్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఏఐ స్టార్టప్ మానుస్‌ను రెండు బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసేందుకు మెటా సంస్థ ముందుకురాగా.. ఆ ప్రక్రియను ఆ దేశ నియంత్రణ సంస్థలు నిరోధించాయి. తమ సాంకేతికత, టాలెంట్ దేశం దాటకుండా చూసేందుకే ఈ డీల్‌ను అడ్డుకున్నాయి. అలాగే మానుస్ సహ వ్యవస్థాపకుల్లో ఇద్దరిని దేశం విడిచివెళ్లకుండా అధికారులు ఆంక్షలు విధించారు. అంతర్జాతీయ సంస్థల్లో పనిచేయాలనే లక్ష్యంతో ఉండే యువ ఇంజినీర్లపై ఈ చర్యలు ప్రభావం చూపించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈ వార్తలపై ప్రభుత్వం నుంచి కానీ.. కంపెనీల నుంచి కానీ ఎలాంటి స్పందనా రాలేదు.

# ఆన్‌లైన్‌లో అందుబాటులోకి ఐటీఆర్-2..




పన్ను రిటర్నులకు సంబంధించి ఆదాయపు పన్ను విభాగం ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో ఐటీఆర్-2 ఫారాన్ని అందుబాటులోకి తెచ్చింది. 2026-27 మదింపు సంవత్సరానికి గానూ ఐటీఆర్-2 ఆన్‌లైన్ ఫైలింగ్, ఎక్సెల్ యుటిలిటీని అందుబాటులోకి తెచ్చినట్లు 'ఎక్స్' వేదికగా బుధవారం పోస్టు చేసింది. చిన్న, మధ్యస్థాయి ఆదాయపు పన్ను చెల్లింపుదారుల కోసం ఐటీఆర్-1, ఐటీఆర్ 4ను మే 15న ఐటీ విభాగం ఎనేబుల్ చేసింది.
షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, లేదా ఇళ్లు/స్థలాల ఆస్తుల అమ్మకం ద్వారా మూలధన లాభాలు లేదా నష్టాలు ఉన్నవారు, విదేశాల నుంచి ఆదాయం పొందుతున్న వారు ఐటీఆర్-2 ఫారం ద్వారా రిటర్నులు దాఖలు చేయాలి. ఒకవేళ వార్షికాదాయం రూ.50లక్షల లోపు ఉండి, జీతం లేదా పింఛను ద్వారా ఆదాయం వచ్చే వారు ఐటీఆర్-1ను ఎంచుకోవాలి. ఈ ఏడాది వచ్చిన కొత్త మార్పుల ప్రకారం రెండు ఇళ్ల వరకూ ఆస్తి ఉన్నవారూ ఐటీఆర్-1 వాడుకునే వెసులుబాటు కల్పించారు. సెక్షన్ 112ఏ కింద రూ.1.25 లక్షల లోపు దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ) ఉన్నవారూ ఈ ఐటీఆర్‌ను దాఖలు చేయొచ్చు.
సొంతంగా వ్యాపారం లేదా వృత్తిపరమైన ఆదాయాలు ఉన్న వారు, షేర్ మార్కెట్లో ఇంట్రాడే, ఫ్యూచర్స్, ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) లావాదేవీలు చేసేవారు ఐటీఆర్-3, ఐటీఆర్-4 (సుగమ్) ఉపయోగించాలి. కీలక ఫారాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో రిటర్నులు దాఖలు ప్రక్రియ ప్రారంభించవచ్చు. అయితే, వేతన జీవులు ఫారం-16 అందుకున్నాకే రిటర్నులు దాఖలు చేయడం మంచిది. జులై 31లోపు రిటర్నుల ప్రక్రియను పూర్తి చేయాలి.

# జూన్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం పెరగొచ్చు..



పసిడి, వెండిపై దిగుమతి సుంకాన్ని, పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలను పెంచిన కారణంగా జూన్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణం 5 శాతానికి పెరగొచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఇంధన ధరల పెంపు ప్రభావం పూర్తిగా కనిపించే వరకు, కీలక రేట్లను పెంచే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈనెల 15తో ప్రారంభించి గత 11 రోజుల్లో పెట్రోలు, డీజిల్ రిటెయిల్ ధర లీటరుకు సగటున రూ.7.50 (రాష్ట్రాల వారీగా వ్యత్యాసం ఉండొచ్చు) పెరిగింది. పెట్రోలు, డీజిల్‌పై ఆధారపడే.. ముఖ్యంగా రవాణా, విద్యుత్ రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రవాణా వ్యయాలు పెరిగితే, అన్ని రకాల వస్తువులు, సేవల ధరలపైనా ప్రభావం పడుతుంది. 'పెట్రో ధరల పెంపు వల్ల రిటెయిల్ ద్రవ్యోల్బణం 75 బేసిస్ పాయింట్ల వరకు పెరగొచ్చు. 2026 ఏప్రిల్‌లో 3.48 శాతంగా ఉన్న రిటెయిల్ ద్రవ్యోల్బణం, మేలో 4-4.5 శాతానికి, జూన్‌లో 4.5- 5 శాతానికి పెరిగే అవకాశం ఉంద'ని ఈవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వయిజర్ డి కె శ్రీవాస్తవ తెలిపారు. మే నెల రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాలు జూన్ 12న విడుదల అవుతాయి. రిటెయిల్ ద్రవ్యోల్బణం 5 శాతానికి మించి నమోదై.. మరింతగా పెరగొచ్చనే సంకేతాలు కనిపిస్తే కీలక రేట్లను పెంచే దిశగా ఆర్‌బీఐ అడుగులు వేయొచ్చని శ్రీవాస్తవ విశ్లేషించారు. జూన్ మొదటివారంలో జరిగే సమీక్షలో కీలక రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచే అవకాశం ఉందని కొందరు ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. మే ద్రవ్యోల్బణ గణాంకాలపై ఇంధన ధరల పెంపు ప్రభావం పాక్షికంగానే ఉంటుందని, జూన్‌లో ఇది మరింతగా విస్తరిస్తుందని ఇక్రా ముఖ్య ఆర్థికవేత్త అదితి నాయర్ అభిప్రాయపడ్డారు.

# యాంటీడంపింగ్ సుంకాలు విధిస్తే.. ఇండియాకు ఏటా రూ.28,540కోట్ల ఆదాయం



యాంటీ డంపింగ్ సుంకాలు విధిస్తే భారత్ ఏటా రూ.28,540 కోట్ల అదనపు ఆదాయం ఆర్జించవచ్చు. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కొన్ని ఉత్పత్తులకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఉండటంతో దేశ ఖజానా భారీగా నష్టపోతోందని సెంటర్ ఫర్ డిజిటల్ ఎకానమీ పాలసీ రీసెర్చ్, సెంటర్ ఫర్ డబ్ల్యూటీఓ స్టడీస్ సంయుక్తంగా ఓ నివేదికను విడుదల చేశాయి. విదేశీ ఉత్పత్తుల ద్వారా స్థానిక విక్రయాలు తగ్గడంతో దేశంలో ఉద్యోగ కోతలు పెరుగుతున్నాయని ఈ నివేదిక హెచ్చరించింది. విదేశాల నుంచి చౌక ధరలకు దిగుమతి చేసుకుంటున్న వస్తువుల నుంచి దేశీయ ఉత్పత్తులను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విధించే పన్ను యాంటీ డంపింగ్ డ్యూటీ. వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస్ దీన్ని పర్యవేక్షిస్తుంది. డీజీటీఆర్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ సుంకాలను విధిస్తుంది. డీజీటీఆర్ సిఫార్సు చేసిన సుంకాలను 2020 వరకు ప్రభుత్వం వెంటనే అమలు చేసిందని ఈ నివేదిక పేర్కొంది.




## ఇనియన్‌కు రెండు స్వర్ణాలు



కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు అదరగొట్టారు. మూడు విభాగాల్లో కలిపి మొత్తం 8 పతకాలతో మెరిశారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో ఇనియన్ పన్నీర్ సెల్వం స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నాడు. ప్రతి విభాగంలో ఏడు రౌండ్లు ఆడిన అతడు రెండింటిలోనూ 6.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ర్యాపిడ్ విభాగంలో శ్రీహరి రజతం, మిత్రాబా కాంస్యం గెలిచారు. బ్లిట్జ్ విభాగంలో రోహిత్ కృష్ణ రజతం దక్కించుకోగా.. శ్రీహరి కాంస్యంతో మరో పతకం తన ఖాతాలో వేసుకున్నాడు. క్లాసికల్ విభాగంలోనూ భారత్‌దే ఆధిపత్యం. మిత్రాబా టైటిల్ సొంతం చేసుకోగా.. శ్రీహరి కాంస్య పతకం దక్కించుకున్నాడు. అయితే రజతం మాత్రం శ్రీలంక ఆటగాడు రనిందు లియనాగె గెలిచాడు.

# అదే మా కొంపముంచింది: శుభ్‌మన్ గిల్

తొలి క్వాలిఫయర్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దెబ్బకు గుజరాత్ టైటాన్స్ కుదేలైంది. కెప్టెన్ రజత్ పాటీదార్ (93 నాటౌట్; 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో తొలుత బెంగళూరు 254 పరుగుల కొండంత స్కోరు సాధించింది. లక్ష్యఛేదనలో గుజరాత్ 162 రన్స్‌కే ఆలౌటైంది. టాప్-3 బ్యాటర్లు సాయి సుదర్శన్ (14), శుభ్‌మన్ గిల్ (2), జోస్ బట్లర్ (29) నిరాశపర్చడంతో గుజరాత్ ఓటమి చాలా ముందుగానే ఖరారైపోయింది. తమ ఓటమికి కారణం ప్రధానంగా ఫీల్డింగ్ వైఫల్యమేనని గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వ్యాఖ్యానించాడు. పాటీదార్ వ్యక్తిగత స్కోరు 14, 20 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌లను కుల్వంత్ ఖేజ్రోలియా, కగిసో రబాడ మిస్ చేశారు. తర్వాత ఆర్సీబీ కెప్టెన్ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. "12, 13 ఓవర్ల వరకు మా ప్రదర్శన చాలా బాగానే సాగిందని నేను భావిస్తున్నా. అయితే, మా ఫీల్డింగ్ మాత్రం ఆశించిన స్థాయిలో లేదనిపిస్తోంది. మేం కొన్ని క్యాచ్‌లను వదిలేశాం. మా గ్రౌండ్ ఫీల్డింగ్ కూడా అంత గొప్పగా లేదు.



ఈ మ్యాచ్ నుంచి మేం నేర్చుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. వీలైనంత త్వరగా మర్చిపోవాల్సిన మ్యాచ్‌ల్లో ఇది ఒకటి. పవర్‌ప్లేలో మంచి ఆరంభం లభించి ఉంటే ఎంత పెద్ద లక్ష్యాన్నైనా ఛేదించగలిగేవాళ్లం. ఫీల్డింగ్ లోపాలపై జట్టు సమావేశాలతోపాటు ప్రాక్టీస్ సెషన్లలో చర్చిస్తాం. ఈ రోజు మాకు కలిసి రాలేదని నా అభిప్రాయం. మాలో పట్టుదల, తీవ్రత ఏమాత్రం తగ్గలేదు. కానీ, ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో మాత్రం మేం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాం" అని గిల్ పేర్కొన్నాడు.
ఈ మ్యాచ్‌లో ఓడినా ఫైనల్‌కు వెళ్లడానికి గుజరాత్‌కు మరో ఛాన్స్ ఉంది. ఎలిమినేటర్ విజేత (సన్‌రైజర్స్ హైదరాబాద్ vs రాజస్థాన్ రాయల్స్)తో క్వాలిఫయర్-2లో జీటీ తలపడుతుంది.

# సక్సెస్ సీక్రెట్ ఇదే



డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ.. మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుగా ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. బెంగళూరు పేసర్ భువనేశ్వర్ సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థి జట్ల బ్యాటర్లను బెంబేలెత్తిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గుజరాత్‌తో క్వాలిఫయర్‌లో రెండు వికెట్లు పడగొట్టిన భువీ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. బ్యాటర్లను ఎలా వికెట్ల ముందు దొరకబుచ్చుకోవాలి, ఏవిధంగా క్లీన్‌బౌల్డ్ చేయాలనే తమ బౌలింగ్ ప్రణాళికల గురించి వివరించాడు. తమ విజయంలో డేటా (గణాంకాలు) ఎలాంటి పాత్ర పోషిస్తుందో తెలిపాడు. "తెర వెనుక జరిగిన ప్రణాళికకు చాలావరకు ఘనత దక్కుతుంది. మేం (నేను, జోష్ హేజిల్‌వుడ్) మా అనుభవాన్ని రంగరించాం. సపోర్టింగ్ స్టాఫ్ అందిస్తున్న సహకారం మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మేం డేటా (గణాంకాల) ఆధారంగా పనిచేస్తాం. ఆటగాళ్లు ఏదైనా కొత్త పద్ధతులను అనుసరిస్తుంటే వాటిని నిశితంగా పరిశీలిస్తాం. అయితే, కేవలం గణాంకాల పైనే 100 శాతం ఆధారపడం. కానీ, అవి మాకు కచ్చితంగా సహాయపడతాయి" అని భువీ పేర్కొన్నాడు. తన, జట్టు బౌలింగ్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ.. షార్ట్ లేదా ఫుల్లర్ బంతులు సంధిస్తే బౌండరీకి వెళ్తాయి.

అది ఒక తెలివి తక్కువ ప్రశ్న.. రిపోర్టర్‌పై గుజరాత్ బ్యాటర్ ఆగ్రహం

"బ్యాటర్ బలమేంటో బౌలర్ అర్థం చేసుకోవాలి. దాని ఆధారంగా ఎలా బౌలింగ్ చేయాలో తెలుసుకోవాలి. ప్రతి జట్టులోనూ ప్రత్యర్థి చేతిలోంచి మ్యాచ్‌ను లాగేసుకోగల ఒకరిద్దరు ఆటగాళ్లు ఉన్నప్పుడు మనం ప్లాన్ బి లేదా ప్లాన్ సి రూపొందించుకోవడంపై కాస్త ఎక్కువ సమయమే వెచ్చిస్తాం. వైభవ్ సూర్యవంశీ కోసం ప్రత్యేకంగా ప్రణాళిక

# వైభవ్ సూర్యవంశీ కోసం మూడు ప్లాన్‌లు సిద్ధం: కమిన్స్

ఐపీఎల్ 2026లో కీలక సమరానికి వేళైంది. నేడు ముల్లాన్‌పుర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH), రాజస్థాన్ రాయల్స్ (RR)జట్లు తలపడనున్నాయి. ఇందులో గెలిచిన జట్టు గుజరాత్ టైటాన్స్‌తో క్వాలిఫయర్-2 ఆడుతుంది. ఓడిన టీమ్ ఇంటిముఖం పడుతుంది. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే రాజస్థాన్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన 'ఆరెంజ్ ఆర్మీ' హ్యాట్రిక్ విజయంపై కన్నేసింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడోనని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్‌లో ఉప్పల్‌లో జరిగిన పోరులో వైభవ్ డకౌటయ్యాడు. కానీ, జైపుర్‌లో శతకం బాదేశాడు. సూర్యవంశీ మరోసారి చెలరేగితే వార్ వన్‌సైడ్ అయిపోవడం ఖాయం. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఈ కుర్రాడిని కట్టడి చేయడానికి ప్లాన్-ఎ సరిపోదని, అందుకే మూడు విభిన్న ప్లాన్‌లు సిద్ధం చేశామని సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు.



రచించాం. గతసారి మాపై అతను శతకం సాధించినప్పటికీ, అంతకుముందు కట్టడి చేయగలిగాం. కొన్ని సందర్భాల్లో మాత్రం వైభవ్ చెలరేగిపోయాడు. ఆ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటాం. ఈ సీజన్‌లో వారితో ఇప్పటికే రెండుసార్లు తలపడ్డాం. రాజస్థాన్ జట్టులోని చాలామంది ఆటగాళ్లను మేం నిశితంగా పరిశీలించాం.

# ఆ ప్లాన్ సక్సెస్ అయింది: రజత్ పాటీదార్

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన తొలి క్వాలిఫయర్‌లో ఆర్సీబీ విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు విజయం సాధించడంలో ఆ జట్టు కెప్టెన్ రజత్ పాటీదార్ కీలక పాత్ర పోషించాడు. 33 బంతుల్లోనే 93 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మ్యాచ్ అనంతరం పాటీదార్ మాట్లాడాడు. తాను వికెట్ గురించి పట్టించుకోనని, బౌలర్లపై ఒత్తిడి పెంచడమే తనకు ఇష్టమని పేర్కొన్నాడు. "ఇది మాకు ఒక అద్భుతమైన మ్యాచ్. మా



బ్యాటర్లు ఆధిపత్యం చెలాయించారు. ప్రతిఒక్కరూ పట్టుదలతో దూకుడుగా ఆడటం మాకు బాగా ఉపయోగపడింది. గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాలనే కచ్చితమైన ప్రణాళికతో రాలేదు. కానీ, మేం దానికి సిద్ధంగా ఉన్నాం. ఎందుకంటే 'మేం అటాకింగ్ గేమ్ ఆడబోతున్నామని మా బాడీ లాంగ్వేజ్‌తో వారికి తెలియజేయాలి. అది ప్రతి బ్యాటర్‌లోనూ కనిపించిందని నేను అనుకుంటున్నాను. మేం జట్టు సమావేశంలో దీని గురించి చర్చించుకున్నాం. ఇది చాలా కీలకమైన దశ. ఈ మ్యాచ్‌లో మేం ఆడిన తీరు, ఆధిపత్యం చెలాయించిన విధానం అద్భుతంగా ఉందని నేను భావిస్తున్నాను. నా బ్యాటింగ్ శైలి జట్టులోని మిగతా వారి శైలికి దాదాపు సమానంగానే ఉంటుందని నేను భావిస్తాను. ఇన్నింగ్స్ ఆరంభంలో పిచ్ ఎలా స్పందిస్తోందోనని గమనించడానికి 8 నుంచి 10 బంతులు నెమ్మదిగా ఆడతా. ఆ తర్వాత నేను ఎలా ముందుకుసాగాలనే విషయంపై నాకు పూర్తి స్పష్టత లభిస్తుంది. అప్పుడు నా వికెట్ గురించి నేను అస్సలు ఆందోళన చెందను. బౌలర్‌పై ఒత్తిడి పెంచడాన్ని ఇష్టపడతాను. గిల్, సుదర్శన్, బట్లర్‌ను పవర్ ప్లేలో ఔట్ చేయాలనుకున్నాం. ఆ ప్లాన్ సక్సెస్ అయింది" అని రజత్ పాటీదార్ వివరించాడు.

వుదయం సినిమా MOVIE TIME!

## ‘ది రెడ్ బ్యాగ్’ చిత్రం నుంచి హీరోయిన్ రాధ్య పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్

డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి, మెమరీ మేకర్స్ బ్యానర్ మీద ‘ది రెడ్ బ్యాగ్’ అనే సినిమాని నిర్మిస్తున్నారు. బ్యాగ్ చుట్టూ తిరిగే ఈ మూవీకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రంలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. రీసెంట్‌గా రాశీ పాత్రకు సంబంధించిన పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది.



# ప్రధాని మోదీ గారు ‘పెద్ది’ గురించి అడిగారు..రామ్ చరణ్




**వుదయం:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఢిల్లీలో గ్రాండ్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఢిల్లీ ప్రెస్ మీట్ లో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా కోసం మేమంతా ఎంతో నిజాయితీగా పనిచేశాం. అంకితభావం కలిగిన దర్శకుడు బుచ్చిబాబు గారు, నిర్మాత సతీష్ గారు, లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ గారు, బోమన్ ఇరానీ గారు, దివ్యేందు ఇలా అద్భుతమైన టీమ్‌తో కలిసి పని చేయడం చాలా ఆనందంగా అనిపించింది. దేవుడి దయ వల్లే ఇదంతా సాధ్యమైందని భావిస్తున్నాను. గత రెండున్నర సంవత్సరాలుగా ఎంతో డెడికేషన్‌తో ఈ సినిమా చేశాం. ఇది చాలా గొప్ప ఎంటర్‌టైనర్. ప్రేక్షకులను ఇన్‌స్పైర్ చేసే సినిమా. ఈ సినిమాను పిల్లలతో కలిసి థియేటర్లలో చూడండి. వాళ్లు చాలా ఇన్‌స్పైర్ అవుతారు. ఇది మట్టి వాసన ఉన్న కథ.

# ఆగష్టు 14న విడుదల కానున్న ‘విశ్వనాథ్ & సన్స్’



**వుదయం:** సూర్య – వెంకీ అట్లూరి కలయికలో రూపొందుతోన్న ‘విశ్వనాథ్ & సన్స్’ చిత్రం ఈ స్వాతంత్ర్య దినోత్సవ వారాంతంలో ఒక అద్భుతమైన కుటుంబ వినోదాన్ని అందించడానికి ప్రేక్షకుల ముందుకు రానుంది.సూర్య అభిమానులతో పాటు, సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యామిలీ డ్రామా ‘విశ్వనాథ్ & సన్స్’ ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 14న ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భావోద్వేగాలు, హాస్యం, హృదయాన్ని తాకే కుటుంబ అనుబంధాలతో ఈ సినిమా ప్రేక్షకులకు పూర్తి స్థాయి వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతోంది. టీజర్, టైటిల్ ప్రకటన వెలువడినప్పటి నుంచే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా చిన్నారితో కలిసి సూర్య కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు ఆయన వింటేజ్ చార్మ్‌ను గుర్తు చేస్తూ కుటుంబ ప్రేక్షకులను తక్షణమే ఆకట్టుకున్నాయి.‘సార్ / వాథి’, ‘లక్కీ భాస్కర్’ వంటి వరుస విజయవంతమైన చిత్రాలను అందించిన దర్శకుడు వెంకీ అట్లూరి, మరోసారి బలమైన కుటుంబ విలువలు, హృద్యమైన కథనం కలిగిన ఒక ఫీల్ గుడ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌ను అందించబోతున్నారు.ఈ చిత్రంలో మమితా బైజు, రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, నిమిష్ రవి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# ‘త్రికాల’ మూవీ రివ్యూ

**వుదయం:** తెలుగు సినీ పరిశ్రమలో కొత్త తరహా మైథలాజికల్ డార్క్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన మూవీ ‘త్రికాల’. ఎ స్క్రిప్ట్ ఆఫ్ గాడ్ అనేది సబ్‌టైటిల్. దర్శకుడు మణి తెల్లగూటి తెరకెక్కించిన ఈ సినిమా కర్మ సిద్ధాంతం, పునర్జన్మ, తాంత్రిక శక్తులు, మానసిక భయం, మానవ భావోద్వేగాలను ఒకే కథలో మిళితం చేసిన విజువల్ వండర్. టీజర్, ట్రైలర్, పోస్టర్లు చూసినప్పటి నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన ఈ చిత్రం, ‘తుంబాడ్’, ‘కాంతార’ తరహా డార్క్ మిస్టిక్ వరల్డ్‌ను గుర్తు చేసింది. తాజాగా చాగంటి ప్రొడక్షన్ ‘త్రికాల’ సినిమాను వరల్డ్ వైడ్‌గా థియేటర్లలో విడుదల చేసింది. ఇంతకీ మూవీ ఎలా ఉందో రివ్యూ రిపోర్ట్‌లో తెలుసుకుందాం.

కథ:శతాబ్దాల క్రితం “కుమారి ఖండం” అనే ఒక పౌరాణిక భూభాగంలో కథ ప్రారంభమవుతుంది. అక్కడి మునులు అత్యంత శక్తివంతమైన తాంత్రిక గ్రంథాలు, ప్రాచీన సాంకేతిక రహస్యాలను అసురుల చేతికి చిక్కకుండా రహస్య ప్రదేశంలో దాచిపెడతారు. ఆ సీక్రెట్స్‌ను కాపాడేందుకు “శక్తి ఏథా” అనే దైవిక ఆయుధాన్ని సృష్టించి, దానిని వీరరాజు త్రికాల వర్మకు అప్పగిస్తారు. అసుర శక్తులపై పోరాడుతూ అతడు మరణించగా, మునులు అతని ఆత్మను ఒక మాయా అండంలో బంధిస్తారు. కలియుగంలో ప్రపంచానికి భారీ ముప్పు వచ్చినప్పుడు ఆ ఆత్మ మళ్లీ మేల్కొంటుందని వారు చెబుతారు.ప్రస్తుత కాలంలో శివ (మాస్టర్ మహేంద్రన్) అనే యువకుడు అదృశ్యమైన తన ప్రేయసి నిధి (సాహితి) కోసం నగరానికి వస్తాడు. అతని దగ్గర ఒక దుష్టశక్తి ఆవహించిన ఫోన్ ఉంటుంది. ఈ క్రమంలో అతనికి వైతరణ్ (అజయ్) అనే విచిత్రమైన వ్యక్తి గురించి తెలుస్తుంది. సూర్యరశ్మిని తట్టుకోలేని ‘పోర్ఫిరియా’ వ్యాధితో బాధపడుతున్న వైతరణ్, నిజానికి పునర్జన్మ ఎత్తిన త్రికాలవర్మ. కుటుంబ సంఘర్షణలు, మానసిక వేదనలతో అతను తన తండ్రిని, పినతల్లి (ఆమని)ని హత్య చేసి ఆత్మహత్య చేసుకుంటాడు.




# "ఒక్క అడుగు" టైటిల్ & ఫస్ట్ లుక్

**వుదయం:** సిరి క్రియేషన్స్ బ్యానర్ పై శేఖర్ మోడల్ రచనా దర్శకత్వంలో తానే కథానాయకుడిగా నటిస్తూ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "ఒక్క అడుగు". సుభాష్ ఆనంద్ సంగీతాన్ని అందించనున్న ఈ చిత్రానికి సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫీ చేయగా రాఘవేందర్ ఎడిటింగ్ చేస్తున్నాను. సినీ ప్రముఖులు వివిఎన్ ఆదిత్య, అశోక్ కుమార్, సముద్ర, పద్మిని నాగులపల్లి, రామ సత్య నారాయణ, సత్య మాస్టర్ చేతుల మీదగా ఈ చిత్ర టైటిల్ & ఫస్ట్ లుక్ "ఒక్క అడుగు" లాంచ్ చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా నటుడు మురళి మాట్లాడుతూ... "అందరికి నమస్కారం. ఒక టీచర్ గా దర్శకుడు శేఖర్ కి ఉన్న కమాండ్ చాలా ఆశ్చర్య పరిచింది. ఈ సినిమాతో ఆయనకు ఎంతో సహకరించాలి అనుకున్నాము కాని ఆయన కూడా అలాగే ఆయన ఆలోచనతో ముందుకు వచ్చారు" అన్నారు. సత్య మాస్టర్ గారు మాట్లాడుతూ... "ఎటువంటి సినిమాకి అయిన పెద్ద వారి ఆశీర్వాదం ఉండా లి. ఈ సినిమాకు వచ్చిన పెద్ద లకు కృతజ్ఞతలు. శేఖర్ మోడ ల్ మా స్టూడియోలో ఒక భాగం కావడం చాలా సంతో షం. కొత్త వారిని ప్రోత్సహించాలని ఆయన ముందుకు వచ్చారు. ఒక్క అడుగుతో ఆయన ద్వారా అందరికీ మంచి పేరు రావాలని, సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ప్రభాస్ డైలాగ్ ఎంతో ఫేమస్, అలాగే ఈ సినిమా కూడా ఫేమస్ గా మారి అందరిలోకి వెళ్ళాలని కోరుకుంటున్నాను" అన్నారు.



# "సమవర్తి" నుంచి 'బిహైండ్ ది వుడ్స్ ఆఫ్ సమవర్తి' (మేకింగ్) రిలీజ్

**వుదయం:** వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా నటిస్తున్న కొత్త చిత్రానికి "సమవర్తి" అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఈ రోజు ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. "సమవర్తి" సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ & పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.ఈ రోజు "సమవర్తి" సినిమా నుంచి 'బిహైండ్ ది వుడ్స్ ఆఫ్ సమవర్తి' (మేకింగ్) రిలీజ్ చేశారు. విష సర్పాలు, క్రూర మృగాలు ఉన్న ప్రమాదకరమైన అడవుల్లో "సమవర్తి" షూటింగ్ ఎంత సాహసోపేతంగా చేశారో ఈ గ్లింప్స్ లో కనిపిస్తోంది. సౌతిండియాలోని 7 అరణ్య ప్రాంతాల్లో, ఇప్పటిదాకా ఎవరూ వెళ్లని 42 లొకేషన్స్ లో ఈ సినిమా షూటింగ్ చేయడం విశేషం.



# ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’ నుంచి తొలి సాంగ్



**వుదయం:** డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. వడ్డే నవీన్‌తో కలిసి కథ స్క్రీన్ ప్లేలో ఈయన భాగమయ్యారు. వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాథ్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో గత కొన్ని సంవత్సరాలుగా సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన వడ్డే నవీన్, ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు చిత్రంతో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. రీసెంట్‌గా రిలీజైన టీజర్ అందరి దృష్టిని ఆకర్షించి సూపర్బ్ రెస్పాన్స్‌ను తెచ్చుకుంది. విజువల్స్‌ను బట్టి చూస్తే సినిమా ఎంటర్‌టైనర్ అని తెలుస్తోంది. వడ్డే నవీన్ నటనలో కొత్త కోణాన్ని ఈ చిత్రం

# పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన "లఫూట్ గ్యాంగ్"



**వుదయం:** ఎల్ఆర్ఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై కొండాపూర్ లక్ష్మీ కాంత్ రెడ్డి నిర్మాతగా అనురాగ్ అధర్వ రాజు రచనా దర్శకత్వంలో వర్ధన్ మయూర్ కొయ్యాడ సినిమాటోగ్రాఫర్ గా ప్రారంభమైన చిత్రం లఫూట్ గ్యాంగ్. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధృవన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా టి సి ప్రసన్నకుమార్ ఎడిటర్ గా పనిచేస్తున్నారు. వెంకటేష్ అత్తిలి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస్ కంతెపాలెం, రాంబాబు కుశ రైటర్స్ గా పనిచేస్తున్నారు. హైదరాబాదులోని రామానాయుడు స్టూడియోస్ లో పూజ కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఈ చిత్రం ప్రారంభానికి దర్శకుడు పవన్ సాధినేని, నిర్మాత బివిఎస్ రవి, ప్రముఖ నటులు రాజ్ తరుణ్, ఆకాష్ పూరి, అలీ, రాహుల్ విజయ్, నటి దీప్తిక, అర్చన అయ్యర్, దర్శక నిర్మాత అనిల్ కడియాల తదితరులు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.